
'ప్రజల జీవన ప్రమాణాలు ఇంకా మెరుగు పడాలి. అందుకు అధికారులు నిబద్ధత, పారదర్శకత, కార్యదీక్షతో పనిచేయాలి.'

సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+12 వెల: ₹ 5.00

సంపుటి: 12
సంచిక: 211

మంగళవారం 22-10-2019

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




**నేడు బ్యాంకుల సమ్మె**

విలీనాలు, ఇతర అంశాలకు నిరసన. సమ్మె ప్రభావం స్వల్పమే -బిజినెస్‌లో



**నేడే క్లీన్‌స్వీప్...**

దక్షిణాఫ్రికాపై 3వ టెస్టులో విజయానికి 2 వికెట్ల దూరంలో భారత్ –స్పోర్ట్స్‌లో

# చిన్నారుల ప్రాణాలతో చెలగాటం



ఓ చిన్నారిని మరో ఆస్పత్రికి తరలిస్తున్న కుటుంబ సభ్యులు

**షైన్ ఆస్పత్రిలో షార్ట్ సర్క్యూట్‌తో**

## పేలిన ఇంక్యుబేటర్

- ఒక శిశువు మృతి.. నలుగురికి తీవ్రగాయాలు
- వీరిలో ఇద్దరి పరిస్థితి విషమం
- మూడు రోజుల క్రితమే తొలి షార్ట్‌సర్క్యూట్
- తాత్కాలిక మరమ్మతులతో సరిపెట్టిన యాజమాన్యం

సాక్షి, హైదరాబాద్

షైన్ (ఎల్బీనగర్) ఆస్పత్రి యాజమాన్య నిర్లక్ష్యం చికిత్స పొందుతున్న చిన్నారుల ప్రాణాల మీదకు తెచ్చింది. సోమవారం తెల్లవారు జామున (2.45 గంటలకు) ఆస్పత్రి భవనం నాలుగో అంతస్తులోని ఐసీయూలో అగ్నిప్రమాదం జరిగింది. ఈ ఘటనలో నిమోనియాతో బాధపడుతూ ఇంక్యుబేటర్‌పై చికిత్స పొందుతున్న మూడు నెలల శిశువు మృతి చెందగా, మంటల్లో చిక్కుకుని మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. మంటలకు తోడు దట్టమైన పొగలతో ఊపిరాడక చిన్నారులు ఉక్కిరిబిక్కిరయ్యారు. ప్రస్తుతం ఇద్దరి శిశువుల పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. పలు ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న మరో 42 మందిని సమీప ఆస్పత్రులకు తరలించారు. ఎల్బీనగర్ పోలీస్‌స్టేషన్ ఎదురుగా డాక్టర్ వి. సునీల్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ సునీల్ పవార్ గత ఆరేళ్ల నుంచి షైన్ చిల్డ్రన్ ఆస్పత్రిని నిర్వహిస్తున్నారు. సునీల్‌కుమార్‌రెడ్డి మేనేజింగ్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నాడు. 2014లో రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ నుంచి 20 పడకలకు అనుమతి తీసుకున్నారు. ప్రస్తుతం జనరల్ వార్డులో 50 పడకలు ఏర్పాటు చేశారు. నెలలు నిండక ముందు తక్కువ బరువుతో జన్మించిన శిశువులతో పాటు, నిమోనియా, కామెర్లు ఇతర సమస్యలతో బాధపడుతున్న శిశువులను ఐసీయూలోని ఇంక్యుబేటర్‌లపై ఉంచి చికిత్స అందిస్తున్నారు.

**ఐసీయూలో మంటలు..**

సోమవారం తెల్లవారుజామున 2.45 గంటలకు ఐసీయూలో ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. అక్కడే ఉన్న ఇంక్యుబేటర్లు షార్ట్‌సర్క్యూట్‌కు గురై వాటి లైట్లు పేలిపోయాయి. ఈ ప్రమాదంలో సూర్యాపేట జిల్లా దూపాడ గ్రామానికి

మిగతా 2వ పేజీలో ▶



హైదరాబాద్‌లో అగ్ని ప్రమాదం జరిగిన షైన్ ఆస్పత్రి భవనం

# హుజూర్‌నగర్ కారుదే!

**కచ్చితంగా గెలుస్తామనే ధీమాతో అధికారపార్టీ**

**అన్ని సర్వేల్లోనూ అదే ఫలితం**

**ఈసారి నిలబెట్టుకుంటాం అంటున్న కాంగ్రెస్**

**నామమాత్రపు పోటీకే బీజేపీ, టీడీపీ పరిమితం!**

**84.75% పోలింగ్**

హుజూర్‌నగర్ ఉప ఎన్నిక ప్రశాంతం

- మొత్తం ఓట్లు 2,36,842
- పోలైనవి 2,00,726
- 24న ఫలితం

-వివరాలు 3లో

సాక్షి, హైదరాబాద్

హుజూర్‌నగర్ ఉప ఎన్నికలో విజయంపై అధికార టీఆర్‌ఎస్‌లో ధీమా వ్యక్తమవుతోంది. ఎట్టి పరిస్థితుల్లోనూ తమ విజయం తథ్యమని సోమవారం పోలింగ్ ముగిశాక ఆ పార్టీ నేతలు కుండబద్దలు కొడుతున్నారు. పోలింగ్ సరళి, ఎగ్జిట్‌పోల్ సర్వేలు కూడా ఇదే చెబుతుండటంతో ఇక్కడ గులాబీ దళం విజయం సాధిస్తుందనే అభిప్రాయం రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతోంది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యూహరచన, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలే సోపానాలుగా ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ కంచుకోట బద్దలవుతుందనే అంచనాలు పోలింగ్ ముగిశాక వెల్లడయ్యాయి. అయితే కాంగ్రెస్ శిబిరం కూడా తామే గెలుస్తామని చెబుతోంది. సంప్రదాయ ఓటు బ్యాంకు తమను గట్టెక్కిస్తుందనే ధీమా ఆ పార్టీ నేతల్లో కనిపిస్తోంది. ఈ రెండు ప్రధాన పార్టీలతో పాటు పోటీలో ఉన్న బీజేపీ, టీడీపీలు ఎన్నికల బరిలో నామమాత్రపు పోటీ ఇవ్వగా, ఈ రెండు పార్టీలకు ఎన్ని ఓట్లు పోలవుతాయన్నది సర్వత్రా ఆసక్తిని రేకెత్తిస్తోంది.

**బరాబర్ బరిలో..!**

హుజూర్‌నగర్ ఉప ఎన్నికలో విజయం కోసం అధికార, ప్రతిపక్షాలు సర్వశక్తులూ ఒడ్డాయి. టీఆర్‌ఎస్ బలగమంతా హుజూర్‌నగర్‌లోనే మకాం వేసి గ్రామాల వారీగా ప్రణాళికలు రూపొందించుకుని ఈసారి ఎట్టి పరిస్థితుల్లోనూ గెలిచి తీరాలన్న కసితో పనిచేసింది. జిల్లా మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎన్నికల ఇన్‌చార్జి పల్లా రాజేశ్వర్‌రెడ్డిల పర్యవేక్షణలో పార్టీ నేతలు, కార్యకర్తలు దాదాపు 20 రోజులపాటు శ్రమించారు. మండలాలు, గ్రామాల వారీగా ఇన్‌చార్జులను నియమించి రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఓటర్లకు వివరిస్తూ వారిని ప్రసన్నం చేసుకునే ప్రయత్నం చేశారు. కేటీఆర్ రోడ్‌షో ఈసారి ఎన్నికల

మిగతా 2వ పేజీలో ▶



సోమవారం హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని మఠంపల్లిలో ఓటేసేందుకు వచ్చిన మహిళలు

# కాషాయ ప్రభంజనమే!

**అసెంబ్లీ ఎన్నికలపై ఎగ్జిట్ పోల్స్ అంచనా**

| మహారాష్ట్ర ఎగ్జిట్ పోల్ | బీజేపీ- శివసేన | కాంగ్రెస్- ఎన్సీపీ |
|---|---|---|
| ఇండియాటుడే - యాక్సిస్ | 166-194 | 72-90 |
| న్యూస్ 18- ఐపీఎస్‌ఓఎస్ | 244 | 39 |
| ఏబీపీ- సీ ఓటర్ | 204 | 69 |
| టైమ్స్ నౌ | 230 | 48 |
| రిపబ్లిక్- జన్‌కీ బాత్ | 223 | 54 |
| ఐఏఎన్‌ఎస్- సీఓటర్ | 192-216 | 55-81 |

| హరియాణా ఎగ్జిట్ పోల్ | బీజేపీ | కాంగ్రెస్ |
|---|---|---|
| న్యూస్ 18- ఐపీఎస్‌ఓఎస్ | 75 | 10 |
| ఏబీపీ- సీ ఓటరు | 72 | 08 |
| టైమ్స్ నౌ | 71 | 11 |
| జన్‌కీ బాత్ | 57 | 17 |
| న్యూస్ ఎక్స్ | 77 | 11 |

**పోలింగ్ ప్రశాంతం**

- మహారాష్ట్రలో 60.46%, హరియాణాలో 65% ఓటింగ్ నమోదు
- 51 స్థానాల ఉప ఎన్నికల్లో దాదాపు 57% ఓటింగ్

- వివరాలు 4లో

## నవంబర్ 18 నుంచి డిసెంబర్ 13 వరకు పార్లమెంటు

- పార్లమెంటు శీతాకాల సమావేశాలు నవంబర్ 18 నుంచి డిసెంబర్ 13 వరకు జరగనున్నాయి. పార్లమెంటు ఉభయసభల సెక్రటేరియట్లకు సోమవారం ఈ సమాచారాన్ని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ పంపించింది.

- వివరాలు 4లో











పోలీసు అమరవీరులకు నివాళులర్పిస్తున్న హోంమంత్రి మహమూద్ అలీ, డీజీపీ మహేందర్‌రెడ్డి, హైదరాబాద్ సీపీ అంజనీ కుమార్, ఐజీ స్వాతి లక్రా

# అమరుల త్యాగాలే స్ఫూర్తి

- సంక్షేమం, టెక్నాలజీలో దేశంలోనే ముందంజ
- వారాంతపు సెలవుల అమలుకు కొత్త రిక్రూట్‌మెంట్లు
- పోలీసు అమరుల దినోత్సవంలో హోంమంత్రి, డీజీపీ

**21 రోజుల్లో** వరంగల్ ఘటనలో శిక్షపడేలా చేశాం

సాక్షి, హైదరాబాద్: పోలీసు అమరుల త్యాగాలే స్ఫూర్తిగా ముందుకెళ్తున్నామని, నేర రహిత రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నామని హోం మంత్రి మహమూద్ అలీ అన్నారు. పోలీసు అమర వీరుల దినోత్సవం సోమవారం గోషామహల్ పోలీసు మైదానంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర పోలీసులు విధి నిర్వహణలో శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారన్నారు. వారి సేవలు చిరస్మరణీయమని, రాష్ట్రంలో ఎలాంటి అలజడులు రాకుండా అత్యంత పకడ్బందీగా వ్యవహరిస్తున్నారని ప్రశంసించారు. ఈ ఏడాది అసాంఘిక శక్తులతో పోరులో దేశవ్యాప్తంగా 292 మంది

మిగతా 2వ పేజీలో ▶

# జీతాలకు పైసల్లేవ్

సాక్షి, హైదరాబాద్

రాష్ట్ర ఆర్టీసీ కార్మికులకు సెప్టెంబర్ జీతాలు చెల్లించేందుకు సరిపడా డబ్బుల్లేవని హైకోర్టుకు టీఎస్‌ఆర్టీసీ తెలిపింది. ఆర్టీసీ నిధుల లేమితో కొట్టుమిట్టాడుతోందని ఆ సంస్థ ఇన్‌చార్జి ఎండీ సునీల్ శర్మ తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ జె.రామచంద్రరావు వాదించారు. సెప్టెంబర్ జీతాలు చెల్లించాలంటే రూ.239.68 కోట్లు అవసరమని, ప్రస్తుతం ఆర్టీసీ ఖాతాలో రూ.7.49 కోట్లు మాత్రమే ఉన్నాయని వివరించారు. ఆర్టీసీ సిబ్బంది పనిచేసిన సెప్టెంబర్ నెలకు జీతాలు చెల్లించేలా యాజమాన్యాన్ని ఆదేశించాలని కోరుతూ తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.హనుమంతుతో పాటు మరొకరు దాఖలు చేసిన రిట్ పిటిషన్లను సోమవారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలి విచారించారు. పనిచేసిన కాలానికి జీతాలు చెల్లించకపోవడం రాజ్యాంగ వ్యతిరేకమని హైకోర్టు వ్యాఖ్యానించింది. ఇరుపక్షాల వాదనల తర్వాత విచారణ 29కి వాయిదా వేసింది.

**ప్రభుత్వమే ఆదుకుంటోంది..**

ఏటా ప్రభుత్వం ఆదుకుంటేనే ఆర్టీసీ నిర్వహణ జరుగుతోందని అదనపు ఏజీ చెప్పారు. ఈ సందర్భంగా ఆర్టీసీ ఇన్‌చార్జి ఎండీ సునీల్ శర్మ కౌంటర్ పిటిషన్ ద్వారా సంస్థ ఆర్థిక స్థితిగతులను వివరించారు. వాటిని అదనపు ఏజీ హైకోర్టు దృష్టికి తీసుకొచ్చారు. 'ఏటా ఆర్టీసీకి రూ.1,200 కోట్ల మేరకు నష్టం వస్తోంది. సంస్థ రాబడిలో 58 శాతం జీతాలకే సరిపోతోంది. 2015లో ఉద్యోగులకు 44 శాతం ఫిట్‌మెంట్ ఇవ్వడం వల్ల ఆర్టీసీపై రూ.900 కోట్ల భారం పడింది. 2017లో మధ్యంతర భృతి 16 శాతం ఇవ్వడం వల్ల రూ.200 కోట్ల వార్షిక భారం పడింది. ఆర్టీసీ సొంతంగా 8,357 బస్సులు, 2,103 అద్దె బస్సులు నడుపుతోంది. వీటిని నడపటం ద్వారా ఏటా రూ.4,882 కోట్లు ఆదాయం వస్తుంటే, వ్యయం రూ.5,811 కోట్లు అవుతోంది. సొంత రాబడి నిధులతో ప్రతి నెలా మొదటి వారంలో సిబ్బందికి జీతాలు ఇవ్వలేకపోతోంది. దీంతో ప్రతి నెలా ప్రభుత్వ

మిగతా 2వ పేజీలో ▶

**ఆర్థిక సంక్షోభంలో ఆర్టీసీ**

- కార్మికుల జీతాలకు రూ.239 కోట్లు కావాలి
- ఉన్నది రూ.7.49 కోట్లే..
- సమ్మె వల్ల రూ.125 కోట్లకుపైగా నష్టం
- హైకోర్టుకు వివరించిన అదనపు ఏజీ



## ఆర్టీసీ సమ్మె మరింత ఉధృతం

- 17వ రోజుకు చేరిన ఆందోళనలు
- బస్ డిపోల వద్ద కార్మికుల కుటుంబ సభ్యుల బైఠాయింపు
- సరిపడా బస్సులు లేక విద్యార్థుల ఇబ్బందులు
- బస్సుల్లో పాసులు అనుమతించని తాత్కాలిక కండక్టర్లు
- కలెక్టర్లు, అధికారులతో మంత్రి పువ్వాడ వీడియో కాన్ఫరెన్స్

సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ కార్మికుల సమ్మె ఉధృతమవుతోంది. సోమవారం 17వ రోజు రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ కార్మికులు ఆందోళనలు చేశారు. బస్ డిపోల ఎదుట కుటుంబ సభ్యులతో కలిసి నిరసన కార్యక్రమాలు చేపట్టారు. తాత్కాలిక డ్రైవర్లు, కండక్టర్లతో బస్సులు నడపడానికి చేసిన ప్రయత్నాలను అడ్డుకున్నారు. వేతనాలు లేక ఇల్లు గడవడం కూడా కష్టంగా ఉందని, తమ ఆవేదన అర్థం చేసుకోవాలంటూ తాత్కాలిక డ్రైవర్లు,

మిగతా 2వ పేజీలో ▶

**ఇదండీ సంగతి**



నీకు దండం పెడతా! ఇంకా కాయకే.. కాసి నా దుంప తెంచకు!!

# పోటెత్తుతున్న కృష్ణా

**పశ్చిమ కనుమల్లో భారీ వర్షాలు**

- ఆల్మట్టి, నారాయణపూర్‌లలోకి 1.60 లక్షల క్యూసెక్కుల ప్రవాహాలు
- వచ్చిన నీరంతా వచ్చినట్లుగా దిగువకు విడుదల..
- నేడు జూరాల, శ్రీశైలానికి చేరనున్న వరద

**వచ్చే 72 గంటలు**

- కృష్ణా పరీవాహకంలో అతిభారీ వర్షాలు
- రాష్ట్రాలను అప్రమత్తం చేసిన కేంద్ర జలసంఘం

సాక్షి, హైదరాబాద్

పశ్చిమ కనుమల్లో భారీ వర్షాలతో కృష్ణా నది మళ్లీ పోటెత్తుతోంది. గత పది రోజులుగా ప్రవాహాలు తగ్గిపోగా సోమవారం సాయంత్రానికి కర్ణాటకలోని ఆల్మట్టి, నారాయణపూర్ జలాశయాలకు 1.60 లక్షల క్యూసెక్కుల మేర వరద ప్రవాహాలు మొదలయ్యాయి. ఇప్పటికే ఆ ప్రాజెక్టులు పూర్తిగా నిండటంతో వచ్చిన నీటిని వచ్చినట్లుగా దిగువకు వదులుతున్నారు. నారాయణపూర్ నుంచి ఏకంగా 1.82 లక్షల క్యూసెక్కులను నదిలో వదులుతుండటంతో తుంగభద్ర జలాశయానికి వరద పెరుగుతోంది. ఇక్కడ 76,468 క్యూసెక్కుల వరద వస్తుండగా 86,166 క్యూసెక్కులను దిగువకు వదిలేస్తున్నారు. ఈ వరదంతా మంగళవారానికి జూరాల, శ్రీశైలానికి చేరే అవకాశం ఉంది. సోమవారం సాయంత్రానికి జూరాలలోకి 44 వేల క్యూసెక్కులు, శ్రీశైలంలోకి 57,012, నాగార్జునసాగర్‌లోకి 48,236 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులన్నీ నిండటంతో సాగు, తాగు అవసరాలకు నీటిని విడుదల చేస్తూనే మిగతా నీటిని దిగువకు వదిలేస్తున్నారు.

**పదేళ్ల రికార్డులు బద్దలు..**

కృష్ణా బేసిన్‌లో ఎగువ మహారాష్ట్ర, కర్ణాటకలో కురిసిన వర్షాలతో పదేళ్ల వరద రికార్డులు బద్దలయ్యాయి. ఓ పక్క ఎగువ కృష్ణా, మరోపక్క తుంగభద్ర, ఇంకోపక్క ఉజ్జయినీ నదులు ఉప్పొంగడంతో బేసిన్‌లోని శ్రీశైలం, సాగర్, జూరాల ప్రాజెక్టులు ఉప్పొంగాయి. శ్రీశైలం ప్రాజెక్టుకు గడిచిన పదేళ్లలో 2009–10లో 1,218 టీఎంసీల మేర వరద రాగా ప్రస్తుతం ఏకంగా 1,420 టీఎంసీల మేర వరద వచ్చింది. ప్రాజెక్టు కింద రెండు తెలుగు రాష్ట్రాల నీటి వినియోగం సైతం 130 టీఎంసీలను దాటింది. ఇక జూరాలకు 2010–11లో గరిష్టంగా 787 టీఎంసీల వరద రాగా ఆ మార్కును

మిగతా 2వ పేజీలో ▶



సోమవారం ఎస్సారెస్పీ గేట్లెత్తడంతో దిగువకు పరుగులు తీస్తున్న గోదావరి

## ఎన్నాళ్లకెన్నాళ్లకు.!

**మూడేళ్ల అనంతరం శ్రీరాంసాగర్‌కు జలకళ**

ప్రాజెక్టు 16 గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల
కొనసాగుతున్న 83 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
ప్రాజెక్టు వద్ద పర్యాటకుల సందడి

13లో


సోమవారం హైదరాబాద్‌లో కలెక్టర్లు, ఆర్టీసీ అధికారులతో రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ వీడియో కాన్ఫరెన్స్


రాజ్‌భవన్ వద్ద మీడియాతో మాట్లాడుతున్న ఆర్టీసీ జేఏసీ నేత అశ్వత్థామరెడ్డి. చిత్రంలో ఆర్టీసీ జేఏసీ నేతలు



హైదరాబాద్‌లో బస్సు కోసం పరుగెడుతున్న విద్యార్థులు

## క్లుప్తంగా...

### సకల జనుల భేరిలో పాల్గొనండి

**ప్రజలకు లెఫ్ట్ పార్టీల విజ్ఞప్తి**

**సాక్షి, హైదరాబాద్:** ఆర్టీసీ సమ్మెలో భాగంగా ఈ నెల 30న నిర్వహించే సకల జనుల సమర భేరిలో వివిధ వర్గాల ప్రజలు పాల్గొనాలని వామపక్షాల నాయకులు విజ్ఞప్తి చేశారు. సీఎం కేసీఆర్ తెలంగాణ సమాజంలో చరిత్రహీనుడిగా నిలిచిపోకుండా, కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సోమవారం నగరంలోని వివిధ డిపోల పరిధిలో జరిగిన కార్మికుల సమ్మె శిబిరాలను తమ్మినేని వీరభద్రం, డీజీ నరసింహారావు, బి.వెంకట్ (సీపీఎం), చాడ వెంకటరెడ్డి, బాలమల్లేష్ (సీపీఐ), రమ, సూర్యం (న్యూడెమోక్రసీ) ఇతర నాయకులతో కూడిన రాష్ట్ర బృందం సందర్శించింది. ఈ సందర్భంగా వామపక్షాల నేతలు మాట్లాడుతూ, ఆర్టీసీ కార్మికులు ఒంటరిగా లేరని, వారికి రాష్ట్ర ప్రజలు అండగా నిలవడం వల్లనే 17 రోజులుగా సాగుతున్న సమ్మె విజయవంతమైందన్నారు. కార్మికులు కుటుంబాలతో సహా చేస్తున్న దీక్షలతోనైనా ప్రభుత్వానికి కనువిప్పు కావాలన్నారు.

### ఆర్టీసీ సమ్మెకు కేరళ కార్మికుల మద్దతు

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో నిరవధిక సమ్మె చేస్తున్న ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగులకు సంఘీభావంగా కేరళలోని 14 జిల్లాల్లోని వివిధ కేంద్రాల్లో అక్కడి కార్మికులు నిరసన ప్రదర్శనలు, ర్యాలీలు నిర్వహించారు. ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మొత్తం 78 ప్రాంతాల్లో 8వేల మందికి పైగా నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్నారని కేరళ సీఐటీయూ శాఖ అధ్యక్షుడు అనంతలవట్టం ఆనందం, ప్రధాన కార్యదర్శి ఎలమారం కరీం ఒక ప్రకటనలో తెలిపారు. కేరళ రోడ్డు రవాణా ఉద్యోగుల సంఘం, బస్ ఫెడరేషన్, గూడ్స్ లారీ వర్కర్లు, లైట్ మోటార్ వెహికల్ వర్కర్లు, డ్రైవింగ్ స్కూల్ వర్కర్లు సొంతంగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు.

### టెన్త్ పరీక్ష ఫీజు చెల్లింపు గడువు పెంపు

**సాక్షి, హైదరాబాద్:** పదో తరగతి పరీక్ష ఫీజు చెల్లింపు గడువును నవంబర్ 7 వరకు పొడిగించినట్లు ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ సుధాకర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. వచ్చే మార్చిలో నిర్వహించే పరీక్షలకు హాజరు కావాలనుకునే విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. రూ. 50 ఆలస్య రుసుముతో వచ్చే నెల 23 వరకు, రూ. 200 ఆలస్య రుసుముతో డిసెంబరు 9 వరకు, రూ. 500 ఆలస్య రుసుముతో డిసెంబర్ 23 వరకు పరీక్ష ఫీజు చెల్లించవచ్చని వివరించారు.

### ఓపెన్ ఎస్సెస్సీ, ఇంటర్ ప్రవేశాల గడువు పెంపు

**సాక్షి, హైదరాబాద్:** దూరవిద్యా విధానంలో నిర్వహించే ఎస్సెస్సీ, ఇంటర్మీడియట్ ప్రవేశాల గడువును ఈ నెల 31 వరకు పొడిగించినట్లు ఓపెన్ స్కూల్ సొసైటీ జాయింట్ డైరెక్టర్ సోమిరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆలస్య రుసుముతో నవంబర్ 1 నుంచి 10 వరకు ప్రవేశాలు పొందవచ్చని పేర్కొన్నారు.

### డిగ్రీ పరీక్ష ఫీజు చెల్లింపు గడువు పొడిగింపు

**హైదరాబాద్:** ఓయూ పరిధిలో నవంబర్ 15 నుంచి జరిగే వివిధ డిగ్రీ (రెగ్యులర్) కోర్సుల పరీక్షలకు ఫీజు చెల్లించే గడువును ఎలాంటి అపరాధ రుసుము లేకుండా ఈ నెల 28 వరకు, అపరాధ రుసుముతో వచ్చే నెల 4 వరకు పొడిగించినట్లు కంట్రోలర్ ప్రొ. శ్రీరామ్ వెంకటేష్ సోమవారం తెలిపారు. పూర్తి వివరాలను ఉస్మానియా వెబ్‌సైట్లో చూడవచ్చని పేర్కొన్నారు.

### బీసీ అభ్యర్థులకు సివిల్ సర్వీసెస్ ఉచిత శిక్షణ

**సాక్షి, హైదరాబాద్:** సివిల్ సర్వీసెస్–2020 పరీక్షలకు హాజరవనున్న బీసీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ ఎన్.బాలాచారి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్హత పరీక్షల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తామన్నారు. మే–2020 వరకు శిక్షణ తరగతులు నిర్వహిస్తామని, గతంలో అర్హత పరీక్ష రాసి ఉత్తీర్ణత పొందని వారికి కూడా ఈసారి అవకాశం కల్పిస్తున్నట్లు వివరించారు. మరిన్ని వివరాలకు 6302427521 నంబర్‌పై సంప్రదించాలని సూచించారు.

# ఆర్టీసీ సమ్మె మరింత ఉధృతం

మొదటి పేజీ తరువాయి

కండక్టర్లను వేడుకున్నారు. ఆర్టీసీ పరిరక్షణ, ఉద్యోగుల సమస్యల పరిష్కారం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందంటూ సర్కారుపై మండిపడ్డారు. కరీంనగర్–1 డిపోకు చెందిన డ్రైవర్ జంపన్న ఒంటిపై కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. ఆర్టీసీ కార్మిక సంఘం జేఏసీ, ప్రభుత్వం చర్చలు జరపాలని హైకోర్టు జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వుల అమలుపై సందిగ్ధత నెలకొంది. ప్రభుత్వం ఇప్పటి వరకు ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంతో కార్మికుల్లో ఉత్కంఠ పెరుగుతోంది.

**విద్యార్థుల అవస్థలు..**

రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థలు సోమవారం తెరుచుకున్నాయి. 24 రోజుల సెలవుల తర్వాత పాఠశాలలు, కళాశాలలు పునఃప్రారంభం కావడంతో ఒక్కసారిగా రద్దీ పెరిగింది. దీంతో ప్రయాణికుల తాకిడికి తగినట్టుగా బస్సులు నడపాలని ప్రభుత్వం ఆర్టీసీని ఆదేశించింది. ఈ క్రమంలో రోజువారీగా నడిపిన వాటి కంటే ఎక్కువ నడపాల్సి ఉండగా.. అధికారులు మాత్రం విఫలమయ్యారు. తక్కువ బస్సులే రోడ్డెక్కడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. హైదరాబాద్ పరిధిలో 2 వేల బస్సులు నడపాలని ఆర్టీసీ భావించింది. అయితే, కేవలం 859 బస్సులు మాత్రమే నడపగలిగారు. అవి కూడా సమయానుకూలంగా నడవలేదు. ఫలితంగా గంటల తరబడి వేచి చూడాల్సి వచ్చింది. విద్యార్థుల బస్ పాస్‌లను అన్ని బస్సుల్లో అనుమతించాలని ఆర్టీసీ ఆదేశించినప్పటికీ చాలాచోట్ల పాసులను అనుమతించలేదు. కాగా, రాష్ట్రవ్యాప్తంగా సోమవారం 6,276 బస్సులు నడిపినట్లు ఆర్టీసీ తెలిపింది.

**గవర్నర్‌ను కలిసిన ఆర్టీసీ జేఏసీ**

ఆర్టీసీ జాయింట్ యాక్షన్ కమిటీ ప్రతినిధులు అశ్వత్థామరెడ్డి, రాజిరెడ్డి, బీఎస్ రావు, సుధ తదితరులు సోమవారం గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌ను కలిశారు. ఆర్టీసీ కార్మికులు చేపట్టిన సమ్మెపై ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని గవర్నర్‌కు వివరించారు. హైకోర్టు ఆదేశించినప్పటికీ ప్రభుత్వం చర్చలకు ఆహ్వానించలేదనే అంశాన్ని ప్రస్తావించారు. ఈ అంశంలో గవర్నర్ జోక్యం చేసుకోవాలని, చర్చలు జరిపేలా ప్రభుత్వంతో సంప్రదింపులు జరపాలని కోరారు. సమ్మె జరుగుతున్న సమయంలో అద్దె బస్సులు పెంచేలా ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిన అంశాన్ని కూడా గవర్నర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆమె అడిగిన ప్రశ్నలకు సమాధానాలిస్తూ పరిస్థితిని వివరించారు. తమ వినతిపై గవర్నర్ సానుకూలంగా స్పందించినట్లు ఆర్టీసీ జేఏసీ నేతలు వెల్లడించారు.

**ఎంజీబీఎస్‌లో అఖిలపక్షం ధర్నా..**

సమ్మె విషయంలో సర్కారు అనుసరిస్తున్న వైఖరికి నిరసనగా సోమవారం హైదరాబాద్ మహాత్మా గాంధీ బస్ స్టేషన్ (ఎంజీబీఎస్)లో అఖిలపక్షం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఆర్టీసీ జేఏసీ కన్వీనర్ అశ్వత్థామరెడ్డి, టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కోదండరామ్, తెలంగాణ టీడీపీ అధ్యక్షుడు ఎల్.రమణ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ నేత వీహెచ్ తదితరులు ఇందులో పాల్గొన్నారు.

### నూరుశాతం బస్సులు నడపాలి: మంత్రి పువ్వాడ అజయ్

నూరుశాతం బస్సులు నడిపేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఆదేశించారు. సోమవారం ఆయన కలెక్టర్లు, ఆర్టీసీ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కండక్టర్లు ప్రయాణికులకు తప్పని సరిగా టికెట్లు జారీ చేయాలని, బస్సు పాసులను అనుమతించాలని స్పష్టం చేశారు. కండక్టర్లకు టిమ్ మెషీన్లు ఇవ్వాలని సూచించారు. అవసరాన్ని బట్టి బస్సు డిపోల్లో కొత్తగా మెకానిక్‌లు, ఎలక్ట్రీషియన్లను నియమించుకోవాలని ఆదేశించారు.

# పోటెత్తుతున్న కృష్ణా

మొదటి పేజీ తరువాయి

ఎప్పుడో దాటిపోయింది. ఇక్కడ ఏకంగా 1,190 టీఎంసీల మేర వరద రాగా ప్రస్తుతం వరద స్థిరంగా కొనసాగుతుండటంతో అది మరింత పెరిగే అవకాశం ఉంది. ఇక సాగర్‌కు సైతం ఈ ఏడాది 968 టీఎంసీల మేర వరద రాగా, అది ఇంకా కొనసాగనుంది. ఈ ప్రాజెక్టుల కింది ఆయకట్టుతో పాటు వీటిపై ఆధారపడి చేపట్టిన కల్వకుర్తి, బీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ ప్రాజెక్టుల కింద కనిష్టంగా ఈ ఏడాది 15 లక్షల ఎకరాల ఆయకట్టుకు రబీలోనూ నీరందించే అవకాశం ఏర్పడింది.

**అప్రమత్తంగా ఉండాలి: కేంద్ర జల సంఘం**

''ఈశాన్య రుతుపవనాలు మహారాష్ట్ర వరకు విస్తరించి ఉన్నాయి. ఈ కారణంగా కృష్ణా నది పరీవాహకం, దాని ఉప నదుల పరిధిలో రానున్న 72 గంటల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ రుతుపవనాల ప్రభావంతో కర్ణాటకలోనూ భారీ వర్షపాతం నమోదు కానుంది. ఈ నేపథ్యంలో రెండు రాష్ట్రాల్లోని ప్రధాన నదులకు భారీగా వరద ప్రవాహాలు నమోదు కానున్నాయి. ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టులకు 2 లక్షల క్యూసెక్కుల ప్రవాహాలు కొనసాగే అవకాశం ఉంది. అలాగే ఉజ్జయినీ, తుంగభద్రల పరిధిలోనూ భారీ వర్షాలు కురుస్తుండటంతో ఇక్కడ ప్రవాహాలు లక్ష క్యూసెక్కులకు చేరే అవకాశం ఉంది. దీంతో రానున్న 3–4 రోజుల్లో శ్రీశైలానికి భారీ వరద పోటెత్తనుంది. ప్రస్తుతం ఈ ప్రాజెక్టులో వాస్తవ నీటినిల్వ సామర్థ్యానికి కేవలం 7 టీఎంసీలు మాత్రమే ఖాళీగా ఉంది. ఎగువ నుంచి వచ్చే వరదను దృష్టిలో పెట్టుకొని శ్రీశైలం నుంచి దిగువకు నీటి విడుదలను పెంచాలి. అలాగే సాగర్, పులిచింతల ప్రాజెక్టుల్లో 4 టీఎంసీల చొప్పున మాత్రమే ఖాళీ ఉన్న నేపథ్యంలో ఈ రెండు ప్రాజెక్టుల నుంచి సైతం నీటిని దిగువకు విడుదల చేసి వరద నిర్వహణ చేపట్టాలి''అని కేంద్ర జల సంఘం రాష్ట్రాలకు స్పష్టం చేసింది.

**ప్రధాన జలాశయాల్లో నీటి నిల్వలు ఇలా..(నిల్వ–టీఎంసీల్లో, (ప్రవాహాలు–క్యూసెక్కుల్లో)**
**(సోమవారం సాయంత్రం 6 గంటల అధికారిక బులెటిన్ ప్రకారం)**

| ప్రాజెక్టు | పూర్తి నిల్వ | ప్రస్తుత నిల్వ | ఇన్‌ఫ్లో | ఔట్‌ఫ్లో |
|---|---|---|---|---|
| ఆల్మట్టి | 129.72 | 128.19 | 1,60,000 | 1,60,000 |
| నారాయణపూర్ | 37.646 | 37.59 | 1,60,000 | 1,82,000 |
| జూరాల | 9.657 | 9.09 | 44,000 | 40,488 |
| శ్రీశైలం | 215.807 | 209.16 | 57,012 | 77,716 |
| తుంగభద్ర | 100.86 | 100.86 | 76,468 | 86,166 |
| ఉజ్జయినీ | 117 | 117 | 23,148 | 29,863 |
| నాగార్జునసాగర్ | 312.045 | 309.95 | 48,236 | 48,236 |
| ఎస్సారెస్పీ | 90.31 | 90.31 | 58,000 | 58,000 |
| ఎల్లంపల్లి | 20.18 | 19.59 | 22,946 | 30,668 |

### కొత్త అద్దె బస్సులకు రంగం సిద్ధం

**సాక్షి, హైదరాబాద్:** ఆర్టీసీలో కొత్తగా అద్దె బస్సులు రోడ్డెక్కేందుకు రంగం సిద్ధమైంది. సమ్మె నేపథ్యంలో అద్దె బస్సుల సంఖ్యను 30 శాతానికి పెంచాలని సీఎం కేసీఆర్ ఆదేశించడంతో అధికారులు టెండర్లు పిలిచారు. జిల్లాల్లో 250 బస్సులకు ఏకంగా 9,750 టెండర్లు దాఖలయ్యాయి. వీటిలో బస్సులు సిద్ధంగా ఉన్నవాళ్లకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు. ఎవరు కొత్త బస్సు పెడితే వారికే ముందుగా కేటాయిస్తారు. ఒకవేళ బస్సులు ఎవరి దగ్గరా అందుబాటులో లేకుంటే లాటరీ ద్వారా టెండర్ ఖరారు చేసి మూడు నెలల సమయం ఇస్తారు. అద్దె బస్సులకు హైదరాబాద్‌లో మాత్రం స్పందన కనిపించలేదు. ఇక్కడ 750 బస్సులకు 18 టెండర్లు మాత్రమే దాఖలయ్యాయి.

# హుజూర్‌నగర్ కారుదే!

మొదటి పేజీ తరువాయి

ప్రచారంలో హైలెట్ కాగా, సీఎం కేసీఆర్ సభ వర్షం కారణంగా రద్దయినా నిరాశ చెందకుండా గులాబీ దళం ప్రచార పర్వాన్ని శాయశక్తులా ఉపయోగించుకుంది. రైతుబంధు, పింఛన్లు, కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ లాంటి పథకాలు ఈ ఎన్నికల్లో అధికార పార్టీకి అండగా నిలిచాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇక, పోలింగ్ జరిగిన సోమవారమంతా నియోజకవర్గంలో టీఆర్ఎస్ మాటే వినిపించడంతో ఈసారి హుజూర్‌నగర్ అధికార పార్టీ ఖాతాలో పడనుందని రాజకీయ విశ్లేషకులంటున్నారు.

**మా ఓట్లు మాకే..!**

ప్రతిపక్ష కాంగ్రెస్ శిబిరంలో కూడా పోలింగ్ సరళిపై తీవ్రంగానే అంచనాలు, లెక్కలు జరుగుతున్నాయి. కాంగ్రెస్‌కు పటిష్ట కేడర్ ఉన్న ఈ నియోజకవర్గంలో తమ ఓటు బ్యాంకుకు గండి పడలేదని, టీఆర్ఎస్ ఎన్ని చెప్పినా తమ ఓట్లు తమకే పడ్డాయని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. సంప్రదాయంగా పట్టున్న కాంగ్రెస్‌కు విజయానికి కావాల్సిన ఓట్లు పోలయ్యాయని అంటున్నారు. హుజూర్‌నగర్ నియోజకవర్గంలో ఉత్తమ్ చేసిన అభివృద్ధే మళ్లీ ఇక్కడ విజయాన్ని చేకూరుస్తుందని వారంటున్నారు. పోలింగ్ సరళి కొంత అనుకూలంగా లేకపోయినా సైలెంట్ ఓటింగ్ జరిగిందని, ఉప ఎన్నికల్లో భారీ పోలింగ్ నమోదు కావడమే ఇందుకు కారణమని అంటున్నారు. మొత్తమ్మీద రెండు శిబిరాల్లో గెలుపుపై ధీమా వ్యక్తమవుతున్నా ఓటరు రాజు కారువైపే మొగ్గు చూపినట్లు పోలింగ్ డే పరిస్థితులు చెబుతున్నాయి.

**ఆ పార్టీలు ఏం చేస్తాయో?**

టీఆర్ఎస్, కాంగ్రెస్‌తో పాటు నియోజకవర్గంలో తమ సత్తా చాటేందుకు పోటీలో ఉన్న బీజేపీ, టీడీపీకి ఎన్ని ఓట్లు వస్తాయన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. గత ఎన్నికల్లో పోటీ చేసిన బీజేపీకి 1,555 ఓట్లు మాత్రమే రాగా, టీడీపీ కాంగ్రెస్‌కు మద్దతిచ్చింది. ఈసారి టీడీపీ ఒంటరిపోరు కాంగ్రెస్‌కు నష్టం కలిగిస్తుందనే భావన వ్యక్తమవుతోంది. బీజేపీ మంత్రం కూడా పెద్దగా పనిచేయలేదని, ఈసారి కూడా ఆ పార్టీ నామమాత్రపు పోటీకే పరిమితం అవుతుందనే అంచనాలు వెల్లడవుతున్నాయి. టీడీపీకి ఎన్ని ఓట్లు వస్తాయనే దానిపై ఓ అంచనాకు రావడం కూడా కష్టంగానే ఉందని పోలింగ్ సరళి చెబుతోంది. మొత్తమ్మీద ఈ రెండు పార్టీలకు ఎన్నెన్ని ఓట్లు వస్తాయి.. టీఆర్ఎస్, కాంగ్రెస్‌లలో ఎవరిని నష్టపరుస్తాయి.. ఎవరికి మేలు చేస్తాయన్నది ఈనెల 24న తేలనుంది.

### గౌరవప్రదమైన మెజారిటీతో గెలుస్తున్నాం: కేటీఆర్

**సాక్షి, హైదరాబాద్:** హుజూర్‌నగర్ అసెంబ్లీ ఉప ఎన్నికలో టీఆర్ఎస్ గౌరవప్రదమైన మెజారిటీతో విజయం సాధిస్తుందని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. సోమవారం పోలింగ్ ముగిసిన తర్వాత సామాజిక మాధ్యమం ట్విట్టర్ వేదికగా ఆయన స్పందించారు. 'మా పార్టీ నేతల నుంచి అందిన సమాచారం ప్రకారం టీఆర్ఎస్ అభ్యర్థి సైదిరెడ్డి విజయం సాధిస్తున్నారనే గట్టి నమ్మకంతో ఉన్నా. గత నెల రోజులుగా హుజూర్‌నగర్ ఉప ఎన్నికలో తీవ్రంగా శ్రమించిన టీఆర్ఎస్ నేతలకు, క్షేత్రస్థాయి కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలుపుతున్నా'అని కేటీఆర్ ట్వీట్‌లో పేర్కొన్నారు.

# జీతాలకు పైసల్లేవ్

మొదటి పేజీ తరువాయి

చేయూతతోనే జీతాల చెల్లింపులు జరుగుతున్నాయి. ఆర్టీసీ అప్పు రూ.4,709 కోట్లు. ఇందులో రూ.1,660 కోట్లు క్రెడిట్ కో ఆపరేటివ్ సొసైటీ, పీఎఫ్, లీవ్ క్యాష్, పదవీ విరమణ ప్రయోజనాలు తదితర చెల్లింపుల కోసం రూ.3,049 కోట్లను ఆర్టీసీ యాజమాన్యం రుణాలు చేయాల్సి వచ్చింది. ఈ ఏడాది ఆగస్టు నాటికి మొత్తం నష్టాలు రూ.5,269.25 కోట్లకు పేరుకున్నాయి. రోజూ టికెట్ల ద్వారా రూ.10 కోట్లు, పండుగల సమయంలో రూ.13 కోట్ల డబ్బు వస్తుంది. సిబ్బంది సమ్మె వల్ల రూ.125 కోట్లకుపైగా అదనపు నష్టం వాటిల్లుతోంది. ఇప్పుడు ఆర్టీసీ దగ్గర రూ.7.49 కోట్లు మాత్రమే ఉన్నాయి. నెల జీతం చెల్లించాలంటే రూ.239.68 కోట్లు అవసరం'అని పేర్కొన్నారు.

**ఎంత చెప్పినా వినలేదు..**

'ఆర్థికంగా తీవ్ర సంక్షోభంలో ఉన్న నేపథ్యంలో ఉద్యోగ సంఘాలు సమ్మె నోటీసు ఇచ్చాయి. సమ్మె చేస్తే పరిస్థితులు చక్కబడతాయని ఆశించొద్దని హితవు పలికినా ఖాతరు చేయకుండా ఈ నెల 5 నుంచి సమ్మెలోకి వెళ్లారు. సమ్మె చట్ట వ్యతిరేకమని ప్రకటించాలి'అని వాదించారు. పిటిషనర్ తరఫు న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ వాదిస్తూ.. జీతాల నగదు సమాచారాన్ని ఆర్టీసీ తప్పుగా చెబుతోందని ఆరోపించారు. ఉన్నతాధికారుల జీతాలు రూ.100 కోట్ల వరకు చెల్లించిన యాజమాన్యం ఇంకా రూ.239 కోట్లు అవసరమని చెప్పడం వాస్తవం కాదన్నారు. సిబ్బందికి జీతాలుగా చెల్లించాల్సింది రూ.140 కోట్ల లోపేనన్నారు. ఆర్టీసీ సిబ్బంది సమ్మె చేస్తున్నా 70 శాతానికిపైగా బస్సులు నడుపుతున్నామని మరో కౌంటర్ పిటిషన్‌లో పేర్కొన్న ప్రభుత్వం వాటి ద్వారా ఎంత ఆదాయం వచ్చిందో హైకోర్టుకు వివరించలేదని చెప్పారు. వాదనల అనంతరం విచారణ 29కి వాయిదా పడింది. ఇదిలా ఉండగా ఆర్టీసీ సమ్మెపై దాఖలైన మూడు వేరు వేరు ప్రజాహిత వ్యాజ్యాలను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, న్యాయమూర్తి జస్టిస్ ఎ.అభిషేక్‌రెడ్డిలతో కూడిన ధర్మాసనం సోమవారం విచారించింది. ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. ఆర్టీసీ సమ్మె చట్ట విరుద్ధంగా ప్రకటించాలని కోరుతూ దాఖలైన ప్రధాన పిల్‌తో వీటిని జత చేయాలని రిజిస్ట్రీని ఆదేశించింది. విచారణ 28కి వాయిదా వేసింది.

# అమరుల త్యాగాలే స్ఫూర్తి

మొదటి పేజీ తరువాయి

పోలీసులు వీరమరణం పొందగా.. తెలంగాణలో ఒక్క పోలీసు కూడా మరణించకపోవడమే ఇందుకు నిదర్శనమన్నారు. డీజీపీ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. 1959లో చైనా–భారత్ సరిహద్దులో చైనా దురాక్రమణను అడ్డుకునేందుకు ప్రాణాలర్పించిన సీఆర్పీఎఫ్ జవాన్ల అమరత్వానికి చిహ్నంగా ఏటా పోలీసు అమరవీరుల దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన వారి త్యాగాలే స్ఫూర్తిగా ముందుకు సాగుతున్నామన్నారు. రాష్ట్రంలో ఉగ్రవాదం, తీవ్రవాదం, మతతత్వ తదితర అరాచక శక్తులకు ఆస్కారం లేకుండా పకడ్బందీగా వ్యవహరిస్తున్నామని తెలిపారు. వరంగల్‌లో తొమ్మిది నెలల చిన్నారి అత్యాచారం, హత్య కేసులో పోలీసులు నిందితుడికి ఉరిశిక్ష పడేలా చేశారని గుర్తుచేశారు. 21 రోజుల్లోనే విచారణ పూర్తి చేయడం పోలీసుల పనితీరుకు నిదర్శనమన్నారు. విధినిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన హోంగార్డుకు రూ.30 లక్షలు, కానిస్టేబుల్ నుంచి ఎస్సై ర్యాంకు వరకు రూ.40–45 లక్షలు, ఇన్‌స్పెక్టర్ నుంచి అడిషనల్ ఎస్పీ ర్యాంకు అధికారికి రూ.50 లక్షలు, ఎస్పీ నుంచి సీనియర్ ఐపీఎస్‌లకు రూ.55 లక్షలు నష్టపరిహారంగా ఇస్తున్నామన్నారు. అంతేకాకుండా వారి కుటుంబాలకు సర్వీసు ఉన్నంత కాలం జీతభత్యాలు, తరువాత పింఛన్, వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తున్నామని వివరించారు. త్వరలోనే వారాంతపు సెలవులు అమలు చేస్తామని వివరించారు. ఇందు కోసం ఇటీవల 18,000 కొత్త పోలీసు పోస్టుల రిక్రూట్‌మెంట్‌కు నోటిఫికేషన్ ఇచ్చామన్నారు. త్వరలోనే వీరికి శిక్షణ ప్రారంభించనున్నామని వెల్లడించారు. నేర దర్యాప్తులో సాంకేతికను వినియోగించడంలో దేశంలోనే ముందున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 15 లక్షల సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్న లక్ష్యంతో ఉన్నామని, నగరంలోనే 10 లక్షలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఈ ఏడాది ఏర్పాటు చేసిన విమెన్ సేఫ్టీ వింగ్‌తో మహిళల నేరాల దర్యాప్తు మరింత వేగవంతమైందన్నారు. బంజారాహిల్స్‌లో రూ.400 కోట్లతో ఏర్పాటు చేస్తోన్న 20 అంతస్తుల పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను త్వరలోనే పూర్తి చేస్తామని తెలిపారు.

### పోలీసు అమరవీరులకు సీఎం కేసీఆర్ నివాళి

**సాక్షి, హైదరాబాద్:** శాంతి భద్రతల పరిరక్షణ కోసం ప్రాణాలు పణంగా పెట్టి పనిచేస్తున్న పోలీసుల నిబద్ధత, దేశ రక్షణ కోసం సరిహద్దుల్లో పోరాడుతున్న సైనికులకు ఏమాత్రం తీసిపోనిదని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. సంఘ వ్యతిరేక శక్తులను అదుపు చేసే క్రమంలో పోలీసులు ప్రాణాలు కూడా అర్పిస్తున్నారని, ప్రజల కోసం ప్రాణాలర్పించిన వారు ఎప్పటికీ అమరులుగా ఉండిపోతారని ప్రశంసించారు. విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసులకు కేసీఆర్ నివాళులర్పించారు.

# చిన్నారుల ప్రాణాలతో చెలగాటం

మొదటి పేజీ తరువాయి


ప్రమాదంలో మృతి చెందిన చిన్నారి

చెందిన డి.నరేష్, మానసల కుమారుడు (3 నెలలు) తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. అలాగే నల్లగొండ జిల్లా శివన్నగూడెం గ్రామానికి చెందిన గిరి, మమతల కుమారుడు అవినాష్ (2 నెలలు)కి చాతి, కాళ్లు, చేతులపై గాయాలయ్యాయి. చిన్నారిని ఉప్పల్‌లోని శ్రీధ ఆస్పత్రికి తరలించారు. చంపాపేటకు చెందిన ముత్యాలు, సరితల 36 రోజుల శిశువును బంజారాహిల్స్‌లోని ఏవీఎస్ అంకుర ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమంగా ఉంది. నల్లగొండ జిల్లా ఉరుమడ్లకు చెందిన నాగరాజు, సుగుణల 13 నెలల శిశువును ఎల్బీ నగర్‌లోని దిశ ఆస్పత్రికి, అబ్దుల్లాపూర్‌మెట్‌కు చెందిన మరో శిశువును మలక్‌పేటలోని సేఫ్ ఆస్పత్రికి తరలించారు.

**ఊపిరాడక ఉక్కిరిబిక్కిరి...**

అగ్ని ప్రమాదంతో ఐసీయూ సహా సాధారణ వార్డుల్లోనూ దట్టమైన పొగ అలముకోవడంతో పిల్లలు ఊపిరాడక ఉక్కిరిబిక్కిరి అయ్యారు. పిల్లలకు సాయంగా వచ్చిన తల్లిదండ్రులు, బంధువులు, నర్సులు, ఇతర సిబ్బంది భయాందోళనలతో పరుగులు తీశారు. పిల్లల ఏడుపులు, సిబ్బంది ఉరుకులు పరుగులతో ఆస్పత్రిలో ఏం జరుగుతుందో అర్థం కాక తల్లిదండ్రులు ఆందోళన గురయ్యారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ప్రధాన రహదారి వైపుగా ఉన్న అద్దాలను ధ్వంసం చేసి నిచ్చెన సాయంతో పిల్లలను సురక్షితంగా కిందికి దించారు. కాగా, ప్రమాదం జరిగిన సమయంలో ఆస్పత్రిలో 42 మంది చిన్నారులు చికిత్స పొందుతున్నారు. వీరందరినీ ఒకే ఆస్పత్రికి తరలిస్తే ఇబ్బందులు వస్తాయని భావించిన యాజమాన్యం పలు ఆస్పత్రులకు తరలించింది. మృతి చెందిన, ఆందోళనకరంగా ఉన్న ఇద్దరు పిల్లల మినహా మిగతా చిన్నారులు క్షేమంగా ఉన్నట్లు సమాచారం. ఘటన సమయంలో పిల్లల వైద్య ఖర్చులన్నీ తామే భరిస్తామని చెప్పిన షైన్ యాజమాన్యం ఆ తర్వాత వారిని గాలికొదిలేయడంతో వారి తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

**మూడు రోజుల క్రితమే ప్రమాదం...**

మూడు రోజుల క్రితం ఆసుపత్రిలోని ఐసీయూలో స్వల్ప అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. దీనిపై రోగుల బంధువులు ఆస్పత్రి సిబ్బందికి ఫిర్యాదు చేశారు. నిర్వాహకులు మాత్రం తాత్కాలిక మరమ్మతులు చేసి చేతులు దులుపుకున్నారు. పక్కా మరమ్మతులు చేసింటే ఈ పరిస్థితి ఉండేది కాదని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు.

**అనుమతి ఎలా ఇచ్చారు..**

200 గజాల స్థలంలో సెల్లార్ సహా జీ+3 అంతస్థుల్లో ఆస్పత్రి భవనాన్ని నిర్మించారు. పార్కింగ్, సెట్‌బ్యాక్ లేకుండా నిర్మించిన ఈ భవనానికి జీహెచ్ఎంసీ ఎలాంటి అనుమతులివ్వలేదు. ఏదైనా విపత్తులు సంభవిస్తే బయటికి వచ్చేందుకు సరైన దారి కూడా లేదు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు మంటలను ఆర్పేందుకు ఆస్పత్రిలో ఫైర్ సేఫ్టీ పరికరాలు లేవు. పార్కింగ్ కూడా లేని ఈ భవనానికి రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు స్పెషాలిటీ హాస్పిటల్, డయాగ్నోస్టిక్స్ నిర్వహణకు అనుమతి ఎలా ఇచ్చారన్నది ప్రశ్నార్థకం. సామర్థ్యానికి మించి పడకలు ఏర్పాటు చేసినా పట్టించుకున్న నాథుడే లేడు. పార్కింగ్, ఇతర సమస్యలపై స్థానికులు జీహెచ్ఎంసీలో ఫిర్యాదు చేసినా పట్టించుకున్న వారే లేరు.

**ఎండీపై కేసు నమోదు...**

ప్రమాద ఘటన తరువాత పోలీసులు ఆసుపత్రికి తాళాలు వేశారు. మృతి చెందిన చిన్నారి కుటుంబ సభ్యులు ఆసుపత్రి ముందు ధర్నా నిర్వహించారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, మున్సిపల్, రెవెన్యూ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని బాధితులను పరామర్శించి, అండగా ఉంటామని హామీ ఇచ్చారు. షైన్ ఆసుపత్రి ఎండీ డాక్టర్ సునీల్‌రెడ్డిపై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ అశోక్‌రెడ్డి తెలిపారు.

# కొత్త టీచర్లు వస్తున్నారు!

- 3,325 మంది ఎస్‌జీటీలుగా ఎంపిక
- రేపటి నుంచే పోస్టింగుల ప్రక్రియ
- 30న విధుల్లోకి కొత్త ఉపాధ్యాయులు
- షెడ్యూల్ జారీచేసిన విద్యాశాఖ
- మరో 910 ఎస్‌జీటీ పోస్టుల భర్తీకి చర్యలు

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలకు ఈనెల 30న కొత్త టీచర్లు రాబోతున్నారు. విద్యాశాఖలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీలో భాగంగా 3,325 సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్‌జీటీ) తెలుగు మీడియం పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల జిల్లాల వారీ జాబితాలు విద్యాశాఖకు అందాయి. దీంతో వారికి పోస్టింగ్‌లు ఇచ్చేందుకు విద్యాశాఖ సోమవారం కౌన్సెలింగ్ షెడ్యూల్ జారీ చేసింది. ఈనెల 23 నుంచి పోస్టింగ్‌లు ప్రక్రియ చేపట్టాలని కలెక్టర్లు, డీఈవోలకు పాఠశాల విద్యా కమిషనర్ విజయ్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు. పాత పది జిల్లాల ప్రాతిపదికన పోస్టింగ్‌ల ప్రక్రియ నిర్వహించాలని పేర్కొన్నారు. ఈ మొత్తం ప్రక్రియను ఈనెల 29లోగా పూర్తి చేయనున్నారు. 3,786 ఎస్‌జీటీ పోస్టుల భర్తీకి 2017లో నోటిఫికేషన్ జారీ చేయగా.. 2018లో పరీక్షలు నిర్వహించి, ఫలితాలు వెల్లడించారు. అయితే, పోస్టింగులు ఇచ్చే సమయంలో పలువురు అభ్యర్థులు కోర్టును ఆశ్రయించడంతో ఈ ప్రక్రియ ఆగిపోయింది. ఎట్టకేలకు కోర్టు ఆదేశాల మేరకు టీఎస్‌పీఎస్సీ అన్ని చర్యలు చేపట్టి, ఎస్‌జీటీ తెలుగు మీడియం టీచర్ పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేసింది. త్వరలోనే మరో 910 ఇంగ్లిష్ మీడియం ఎస్‌జీటీ పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేసేందుకు టీఎస్‌పీఎస్సీ చర్యలు చేపట్టింది. ప్రస్తుతం స్థానికత ఖరారు కాని ఏజెన్సీ పోస్టులు, వికలాంగుల మెడికల్ రిపోర్టులు అందనివి, కోర్టు వివాదాల్లో ఉన్న 461 పోస్టులు మినహా మిగతా 3,325 మంది అభ్యర్థులకు పోస్టింగ్ పత్రాలను విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ ఛైర్మన్‌గా వ్యవహరించే జిల్లా స్థాయి కమిటీలు జారీ చేయనున్నాయి.

## హైకోర్టు పని వేళల్లో మార్పు

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్ర హైకోర్టు పని వేళల్లో మార్పు చేస్తూ రిజిస్ట్రార్ జనరల్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 28 నుంచి పని వేళలు మార్పు అమల్లోకి వస్తుంది. ఉదయం 10.15కి బదులు 10.30కి ప్రారంభమై మధ్యాహ్నం 1.30 వరకు పనిచేస్తుంది. అనంతరం గంటపాటు భోజన విరామం ఉంటుంది. తిరిగి 2.30 నుంచి సాయంత్రం 4.30 వరకూ తిరిగి సమావేశం అవుతుంది.

## పోలీసుశాఖకు ఐటీ ఎక్సలెన్స్ అవార్డు

**సాక్షి, హైదరాబాద్:** ఆధునిక టెక్నాలజీ వినియోగంలో దేశంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సాధించిన రాష్ట్ర పోలీసుశాఖ మరో అవార్డు దక్కించుకుంది. పోలీసుశాఖ సంక్షేమ విభాగానికి చెందిన దాదాపు 3 లక్షల ప్రొఫైల్స్‌ను డిజిటలైజేషన్ చేయడంతోపాటు ఆరోగ్య భద్రత, గృహరుణాలు, రుణాల దరఖాస్తులు తదితరాలకు ఆన్‌లైన్ విధానం ప్రవేశపెట్టింది. ఈ ఘనత సాధించినందుకు పోలీసు వెల్ఫేర్ ఏడీజీ సౌమ్యామిశ్రాకు ఐటీ ఎక్సలెన్స్ అవార్డును ఎక్స్‌ప్రెస్ కంప్యూటర్ సంస్థ అందజేసింది. ఈ సందర్భంగా ఆమెను డీజీపీ మహేందర్ రెడ్డి సోమవారం అభినందించారు.

## డెంగీతో మహిళా న్యాయమూర్తి మృతి


జయమ్మ (ఫైల్)

**హైదరాబాద్/ఖమ్మం లీగల్:** డెంగీ జ్వరంతో బాధపడుతూ ఖమ్మం రెండో అదనపు ప్రథమశ్రేణి న్యాయమూర్తి పి.జయమ్మ (45) మరణించారు. డెంగీతో బాధపడుతున్న ఆమెను ఈ నెల 19న కుటుంబసభ్యులు సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆమె సోమవారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో కన్నుమూశారు. జయమ్మకు భర్త, ఇద్దరు కుమారులు ఉన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలం అయోధ్యనగర్ గ్రామానికి చెందిన జయమ్మ 2013లో జడ్జిగా ఎంపికయ్యారు. హైకోర్టు విభజనలో భాగంగా గుంటూరు జిల్లా సత్తెనపల్లిలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా పనిచేసిన ఆమె 2019 జనవరి 7న ఖమ్మం రెండో అదనపు ప్రథమశ్రేణి కోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించారు. ఆమె మృతికి సంతాపంగా ఖమ్మం కోర్టులో న్యాయవాదులు మౌనం పాటించారు. ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వర్ రావు, అఖిల భారత న్యాయవాదుల సంఘం తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొల్లి సత్యనారాయణ తదితరులు జయమ్మకు సంతాపం ప్రకటించారు.

## అమిత్ షాతో ఎంపీ అర్వింద్ భేటీ



**సాక్షి, న్యూఢిల్లీ:** నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ సోమవారం బీజేపీ జాతీయ అధ్యక్షుడు, కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో సమావేశమయ్యారు. నిజామాబాద్ రైతుల సమస్యలు, నియోజకవర్గానికి సంబంధించి పెండింగ్ అంశాలు, తెలంగాణలో ఉన్న తాజా రాజకీయ పరిస్థితులపై వీరిరువురు చర్చించినట్టు ఎంపీ కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది.

# ఉద్రిక్తతల మధ్య ప్రగతి భవన్ ముట్టడి

- ఆటోలు, కారుల్లో ఒక్కొక్కరిగా చేరుకున్న కాంగ్రెస్ నేతలు
- నల్ల చొక్కాతో బైకుపై వచ్చిన రేవంత్‌రెడ్డి
- తెల్లవారుజామునే ముఖ్య నేతల హౌస్ అరెస్ట్

**హైదరాబాద్:** ఆర్టీసీ కార్మికుల సమ్మెకు మద్దతుగా కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ప్రగతి భవన్ ముట్టడి ఉద్రిక్తతలకు దారి తీసింది. ఉదయం 7 గంటల నుంచి పోలీసులు ప్రగతిభవన్‌కు వచ్చే దారులన్నీ మూసేశారు. దీంతో గుంపుగా వస్తే పోలీసులు అరెస్ట్ చేస్తారని భావించిన కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు ఆటోల్లో, కారుల్లో ఒక్కొక్కరిగా అక్కడకు చేరుకున్నారు. సామాన్య ప్రజల్లా ఫుట్‌పాత్‌పై నడుచుకుంటూ ప్రగతి భవన్‌కు వచ్చారు. అనంతరం పార్టీ జెండాలు ప్రదర్శించి సీఎంకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో పోలీసులు వారిని అడ్డుకుని వ్యానుల్లో ఎక్కించారు. మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, ఎమ్మెల్యే జగ్గారెడ్డి, ఆయన తనయుడు భరత్‌రెడ్డి, టీపీపీసీ అధికార ప్రతినిధులు ఇందిరా శోభన్, హర్షవర్ధన్‌రెడ్డి, టీపీసీసీ కార్యదర్శి విక్రమ్‌గౌడ్, భాస్కర్, టీపీసీసీ అధికార ప్రతినిధి చరణ్ కౌశిక్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు అనిల్‌కుమార్ యాదవ్ తదితరులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ముట్టడి నేపథ్యంలో ఉదయం 7 నుండి 8.30 వరకు బేగంపేట మెట్రోస్టేషన్‌లో రైళ్లను నిలపలేదు. అడిషనల్ సీపీ చౌహాన్, డీసీపీ సుమతి పర్యవేక్షణలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

### నాటకీయ ఫక్కీలో రేవంత్ అరెస్ట్..

ప్రగతి భవన్ ముట్టడికి రాకుండా ఎంపీ రేవంత్‌రెడ్డిని పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. అయితే పోలీసుల కళ్లుగప్పి నల్ల చొక్కాతో ద్విచక్రవాహనంపై ఆయన ప్రగతి భవన్‌కు రావడంతో అరెస్ట్ చేశారు. ఆర్టీసీ కార్మికుల జీవితాలతో చెలగాటమాడుతున్న కేసీఆర్ నశించాలని, తక్షణం ఆర్టీసీ కార్మికులతో చర్చలు జరపాలని రేవంత్ డిమాండ్ చేశారు.

### ముఖ్య నేతల హౌస్ అరెస్ట్..

ప్రగతి భవన్ ముట్టడి నేపథ్యంలో కాంగ్రెస్ ముఖ్య నేతలు జానారెడ్డి, పొన్నాల లక్ష్మయ్య, శ్రీధర్‌బాబు, దామోదర రాజనర్సింహ, షబ్బీర్ అలీ, గీతారెడ్డి, సంపత్‌కుమార్, మల్‌రెడ్డి రంగారెడ్డి, పొన్నం ప్రభాకర్‌లను తెల్లవారుజామునే హౌస్ అరెస్ట్ చేశారు. ఆర్టీసీ జేఏసీ కార్యక్రమంలో పాల్గొని ఇంటికి వెళ్తున్న వి.హనుమంతరావును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గాంధీభవన్ వద్ద టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి, అధికార ప్రతినిధులు సతీష్ మాదిగ, సునీతా రావ్ తదితరుల ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ దిష్టి బొమ్మను దగ్ధం చేసేందుకు ప్రయత్నించగా పోలీసులు వారిని అరెస్ట్ చేసి బేగంపేట పోలీసుస్టేషన్‌కు తరలించారు.

# 84.75 శాతం పోలింగ్

- హుజూర్‌నగర్ ఉప ఎన్నిక ప్రశాంతం
- మొత్తం ఓట్లు 2,36,842
- పోలైనవి 2,00,726 ఓట్లు
- ఓ చోట మొరాయించిన ఈవీఎం
- 24న ఓట్ల లెక్కింపు ప్రక్రియ



**సాక్షి ప్రతినిధి, సూర్యాపేట:** హుజూర్‌నగర్ ఉప ఎన్నికల పోలింగ్ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 84.45 శాతం పోలింగ్ నమోదైంది. నియోజకవర్గంలో మొత్తం 2,36,842 ఓట్లు ఉండగా.. 2,00,726 ఓట్లు పోలయ్యాయి. ఇందులో పురుషుల ఓట్లు 99,023, మహిళల ఓట్లు 1,01,703 ఉన్నాయి. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో ఈ నియోజకవర్గంలో 81.18 శాతం, 2018 ఎన్నికల్లో 86.38 శాతం పోలింగ్ నమోదైంది. ఈ ఏడాది ఏప్రిల్ 11న జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో హుజూర్‌నగర్ నియోజకవర్గ వ్యాప్తంగా 78.85 శాతం పోలింగ్ నమోదైంది.

### 50 శాతం పైగా నమోదు..

ఉప ఎన్నిక జరిగిన సోమవారం ఉదయం 9 గంటల వరకు 13.44 శాతం, 11 గంటల వరకు 31.34 శాతం, మధ్యాహ్నం 1 గంట వరకు 52.89 శాతం, మధ్యాహ్నం 3 గంటల వరకు 69.95 శాతం, సాయంత్రం పోలింగ్ ముగిసే సమయానికి 84.75 శాతం పోలింగ్ నమోదైంది. మధ్యాహ్నానికే 50 శాతం పైగా పోలింగ్ నమోదైంది. సాయంత్రం 5 గంటలలోపు పోలింగ్ కేంద్రం లోపలికి వచ్చిన వారంతా ఓటేశారు. గరిడేపల్లి మండలం కల్మల చెరువలో రాత్రి 7 గంటల వరకు పోలింగ్ కొనసాగింది. హుజూర్‌నగర్ అంబేడ్కర్‌నగర్ పోలింగ్ కేంద్రంలో, మేళ్లచెరువు మండలం కప్పలకుంట తండా, గరిడేపల్లి మండలం వెల్దండలో సాయంత్రం 6 గంటల వరకు ఓటేశారు. గరిడేపల్లి మండలం కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలోని 252 పోలింగ్ బూత్‌లో ఈవీఎం మొరాయించడంతో 40 నిమిషాల పాటు పోలింగ్ నిలిచింది. ఆ తర్వాత సాంకేతిక నిపుణులు దాన్ని సరిచేయడంతో మళ్లీ యథావిధిగా ఓట్లు వేశారు. కేంద్ర ఎన్నికల పరిశీలకులు జీకే.గొక్లానీ, సచింద్రప్రతాప్‌సింగ్, కలెక్టర్ దుగ్యాల అమయ్‌కుమార్, ఎస్పీ ఆర్.భాస్కరన్, జేసీ సంజీవరెడ్డిలు పరిశీలించారు. నియోజకవర్గంలోని 79 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద భారీ బందోబస్తుతో ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోలేదు. కృష్ణపట్టె ప్రాంతంలోని పోలింగ్ కేంద్రాలను ఎస్పీ భాస్కరన్, కేంద్ర ఎన్నికల పరిశీలకులు ప్రత్యేకంగా పరిశీలించారు.

### ఓటేసిన అభ్యర్థులు..

హుజూర్‌నగర్ ఉప ఎన్నికల్లో అభ్యర్థులు నియోజకవర్గంలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. టీఆర్ఎస్ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి.. మఠంపల్లి మండలం గుండ్లపల్లి, టీడీపీ అభ్యర్థి చావా కిరణ్మయి హుజూర్‌నగర్‌లోని ఎన్ఎస్పీ క్యాంపు పాఠశాలలో, బీఎల్ఎఫ్ అభ్యర్థి మేడి రమణ హుజూర్‌నగర్ మండలంలోని లింగగిరి గ్రామంలో, తెలంగాణ ప్రజా పార్టీ అభ్యర్థి దేశగాని సాంబశివగౌడ్ హుజూర్‌నగర్ మండలంలోని బూరుగడ్డలోని పోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు. కాంగ్రెస్ అభ్యర్థి పద్మావతి ఓటు నియోజకవర్గంలో లేకపోవడంతో ఆమె ఓటు వేయలేదు.

### 24న ఓట్ల లెక్కింపు..

ఈ నెల 24న సూర్యాపేటలోని వ్యవసాయ మార్కెట్‌లో ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది. మొత్తం 14 టేబుళ్లపై ఓట్లను లెక్కిస్తారు. ఇందుకు సంబంధించి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. హుజూర్‌నగర్ వ్యవసాయ మార్కెట్ గోదాం నుంచి ఈవీఎంలను సూర్యాపేట మార్కెట్ గోదాంలోకి చేర్చి స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరిచారు.

# వంశపారంపర్య అర్చకత్వానికి ఆమోదం

**ఉత్తర్వులు జారీ చేసిన ఏపీ సర్కారు**

**సాక్షి, అమరావతి:** ఒక గుడిని నమ్ముకొని దశాబ్దాలపాటు అర్చకత్వం చేసుకుంటూ జీవించే అర్చక కుటుంబాల ఏళ్ల నాటి కలను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నెరవేర్చింది. అలాంటి ఆలయాల్లో ఆ అర్చక కుటుంబమే వంశపారంపర్యంగా అధికారికంగా అర్చకత్వం కొనసాగించుకోవడానికి ఆమోదం తెలుపుతూ సోమవారం తుది నోటిఫికేషన్ జారీ చేసింది. తిరుమల తిరుమల దేవస్థానం (టీటీడీ) మినహా ఆంధ్ర ప్రదేశ్ దేవదాయ శాఖ పరిధిలో ఉండే 6 (ఏ), 6 (బీ), 6 (సీ) ఆలయాల్లో వంశపారంపర్య అర్చకత్వ పథకం అమలవుతుంది. 1966 నాటి దేవదాయ శాఖ చట్టం ప్రకారం.. ఏదైనా ఆలయంలో అర్చకులుగా చేరినవారి కుటుంబాలకు ఆ ఆలయంలో వంశపారంపర్య అర్చకత్వం చేసుకోవడానికి అర్హత ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## తెలుగు విభాగాల ఏర్పాటుకు చొరవ తీసుకోండి

**ఉపరాష్ట్రపతిని కోరిన తెలుగు ప్రొఫెసర్లు**

**సాక్షి, న్యూఢిల్లీ:** జేఎన్‌యూ, విశ్వభారతి యూనివర్సిటీల్లో తెలుగు విభాగాల ఏర్పాటుకు చొరవ తీసుకోవాల్సిందిగా ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడిని పలువురు తెలుగు ప్రొఫెసర్లు కోరారు. బెనారస్ హిందూ యూనివర్సిటీ, మద్రాసు, హైదరాబాద్ సెంట్రల్, అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీలకు చెందిన పలువురు తెలుగు ప్రొఫెసర్లు సోమవారం ఢిల్లీలో ఉపరాష్ట్రపతిని కలిశారు. తెలుగు భాషాభివృద్ధి, భాషకు సరైన గౌరవం కల్పించే దిశగా ఉపరాష్ట్రపతి చేస్తున్న కృషిని వారు ప్రశంసించారు. జేఎన్‌యూ, విశ్వభారతి విశ్వవిద్యాలయాల్లో తెలుగు విభాగాల ఏర్పాటుకు చొరవ తీసుకోవాలని ప్రొఫెసర్లు కోరగా.. ఈ విషయమై మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖతో మాట్లాడతానని ఉపరాష్ట్రపతి హామీ ఇచ్చారు. తెలుగు భాషాభివృద్ధికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1968లో ఏర్పాటుచేసిన తెలుగు అకాడమీని రెండు తెలుగు రాష్ట్రాల్లో వేర్వేరుగా ఏర్పాటు చేయాల్సి ఉందని, అలాగే పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం విభజనపై ప్రొఫెసర్లు వెంకయ్య దగ్గర ప్రస్తావించగా.. ఇది రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోకి వస్తుందని, అయితే కేంద్ర ప్రభుత్వం వైపునుంచి దీనిపై సూచనలు పంపేలా చొరవ తీసుకుంటానని చెప్పారు. తమిళనాడులో నివసిస్తున్న తెలుగు వారి కోసం తెలుగు మాధ్యమంలో పాఠశాలల పునరుద్ధరణపై ఆ రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రితో మాట్లాడానని ఉపరాష్ట్రపతి తెలిపారు.




ముంబైలో ఓటు వేసిన బాలీవుడ్ నటులు ఆమిర్ ఖాన్, దీపికా పదుకొనె, రణ్‌వీర్ సింగ్, సల్మాన్ ఖాన్, ఐశ్వర్యారాయ్, అభిషేక్ బచ్చన్ దంపతులు, ఊర్మిళా మతోండ్కర్, మాజీ క్రికెటర్ సచిన్, అంజలి దంపతులు

# కాషాయ ప్రభంజనమే!

**అసెంబ్లీ ఎన్నికల ఎగ్జిట్ పోల్స్**




**న్యూఢిల్లీ:** మహారాష్ట్ర, హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో కాషాయ ప్రభంజనం ఖాయంగా కనిపిస్తోంది. పోలింగ్ అనంతరం సోమవారం పలు మీడియా సంస్థలు విడుదల చేసిన ఎగ్జిట్ పోల్స్ ఇదే విషయాన్ని స్పష్టం చేశాయి. గెలిచే సంఖ్యలో కొద్ది తేడాలున్నా గెలుపైతే ఖాయమేనని అన్ని ఎగ్జిట్ పోల్స్ తేల్చేశాయి. 288 అసెంబ్లీ స్థానాలున్న మహారాష్ట్రలో బీజేపీ శివసేన కూటమి సునాయాసంగా డబుల్ సెంచరీ సాధిస్తుందని న్యూస్ 18– ఐపీఎస్ఓఎస్, ఏబీపీ– సీ ఓటరు పోల్స్ తేల్చాయి. బీజేపీ సొంతంగానే మెజారిటీ సాధించడానికి 3 స్థానాల దూరంలో ఆగిపోయిందని న్యూస్ 18– ఐపీఎస్ఓఎస్ పేర్కొంది. అన్ని ఎగ్జిట్ పోల్స్ సగటును పరిగణనలోకి తీసుకుంటే బీజేపీ శివసేన కూటమికి 211, కాంగ్రెస్ – ఎన్సీపీ కూటమికి 64 సీట్లు వస్తాయని తేలింది. హరియాణాలో కూడా బీజేపీ విజయం లాంఛనమేనని దాదాపు అన్ని ఎగ్జిట్ పోల్స్ తేల్చాయి. 90 స్థానాల అసెంబ్లీలో మూడింట రెండొంతుల మెజారిటీ సాధిస్తుందని పేర్కొన్నాయి. టైమ్స్ నౌ పోల్ బీజేపీ 71, కాంగ్రెస్ 11 స్థానాల్లో గెలుస్తుందని వెల్లడించింది. జన్ కీ బాత్ సర్వే బీజేపీకి 57, కాంగ్రెస్‌కు 17 స్థానాలు ఇచ్చింది. న్యూస్ ఎక్స్ 77 సీట్లు బీజేపీవేనంది. టీవీ9 భారత్‌వర్ష్ ఎగ్జిట్ పోల్ మాత్రం బీజేపీ మెజారిటీ కన్నా ఒక స్థానం ఎక్కువగా 47 సీట్లు గెలుస్తుందంది. కాంగ్రెస్ 23 స్థానాల్లో, ఇతరులు 20 స్థానాల్లో గెలుస్తారని చెప్పింది. మహారాష్ట్రలో బీజేపీ, శివసేన కూటమికి 46.4 శాతం వస్తాయని ఐఏఎన్ఎస్– సీఓటర్ సర్వే పేర్కొంది. 2014 ఎన్నికల్లో ఈ రెండు పార్టీలు కలిసి 47.2 శాతం ఓట్లు సాధించాయి. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ – ఎన్సీపీ కూటమి 38.3% ఓట్లు పొందగా, ఈ సారి 36.9% ఓట్లు వస్తాయని ఐఏఎన్ఎస్– సీఓటర్ సర్వే తెలిపింది.


మహారాష్ట్రలోని పుణే జిల్లా బారామతిలో పోలింగ్ స్టేషన్ ఆవరణలో బురదగా ఉండటంతో ఓటర్లు వచ్చివెళ్లేందుకు అనువుగా ట్రాక్టర్ ట్రాలీలను వరుసలో ఉంచి వంతెనలాగా వాడుతున్న దృశ్యం

# పోలింగ్ ప్రశాంతం

- మహారాష్ట్రలో 60.46%, హరియాణాలో 65% ఓటింగ్
- 51 స్థానాల ఉప ఎన్నికల్లో దాదాపు 57% ఓటింగ్

**న్యూఢిల్లీ/చండీగఢ్/ముంబై:** దేశంలో మినీ అసెంబ్లీ ఎన్నికలు, ఉప ఎన్నికల ఘట్టం ప్రశాంతంగా ముగిసింది. మహారాష్ట్రలో 288, హరియాణాలో 90 అసెంబ్లీ స్థానాలతోపాటు వివిధ రాష్ట్రాల్లోని 51 అసెంబ్లీ స్థానాలకు రెండు పార్లమెంటు స్థానాలకు సోమవారం పోలింగ్ ప్రక్రియ పూర్తయింది. మహారాష్ట్రలో 60.46% మంది, హరియాణాలో 65% మంది తమ ఓటు హక్కు ఉపయోగించుకున్నారు. క్యూల్లో ఓటర్లు నిలుచుని ఉన్నందున ఓటింగ్ శాతం పెరిగే అవకాశం ఉందని ఎన్నికల సంఘం(ఈసీ) తెలిపింది. 51 అసెంబ్లీ నియోజకవర్గాలు, రెండు లోక్‌సభ నియోజకవర్గాలకు జరిగిన ఉప ఎన్నికల్లో దాదాపు 57% పోలింగ్ నమోదైందని వెల్లడించింది. కేరళలో భారీగా వర్షం కురిసినప్పటికీ ప్రజలు ఓటింగ్‌లో ఉత్సాహంగా పాల్గొన్నట్లు తెలిపింది. కాగా, ఓట్ల లెక్కింపు ఈ నెల 24వ తేదీన జరగనున్న విషయం తెలిసిందే. సాయంత్రం 6 గంటల సమయానికి మహారాష్ట్రలో 60.46% పోలింగ్ నమోదైంది. 2014 ఎన్నికల్లో కూడా రాష్ట్రంలో 63.38% పోలింగ్ నమోదు కావడం విశేషం. పట్టణ ప్రాంతాల్లో కంటే గ్రామీణ ప్రాంతాల్లో ఓటర్లే ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఉత్సాహం చూపారు. ముంబైలో కేంద్రమంత్రి స్మృతి ఇరానీతోపాటు వచ్చిన ఓ వృద్ధుడు తన ఓటు హక్కు వినియోగించుకోవడం అందరి దృష్టిని ఆకర్షించింది. 'ఈ రోజు హీరో ఖన్నా సాబ్. ఆర్మీలో పనిచేసిన ఈయన వయసు 93 ఏళ్లు. ఓటేయడానికి వచ్చారు. ఇది అందరికీ స్ఫూర్తినిచ్చే అంశం' అంటూ ఇరానీ పేర్కొన్నారు.


సిరా గుర్తుతో హరియాణా సీఎం ఖట్టర్

**హరియాణాలో 65% నమోదు**

గత ఎన్నికలతో పోలిస్తే హరియాణాలో ఈసారి తక్కువ మంది ఓటేశారు. సోమవారం సాయంత్రం 6 గంటల సమయానికి 65% పోలింగ్ నమోదైందని ఎన్నికల సంఘం పేర్కొంది. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో ఇది 76.54% కాగా, 2019 లోక్‌సభ ఎన్నికల్లోనూ 70.36% మంది ఓటు హక్కు వినియోగించుకోవడం గమనార్హం.

**పోలింగ్‌పై ఫిర్యాదులు.. అపశ్రుతులు**

ఉల్లంఘనలకు సంబంధించి ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ 250 వరకు ఫిర్యాదులు చేసిందని ఎన్నికల సంఘం తెలిపింది. రాంటెక్ నియోజకవర్గంలో ఓ వ్యక్తి ఈవీఎంలో కాంగ్రెస్ అభ్యర్థి గుర్తు బటన్ నొక్కగా బీజేపీకి ఓటు పడినట్లు చూపినట్లు కాంగ్రెస్ ఆరోపించింది. మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా పుర్సల్ గొండి గ్రామంలో ఎన్నికల విధులకు వెళ్తూ బాపు పాండు గవాడే(45) అనే ఉపాధ్యాయుడు మరణించాడు. భోసారి నియోజకవర్గంలో అబ్దుల్ రహీం షేక్(62) ఓటేసేందుకు వచ్చి అకస్మాత్తుగా తుదిశ్వాస విడిచాడు.


ఓటేస్తున్న మహారాష్ట్ర సీఎం ఫడ్నవిస్. చిత్రంలో ఆయన భార్య అమృత

## ఉప ఎన్నికల్లో మోస్తరు ఓటింగ్

దేశవ్యాప్తంగా 51 అసెంబ్లీ స్థానాలు, రెండు లోక్ సభ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లో 56.84% పోలింగ్ నమోదైంది. అతితక్కువగా ఉత్తరప్రదేశ్‌లో 47.05% మంది మాత్రమే ఓటు హక్కు వినియోగించుకున్నారు. కేరళలో ముఖ్యంగా ఎర్నాకులంలో భారీ వర్షం కారణంగా రహదారులపై నీరు నిలిచినప్పటికీ ఓటర్లు వెనుకంజవేయలేదు. ఇక్కడ 53.27% మంది ఓటేశారు. కేరళలో అత్యధికంగా అరూర్‌లో 75.74% ఓటింగ్ నమోదైంది. కాగా, అరుణాచల్‌ప్రదేశ్‌లో ఖోన్సా వెస్ట్ నియోజకవర్గంలో అత్యధికంగా 90% ఓటింగ్ నమోదైంది. ఛత్తీస్‌గఢ్‌లోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతంలో 74%, తెలంగాణలోని హుజూర్‌నగర్‌లో 84% మంది ఓటు వేశారు. తమిళనాడులోని విక్రవండి నియోజకవర్గంలో 84.36%, గుజరాత్‌లో 51%, బిహార్‌లో 49.50% పంజాబ్‌లో 60%, రాజస్తాన్‌లో 66% పోలింగ్ నమోదైంది.

## వ్యాపార దిగ్గజాలు పోలింగ్‌కు దూరం

టాటా గ్రూప్‌నకు చెందిన రతన్ టాటా, ఎన్. చంద్రశేఖరన్, అంబానీ సోదరులు, సజ్జన్ జిందాల్ వంటి వ్యాపార దిగ్గజాలు సోమవారం ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. అయితే, చాలా ముఖ్యమైన పనుల్లో వారు వేరే ప్రాంతంలో బిజీగా ఉన్నందునే ఓటెయ్య లేకపోయారని సంబంధిత వర్గాలు తెలిపాయి. సాధారణంగా ముకేశ్, అనిల్ అంబానీ సోదరులు తమ కుటుంబాలతో కలిసి వచ్చి ఓటు వేస్తుంటారు. కానీ, ఈసారి వారు రాలేదు. అందుకు కారణాలు కూడా వెల్లడి కాలేదు. సోమవారం పోలింగ్ స్టేషన్‌కు వచ్చి ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖ వ్యాపార వేత్తల్లో మహీంద్రా గ్రూప్ చైర్మన్ ఆనంద్ మహీంద్రా, హెచ్‌డీఎఫ్‌సీ సీఈవో కేకి మిస్త్రీ, మరికో చైర్మన్ హర్ష్ మరివాలా, ఎం అండ్ ఎం ఎండీ పవన్ గోయెంకా ఉన్నారు. మహారాష్ట్ర అసెంబ్లీలోని 288 స్థానాల్లో ఒక ముంబై మహానగరానికి సంబంధించి 38 నియోజకవర్గాలున్నాయి.

## తనలాగా ఉన్న 8మందితో పరీక్షలు

**బంగ్లాదేశ్ మహిళా ఎంపీ నిర్వాకం • బహిష్కరించిన యూనివర్సిటీ**

**ఢాకా:** బంగ్లాదేశ్ అధికార పార్టీకి చెందిన మహిళా ఎంపీ ఒకరు వర్సిటీ పరీక్షలను తన పోలికలతో ఉన్న 8మంది మహిళలతో రాయించారు. ఈ విషయం మీడియా బయటపెట్టడంతో ఆమెను వర్సిటీ బహిష్కరించింది. అధికార అవామీ లీగ్ పార్టీకి చెందిన ఎంపీ తమన్నా నుస్రత్ బంగ్లాదేశ్ ఓపెన్ యూనివర్సిటీలో బీఏ చదువుతున్నారు. ఇందులో భాగంగా 13 సబ్జెకుల పరీక్షలు రాసేందుకు తన మాదిరిగానే ఉన్న 8 మంది మహిళలను వినియోగించుకున్నారు. ఈ విషయాన్ని నాగరిక్ టీవీ అనే చానెల్ బయట పెట్టింది. పరీక్షలు రాస్తున్న సమయంలో వారికి ఎంపీ అనుచరులు కాపలాగా ఉన్నారని తెలిపింది. స్పందించిన వర్సిటీ అధికారులు ఎంపీ నుస్రత్‌ను బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు.


## రాజ్యాంగంపై పెళ్లినాటి ప్రమాణాలు!


రక్తదానం చేస్తున్న నవ దంపతులు

**బరంపూర్:** పెళ్లంటే మనకు గుర్తుకు వచ్చేది అంగరంగవైభవంగా జరిపించడమే. అయితే ఒడిశాలోని గంజాం జిల్లాకు చెందిన ఓ జంట వారి పెళ్లిని వినూత్నంగా జరుపుకున్నారు. తమ పెళ్లి రోజున రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తామని భారత రాజ్యాంగంపై ప్రమాణం చేశారు. ఫార్మాస్యూటికల్ సంస్థలో ఉద్యోగి అయిన విప్లవ్ కుమార్ (31), ఏఎన్ఎంగా పనిచేస్తున్న అనిత (23)ను ఆదివారం వారి కుటుంబ సభ్యులు, బంధువులు, అతిథులు, రక్తదాన శిబిరంలో పాల్గొన్న వారి సమక్షంలో వివాహమాడారు. రిటైర్డ్ ఉద్యోగి అయిన విద్యుత్ ప్రభ రథ్ నూతన వధూవరులతో ఈ ప్రమాణం చేయించారు.

# భవిష్యత్ తరాలపై ప్రభావం

**అయోధ్య కేసులో సుప్రీంకోర్టుకు ముస్లిం వర్గాల లిఖితపూర్వక అభ్యర్థన**



**న్యూఢిల్లీ:** సున్నితమైన అయోధ్య కేసులో సుప్రీంకోర్టు ఇచ్చే తీర్పు భవిష్యత్ తరాలపై ప్రభావం చూపుతుందని సున్నీ వక్ఫ్ బోర్డు సహా ముస్లింల తరపు కక్షిదారులు పేర్కొన్నారు. కోర్టు ఆదేశాల మేరకు తీర్పులో తామేం కోరుకుంటున్నారో సంక్షిప్తంగా, లిఖిత పూర్వకంగా సీజేఐ జస్టిస్ గొగోయ్ నేతృత్వంలోని బెంచ్‌కు వారు సోమవారం సమర్పించారు. 'ఆ కాపీ సీల్డ్ కవర్‌లో నామ్‌ముందుంది. కానీ అందులోని అంశాలు ఈరోజు పత్రికలో పతాక శీర్షికలో వచ్చాయి' జస్టిస్ గొగోయ్ అన్నారు. 'ఈ కోర్టు ఇచ్చే తీర్పు ఏదైనా.. దాని ప్రభావం భవిష్యత్ తరాలపై ఉంటుంది. తీర్పు పరిణామాలు దేశ రాజకీయాలపై కనిపిస్తాయి. 1950 జనవరి 26న దేశం గణతంత్ర రాజ్యంగా ఆవిర్భవించినప్పుడు ఆమోదించిన రాజ్యాంగవిలువలపై విశ్వాసం ఉన్న ప్రజల ఆలోచనలపై ఈ కోర్టు నిర్ణయం ప్రబల ప్రభావం చూపుతుంది' అని ఆ కాపీలో పేర్కొన్నారు. ఆ కాపీని ముస్లింల తరపు వాదించిన సీనియర్ న్యాయవాది రాజీవ్ ధావన్ రూపొందించారు. 'సమాజంపై ఈ తీర్పు చూపే ప్రభావాన్ని పరిగణనలోకి తీసుకుని, ఈ చరిత్రాత్మక తీర్పు వల్ల తలెత్తే పరిణామాలను అంచనా వేసి, దేశం నమ్ముతున్న రాజ్యాంగ విలువలను ప్రతిబింబించేలా తీర్పు ప్రకటించాల్సిందిగా కోరుతున్నాం' అని అందులో అభ్యర్థించారు. తీర్పులో తామేం కోరుకుంటున్నారో సంక్షిప్తంగా పేర్కొంటూ హిందూ వర్గాలు శనివారమే తమ కాపీలను సుప్రీం కోర్టుకు అందించాయి. వివాదాస్పద స్థలంలో హిందువులు పూజలు చేస్తున్నారని రామ్ లల్లా తరపున వాదించిన సీనియర్ న్యాయవాది వైద్యనాథన్ తాను రూపొందించిన కాపీలో పేర్కొన్నారు.

## 18 నుంచి డిసెంబర్ 13 వరకు

**పార్లమెంటు శీతాకాల సమావేశాలు**



**సాక్షి ప్రతినిధి, న్యూఢిల్లీ:** పార్లమెంటు శీతాకాల సమావేశాలు నవంబర్ 18 నుంచి డిసెంబర్ 13 వరకు జరగనున్నాయి. పార్లమెంటు ఉభయ సభల సెక్రటేరియట్లకు సోమవారం ఈ సమాచారాన్ని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ పంపించింది. గత రెండేళ్లుగా శీతాకాల సమావేశాలు నవంబర్ 21న ప్రారంభమై.. జనవరి మొదటి వారం వరకు కొనసాగాయి. ఈ సమావేశాల్లో రెండు ఆర్డినెన్సులు, పలు కీలక బిల్లులు పార్లమెంటు ముందుకు రానున్నాయి. నూతన, దేశీ తయారీ సంస్థలకు కార్పొరేట్ పన్నును తగ్గిస్తూ జారీ అయిన ఆర్డినెన్స్, ఈ–సిగరెట్ల తయారీ, అమ్మకం, నిల్వను నిషేధిస్తూ జారీ చేసిన ఆర్డినెన్స్‌లకు చట్టరూపం ఇవ్వాల్సి ఉంది. ఆర్థిక వృద్ధిలో వైఫల్యం, కశ్మీర్‌లో స్థానికుల పరిస్థితి, ఎన్నార్సీ, పౌరసత్వ బిల్లు.. మొదలైన అంశాలపై విపక్ష సభ్యులు లేవనెత్తేవీలుంది. పార్లమెంటు సమావేశాలను మరో వారం పాటు పొడగించే అవకాశముందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఇటీవలి వర్షాకాల సమావేశాల్లో 28 బిల్లులు పార్లమెంటు ఆమోదం పొందాయి. ఈ సమావేశాల్లోనే కార్మిక సంస్కరణలకు సంబంధించిన బిల్లు ఆమోదం పొందే అవకాశముంది.

## ఆరే కాలనీలో చెట్లను కూల్చొద్దు: సుప్రీం

**న్యూఢిల్లీ:** ముంబై మెట్రో కార్ షెడ్ ప్రాజెక్టు కోసం ఆరే కాలనీలో చెట్ల కూల్చివేత అంశంపై సుప్రీంకోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. చెట్ల కూల్చివేతపై యథాతథస్థితి (స్టేటస్ కో) కొనసాగించాలని ఆదేశించింది. ముంబైలో పచ్చదనానికి నెలవైన ఆరే కాలనీలో మెట్రో కార్‌షెడ్ ప్రాజెక్టు కోసం పెద్ద సంఖ్యలో చెట్లను నేలకూల్చడంపై న్యాయ విద్యార్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించడం తెల్సిందే. ఆరే కాలనీలో ఇప్పటి వరకు జరిగిన చెట్ల కూల్చివేత, ప్రాజెక్టు పనులపై నివేదిక ఇవ్వాలని, నరికివేతకు గురైన చెట్ల స్థానంలో మళ్లీ మొక్కలు పెంచాలని బృహన్ముంబై మునిసిపల్ కార్పొరేషన్ (బీఎంసీ)ను ఆదేశించింది.

## ఇంటర్నెట్‌తో ప్రజాస్వామ్యానికి విఘాతం!

- జనవరికల్లా సోషల్ మీడియా నిబంధనలు సిద్ధం చేస్తాం
- సుప్రీంకోర్టుకు కేంద్రం వెల్లడి



**న్యూఢిల్లీ:** ప్రజాస్వామ్యంలో ఇంటర్నెట్ ప్రమాదకారిగా పరిణమించిందని, ఇది ఊహించనంత విఘాతాన్ని కలిగిస్తుందని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపింది. వినియోగదారులు పెరిగే కొద్దీ దేశం ముందుకు వెళుతోందని కేంద్రం తరపున వాదలను వినిపించిన రజత్ నాయర్ తెలిపారు. ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాలలో చేసే పోస్టుల వల్ల మేలుతో పాటు అంతకు మించిన కీడు జరుగుతోందని తెలిపారు. ద్వేష భావాలు, నిరాధార వార్తలు, వ్యక్తిత్వ హననం, దేశ వ్యతిరేక కామెంట్లు, పోస్టులు పెరుగుతున్నాయన్నారు. సామాజిక మాధ్యమాల నియంత్రణ కోసం నిబంధనలను ఖరారు చేసి నోటిఫై చేసేందుకు మరో మూడు నెలల గడువు కావాలని ప్రభుత్వం సుప్రీం కోర్టును కోరింది. మూడు నెలల్లో నిబంధనలతో కూడిన సమాచార ముసాయిదాను 2020 జనవరి నాటికల్లా సిద్ధం చేస్తామని ఎలక్ట్రానిక్స్, సమాచార శాఖ అదనపు కార్యదర్శి పేర్కొన్నారు. త్వరలో మార్గదర్శకాలు తయారుచేస్తామన్నారు.

తెలంగాణ ప్రభుత్వం
ప్రజారోగ్యం మరియు మున్సిపల్ ఇంజినీరింగ్ శాఖ
టెండరు కోరుతూ ప్రకటన
No.51/SE/TS/TUFIDC/Parkal.Phase-II/11.65 Cr/2019-20/85 తేది: 21-10-2019
పరకాల మున్సిపాలిటీ-పరకాల మున్సిపాలిటీలో TUFIDC సహాయంతో ULBలలో మౌలిక సదుపాయాల అభివృద్ధి-డివైడర్లు ఏర్పాటు చేయుట-(a) బస్టాండ్ జంక్షన్ నుండి బస్ డిపో జంక్షన్ వరకు, (b) బస్టాండ్ జంక్షన్ నుండి క్రొత్త మున్సిపల్ ఆఫీస్ జంక్షన్ వరకు. జంక్షన్ అభివృద్ధి పనులు-(a) ATM జంక్షన్ (b) బస్టాండ్ జంక్షన్ (c) బస్ డిపో జంక్షన్ (d) దామర చెరువు జంక్షన్, న్యూ మున్సిపల్ ఆఫీస్ జంక్షన్, దామర చెరువు బండ్ అభివృద్ధి, దామర చెరువు ప్రక్కన గల పార్క్ అభివృద్ధి, ఆధునిక నాన్-వెజ్ మార్కెట్ నిర్మాణం మరియు ఆంధ్రా బ్యాంక్ ప్రక్కన గల బాక్స్ కల్వర్ట్ నిర్మాణం. పనుల సంఖ్య: 01 నం. మొత్తం పనుల విలువ: రూ.805.00 లక్షలు. బిడ్ల డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 24-10-2019, బిడ్ల డౌన్‌లోడ్ ముగింపు తేది: 08-11-2019. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్‌ప్లేస్ www.tender.telangana.gov.in లో చూడవచ్చును.
సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్ (PH), UNIT-I, TUFIDC, వరంగల్
DIPR Ro.No.SPL03/21/DP/CL/Advt/1/2019-20, Dt:21-10-2019


తెలంగాణ ప్రభుత్వం
MGM హాస్పిటల్, వరంగల్
Rc.No. Plg/4375/2019 పాత భవనాలను కూల్చివేయుట తేది: 21.10.2019
బహిరంగ వేలం
పాత భవనాలను కూల్చివేయుట మరియు ఆసుపత్రి ఆవరణల నుండి కిటికీలు, కిటికీ ఫ్రేములు, తలుపులు, తలుపు ఫ్రేములు, వెంటిలేటర్ ఫ్రేములు మరియు ఇతర భవన మెటీరియల్ తీసుకొనిపోవుట, చెత్తను ఏరివేయుట మరియు గ్రౌండ్ లెవల్‌కు సమాంతరం చేయుటకు కాంట్రాక్టర్ల నుండి టెండర్లు కోరడమైనది. ఆసక్తి గల వ్యక్తులు/సంస్థలు "Superindent, MGM Govt. Hospital, Warangal" పేరున DD/నగదు రూపంలో రూ. 50,000/- కార్యాలయ పని రోజులలో ఉ. 10.30 గం. నుండి సా. 05.00 గం. మధ్య చెల్లించవలెను. సూపరింటెండెంట్ ఆఫీస్, MGM హాస్పిటల్, వరంగల్‌లో వివరాలు లభించును. టెండరు దరఖాస్తు ఫారం ధర: రూ. 2,000/- (రెండు వేల రూపాయలు మాత్రమే) (వాపసు తిరిగిరానిది). "Superindent, MGM Hospital, Warangal" పేరున DD ద్వారా. టెండరు దరఖాస్తు ఫారం అమ్మకం: 30.10.2019 ఉ. 11.00 గం. నుండి మ. 02.00 గం. వరకు. బహిరంగ వేలం తేది: 30.10.2019 సా. 04.00 గం.కు. స్కూల్ ఆఫ్ నర్సింగ్, MGM హాస్పిటల్, వరంగల్ ఆవరణలో.
సం/- సూపరింటెండెంట్, MGM హాస్పిటల్, వరంగల్
DIPR.Ro.No. SPL06/21/DP/CL/ADVT/1/2019-20, Dt 21/10/2019

సాక్షి ఉద్యోగ అవకాశాలు

WANTED
Required Professors, Associate Professors & Assistant Professors for immediate recruitment for a 21 years old-800 bedded postgraduate teaching SVS Medical College Hospital in Telangana, for General Medicine, General Surgery, Anaesthesia, Obstetrics & Gynaecology & Radiology. Compensation : excellent pay packages with free residential accommodation. Eligible candidates to contact :
Dr.D.A.Prabhakara Rao (9849158123)
Dr.S G Srinath (9441283337)

# చొరబాట్లు ఆపేవరకు ఇంతే

**దాడులపై రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్**



**లేహ్:** సరిహద్దుల వద్ద చొరబాట్లకు భారత ఆర్మీ పాకిస్తాన్‌కు తగిన సమాధానం చెప్పిందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ అన్నారు. పాక్ చొరబాట్లను ఆపని పక్షంలో ఇలాంటి చర్యలే కొనసాగుతాయని హెచ్చరించారు. శ్యోక్ నది సమీపంలోని తూర్పు లదాఖ్‌లో నిర్మించిన 1,400 అడుగుల కోల్ చెవాంగ్ రించేన్ వంతెనను సోమవారం మంత్రి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఆర్టికల్ 370, 35ఏ రద్దు తర్వాత లదాఖ్‌తో స్నేహ బంధం మాత్రమే ఉంటుందని.. శత్రుత్వానికి చోటు ఉండదన్నారు. పాక్ విషయంలో సాయుధ దళాలు ముందస్తు దాడులు చేయలేదని, పాక్ కాల్పులు జరిపిన తర్వాతనే ఎదురుదాడులు చేశాయని చెప్పారు. భారతదేశ సమగ్రతను అస్థిరపరచడానికి, బలహీనపరచడానికి పాక్ ఉగ్ర కార్యకలాపాలను ప్రోత్సహిస్తోందని ఆరోపించారు. దీనికి మన సాయుధ దళాలు గట్టిగానే బదులిస్తున్నాయని అన్నారు.


**సియాచిన్ పర్యటనకు అనుమతి..**

**లేహ్–లదాఖ్:** ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన యుద్ధభూమిగా పేరుగాంచిన సియాచిన్‌పైకి పర్యాటకులను అనుమతినిస్తున్నట్లు రాజ్‌నాథ్ సింగ్ వెల్లడించారు. కునార్ బేస్ క్యాంప్ నుంచి కునార్ పోస్ట్ వరకు ఉన్న మార్గాలను తెరవాలని ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. లదాఖ్‌లో పర్యాటకాన్ని ప్రోత్సహించాలనే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకుందని తెలిపారు.

**పాక్ ఉగ్రదాడులు ఆపాలి: గవర్నర్**

పాక్ ఉగ్రదాడులు ఆపకపోతే భారత ఆర్మీ పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోకి చొచ్చుకువెళ్లి అక్కడి ఉగ్రస్థావరాలపై విరుచుకుపడుతుందని కశ్మీర్ గవర్నర్ సత్యపాల్ వ్యాఖ్యానించారు. పాకిస్తాన్ ఇకనైనా తన వైఖరి మార్చుకోవాలని.. ఉగ్రక్యాంపుల ఏర్పాటు మానుకోవాలని హితవు పలికారు. లేని పక్షంలో భారత ఆర్మీ ఉగ్ర క్యాంపులను కూల్చివేస్తుందని చెప్పారు.

### కర్తార్‌పూర్ టికెట్ 1400



దర్బార్ సాహిబ్‌ను సందర్శించుకునే సిక్కు యాత్రికుల కోసం నిర్మిస్తున్న కర్తార్‌పూర్ కారిడార్ నుంచి సంవత్సరానికి సుమారు భారత కరెన్సీ ప్రకారం రూ.258 కోట్ల మేర ఆదాయం పొందాలని పాకిస్తాన్ భావిస్తోంది. దీనికోసం కర్తార్‌పూర్ సందర్శనకు వచ్చే భక్తుల నుంచి పెద్దమొత్తంలో ప్రవేశ రుసుము వసూలు చేయాలని నిర్ణయించింది. దీంతో ఒక్కో భక్తుడు సుమారు రూ.1,400 చెల్లించాలని పేర్కొంది. దీనిపై భారత్ అసంతృప్తి వ్యక్తం చేసింది. అయినప్పటికీ ఈ నెల 23న కారిడార్‌కు సంబంధించిన ఒప్పందంపై ఇరు దేశాలు సంతకం చేయనున్నాయి.

## భారత్‌కు పాక్ తపాలా సేవలు బంద్

జమ్మూకశ్మీర్‌కు స్వతంత్ర ప్రతిపత్తిని రద్దు చేస్తూ కేంద్రం ఆగస్టులో 5వ తేదీన తీసుకున్న నిర్ణయానికి నిరసనగా అదే నెల 27 నుంచి భారత్‌తో పాక్ తపాలా సేవలను నిలిపివేసింది. రెండు దేశాల మధ్య తపాలా సర్వీసులు రెండు నెలలుగా నిలిచిపోయినట్లు తపాలా శాఖ మంత్రి రవిశంకర్ ధ్రువీకరించారు. తపాలా సేవలను పాకిస్తాన్ ఏకపక్షంగా నిలిపివేసింది. 'భారత్ నుంచి ఉత్తరాలు తీసుకోవడం లేదు. దీనిపై ప్రభుత్వానికి ముందుగా ఎటువంటి సమాచారం ఇవ్వలేదు. పాక్ నిర్ణయం ప్రపంచ తపాలా సంఘం నిబంధనలకు విరుద్ధం. ఎంతైనా అది పాకిస్తాన్ కదా..!' అని వ్యాఖ్యానించారు. ఆ చర్యకు బదులుగా భారత్ కూడా పాక్ మెయిళ్లను తీసుకోవడం బంద్ చేసిందన్నారు. భారత్, పాక్‌ల మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు సౌదీ విమాన సర్వీసుల ద్వారా జరుగుతున్నట్లు సమాచారం.

# సాగులో మనమే భేష్

- గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ప్రశంస..
- అనేక పథకాలు ప్రవేశపెట్టిందని సర్కారుకు కితాబు
- వ్యవసాయంలోకి యువతను ఆకర్షించాలని సూచన
- రైతు ఆదాయం రెట్టింపునకు ప్రధాని మోదీ కృషి చేస్తున్నారని వెల్లడి



యూత్ యాజ్ టార్చ్ బేరర్స్ ఆఫ్ బిజినెస్ ఓరియెంటెడ్ అగ్రికల్చర్ ఇన్ సౌతిండియా సదస్సులో పంట ఉత్పత్తులను పరిశీలిస్తున్న గవర్నర్ తమిళిసై, పక్కన మంత్రి నిరంజన్‌రెడ్డి

**సాక్షి, హైదరాబాద్:** వ్యవసాయ, రైతు సంక్షేమంలో తెలంగాణ ప్రభుత్వం చాలా వేగంగా ముందుకెళ్తోందని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ప్రశంసించారు. రాష్ట్ర రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని కితాబిచ్చారు. రైతు అయిన నిరంజన్‌రెడ్డి వ్యవసాయమంత్రిగా ఉండటం వల్ల రైతులకు మరింత మేలు జరుగుతుందని పేర్కొన్నారు. త్వరలోనే జోగులాంబ ఆలయాన్ని, మంత్రి మామిడితోటను సందర్శిస్తానని చెప్పారు. జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం రెండ్రోజుల పాటు నిర్వహించనున్న 'యూత్ యాజ్ టార్చ్ బేరర్స్ ఆఫ్ బిజినెస్ ఓరియెంటెడ్ అగ్రికల్చర్ ఇన్ సౌతిండియా'సదస్సును ఆమె సోమవారం ప్రారంభించారు. రాజేంద్రనగర్‌లోని వర్సిటీ ఆడిటోరియంలో ఈ సదస్సు జరుగుతోంది. రైతు ఆదాయం రెట్టింపు చేసేందుకు, వ్యవసాయరంగ సంక్షేమానికి ప్రధాని నరేంద్ర మోదీ అనేక చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. రైతుల ఆదాయం రెట్టింపే లక్ష్యంగా ఆర్థిక సాయం, పింఛన్ సదుపాయాలను కేంద్రం అందిస్తోందని వివరించారు. వ్యవసాయం వైపు యువతను మరింత ఆకర్షించాల్సిన అవసరం ఉందని, ఆ దిశగా వర్సిటీ ఈ సదస్సు నిర్వహించడం హర్షణీయమని చెప్పారు. వచ్చే నెలలో జరగనున్న గవర్నర్ల సదస్సులో తాను వ్యవసాయం అంశంపై మాట్లాడతానని పేర్కొన్నారు.

**మార్కెటింగ్‌పై యువతకు శిక్షణ..**

తెలంగాణ జనాభాలో 60 శాతం గ్రామీణ ప్రాంతాల్లోనే ఉండి, వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని వ్యవసాయ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. వారి సంక్షేమం కోసం తమ ప్రభుత్వం రైతుబంధు, రైతుబీమా, మిషన్ కాకతీయ వంటి పథకాలెన్నో అమలు చేస్తోందని వివరించారు. వ్యవసాయంలో కొత్త పరిజ్ఞానం, మార్కెటింగ్ పద్ధతుల గురించి గ్రామీణ యువతకు శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ పోస్ట్ హార్వెస్టింగ్ విధానాల గురించి యువ రైతులకు తెలియజెప్పాలని సూచించారు. తరిగిపోతున్న భూ కమతాల వల్ల వ్యవసాయం లాభసాటిగా లేకపోవడంతో యువత వ్యవసాయం వైపు వెళ్లట్లేదని పేర్కొన్నారు. పాడి, పశువులు, తేనెటీగల పెంపకం వంటి వాటిని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని చెప్పారు. వ్యవసాయ, అనుబంధ రంగాలపై యువతకు పంచాయతీ స్థాయిలోనే శిక్షణ ఇవ్వాలని సూచించారు. వ్యవసాయం వైపు యువతను ఆకర్షించడం పెద్దసవాల్ అని 'ట్రస్ట్ ఫర్ అడ్వాన్స్ మెంట్ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్'చైర్మన్ ఆర్.ఎస్.పరోడా అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 'అగ్రికల్చర్ ఇన్నోవేషన్ ఫండ్'ఏర్పాటు చేయాలని పరోడా అభిప్రాయపడ్డారు. వ్యవసాయ వర్సిటీ వీసీ ప్రవీణ్‌రావు వర్క్‌షాప్ స్వాగతోపన్యాసం ఇచ్చారు. మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా వ్యవసాయరంగం మారాలని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో దక్షిణాది రాష్ట్రాల వర్సిటీల వైస్ చాన్స్‌లర్లు, ఐకార్ సంస్థల డైరెక్టర్లు, శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు, బ్యాంకు ప్రతినిధులు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, దక్షిణాది రాష్ట్రాలకు చెందిన వ్యవసాయ పట్టభద్రులు పాల్గొన్నారు.

## కమిషన్ సభ్యుల నియామకంపై రిట్

**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణ బాలల హక్కుల రక్షణ కమిషన్ సభ్యుల నియామకాలను సవాల్ చేస్తూ దాఖలైన రిట్ పిటిషన్‌ను విచారించిన హైకోర్టు ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ, విచారణను నవంబర్ 11కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.వినోద్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా కమిషన్ సభ్యుల నియామకం జరిగిందని, వీటిని రద్దు చేయాలంటూ రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్‌కు చెందిన ఎన్.నాగేశ్వరరావు, డి.రాము దాఖలు చేసిన రిట్‌ను సోమవారం హైకోర్టు విచారించింది.

## 300 కోట్లతో టెక్నాలజీ సెంటర్లు: వినోద్



**సాక్షి, హైదరాబాద్:** యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించి, వృత్తి నైపుణ్యాన్ని అభివృద్ధి చేసేందుకు రాష్ట్రంలో రూ.300 కోట్లతో టెక్నాలజీ సెంటర్లు, ఎక్స్‌టెన్షన్ సెంటర్లు నెలకొల్పేందుకు చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బి.వినోద్‌కుమార్ వెల్లడించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్‌తో పాటు ఎమర్జింగ్ టెక్నాలజీల్లో ఈ కేంద్రాల ద్వారా శిక్షణ ఇస్తామన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో జరిగిన సమావేశంలో కేంద్ర, రాష్ట్ర పరిశ్రమల శాఖ అధికారులతో వినోద్ సమీక్ష నిర్వహించారు. వరంగల్‌లో టెక్నాలజీ సెంటర్, కరీంనగర్ శివారులో ఎక్స్‌టెన్షన్ సెంటర్ ఏర్పాటుకు వెంటనే స్థల సేకరణ జరపాలని ఆయా జిల్లాల కలెక్టర్లకు సూచించారు. వీటితో పాటు సంగారెడ్డి, ఖమ్మం జిల్లాల్లోనూ ఎక్స్‌టెన్షన్ సెంటర్ల ఏర్పాటుకు వీలుగా చర్యలు తీసుకోవాలన్నారు.

## కేజీబీవీ టీచర్ల బదిలీలకు షెడ్యూల్

- రేపటి నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు
- వచ్చే నెల 4, 5 తేదీల్లో బదిలీ కోరుకునే వారికి వెబ్ ఆప్షన్లు

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలోని 475 కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయాల్లో (కేజీబీవీ) కాంట్రాక్టు పద్ధతిన పనిచేస్తున్న టీచర్లకు జిల్లా, అంతర్ జిల్లా బదిలీలు నిర్వహించేందుకు విద్యాశాఖ చర్యలు చేపట్టింది. ఈనెల 23వ తేదీ నుంచి బదిలీల (కేజీబీవీల మార్పు) ప్రక్రియను చేపట్టేందుకు సమగ్ర శిక్షా అభియాన్ (ఎస్ఎస్ఏ) షెడ్యూల్ జారీ చేసింది. కేజీబీవీల్లో పనిచేస్తున్న పీజీ సీఆర్‌టీ, సీఆర్‌టీ, ఏఎన్‌ఎం, పీఈటీలు ప్రస్తుతం పనిచేస్తున్న కేజీబీవీల నుంచి జిల్లాలోని ఇతర కేజీబీవీలకు, ఇతర జిల్లాల్లోని కేజీబీవీలకు మారాలనుకునేవారు, స్పౌస్ కేటగిరీలో మారాలనుకునే వారు ఈనెల 23 నుంచి 25వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో (samagrashiksha.telangana.gov.in) దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల విద్యా కమిషనర్, ఎస్ఎస్ఏ స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ విజయ్‌కుమార్ తెలిపారు. ఈ బదిలీలకు సంబంధించిన సమగ్ర వివరాలు, సూచనలు, మార్గదర్శకాలు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. రాష్ట్రంలోని 475 కేజీబీవీల్లో దాదాపు 7 వేల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. అందులో అనేక మంది భార్య/భర్తలకు దూరంగా ఉంటున్నారు. దీంతో ఎప్పటినుంచో బదిలీలు నిర్వహించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అయితే వారంతా కాంట్రాక్టు పద్ధతిపై పనిచేస్తున్న వారు కాబట్టి రెగ్యులర్ టీచర్ల తరహాలో బదిలీలు నిర్వహించే పరిస్థితి లేదు. దీంతో పాత కేజీబీవీల్లో వారిని తొలగించి వెబ్ ఆప్షన్ల ప్రకారం వారు కోరుకున్న కొత్త కేజీబీవీల్లో మళ్లీ కాంట్రాక్టు పద్ధతిన తీసుకునేలా ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టింది.

# ఈ 'స్కూళ్ల'లో విద్యార్థులదే 'ఫ్రీడం'



- సరికొత్త కాన్సెప్ట్‌తో వస్తున్న 'ఫ్రీడం స్కూళ్లు'
- 23 పాఠశాలల్లో ప్రయోగాత్మకంగా అమలు
- విద్యార్థుల అభీష్టాల మేరకే పాఠశాల నిర్వహణ
- బోధన, అభ్యసన, పరీక్షలు.. అన్నీ వారి ఇష్టానుసారమే
- స్కిట్స్, డిబేట్స్, క్విజ్, డ్రామా లాంటి అంశాలతోనే మార్కులు
- విజయవంతమైతే రెండేళ్లలో అన్ని ఎస్సీ గురుకులాల్లోనూ..

ఫ్రీడం స్కూల్.. అక్కడ పిల్లలకు పాఠ్యాంశ పుస్తకాలుండవు.. టీచర్లు గంటల తరబడి బ్లాకు బోర్డుపై బోధించే పద్ధతి కనిపించదు. బట్టీ పట్టే విధానం అస్సలుండదు. మరి ఇదేదో కార్పొరేట్ స్కూల్ అనుకుంటే పొరపాటే. తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ (టీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్) ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఒక గురుకుల పాఠశాల. సాధారణ పాఠశాలలకు భిన్నంగా నిర్వహించే ఈ స్కూల్‌లో విద్యార్థుల నిర్ణయాలే కీలకం. విభిన్న తరహాలో నిర్వహించే బోధన, అభ్యసన కార్యక్రమాలన్నీ విద్యార్థులే చూసుకుంటారు. అలాగని అక్కడ టీచర్లు ఉండరనుకుంటే పొరపాటే. విద్యార్థులను అనుక్షణం నిశితంగా పరిశీలిస్తూనే ఉంటారు. సాధారణ పాఠశాలలో నడిచే మూస పద్ధతికి భిన్నంగా ఇక్కడ కార్యక్రమాలుంటాయి. విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించడం, విషయ పరిజ్ఞానాన్ని లోతుగా తెలుసుకునేలా చేయడం, సబ్జెక్టుపై పట్టు సాధించేందుకు ఎస్సీ గురుకుల సొసైటీ తీసుకొచ్చిన సరికొత్త కాన్సెప్ట్ ఇది.

**సాక్షి, హైదరాబాద్:** విద్యార్థులపై ఒత్తిడి లేని విధంగా బోధన, అభ్యసన సాగాలనే లక్ష్యంతో ఎస్సీ గురుకుల సొసైటీ సరికొత్తగా 'ఫ్రీడం స్కూల్'విధానాన్ని తీసుకొచ్చింది. గురుకులం నిర్వహణంతా సొసైటీ ఆధ్వర్యంలోనే సాగినప్పటికీ... ఇక్కడ నిర్వాహకులు, బోధకులు, పరీక్షల విధానం, కార్యాచరణ అంతా విద్యార్థుల అభీష్టం మేరకే నడుస్తుంది. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేయడమే ఉపాధ్యాయుల పని. మిగతా కార్యక్రమాలన్నీ విద్యార్థుల ఆలోచనలు, సూచనల మేరకే నడుస్తాయి. పాశ్చాత్య దేశాల్లో ఇప్పటికే అమల్లో ఉన్న ఈ విధానంపై పూర్తిగా అధ్యయనం చేసిన ఎస్సీ గురుకుల సొసైటీ.. రాష్ట్రంలో 23 గురుకుల పాఠశాలల్లో 6, 7, 8, 9 తరగతుల్లో ప్రయోగాత్మకంగా అమలు చేస్తోంది. ఈ విధానం విజయవంతమైతే అన్ని గురుకుల పాఠశాలల్లో అమలు చేయాలని సొసైటీ భావిస్తోంది.

**పెన్ను, పేపర్ లేని పరీక్షలు**

సాధారణంగా బడికి వేళ్లే పిల్లలకు పాఠ్యాంశ పుస్తకాలుంటాయి. వీటి ప్రకారం నిర్దేశించిన తేదీల్లో బోధన చేపడతారు. ఆమేరకు అభ్యసన పూర్తి చేసిన విద్యార్థులకు నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం పరీక్షలు నిర్వహించి, అనంతరం ఫలితాలు ప్రకటిస్తారు. కానీ ఫ్రీడం స్కూల్ విధానంలో ఈ పద్ధతులేవీ కనిపించవు. ఒక్కో క్లాస్ 90 నిమిషాల పాటు ఉంటుంది. ప్రతిరోజూ 4 పీరియడ్లు మాత్రమే ఉంటాయి. ప్రతి తరగతిలో 40 మంది విద్యార్థులుంటారు. ప్రతి నలుగురు విద్యార్థులతో ఒక బృందం చొప్పున క్లాస్‌రూములో 10 బృందాలుంటాయి. ప్రతి బృందానికి ఒక లీడర్ ఉంటారు. విద్యార్థులకు పాఠ్య పుస్తకాలకు బదులుగా మాడ్యూల్స్ ఉంటాయి. వీటిలోని అంశాలపై విద్యార్థులే పరస్పరం వేర్వేరుగా, బృందంగా చర్చలు జరపడం, లోతుగా పరిశోధించడం లాంటివి చేస్తారు. ప్రతి మాడ్యూల్‌లో అంశం, దాని తాలూకూ చరిత్ర ఉంటుంది. వీటిపై గ్రూప్ డిస్కర్షన్స్‌తో పాటు మాడ్యూల్‌లోని అంశాలపై స్కిట్లు రూపొందించడం, డిబేట్, క్విజ్ ఏర్పాటు చేయడం లాంటివి చేస్తారు. దీంతో ప్రతి అంశంపై విద్యార్థులకు లోతైన జ్ఞానం వస్తుంది. ఇక్కడి విద్యార్థులకు సాధారణ స్కూల్‌లో నిర్వహించే పరీక్షలుండవు. ఇక్కడ జరిగే పరీక్షల్లో విద్యార్థులు పెన్ను, పేపర్లను వినియోగించరు. స్కిట్స్, డిబేట్స్, క్విజ్, డ్రామా లాంటి అంశాలతోనే వారికి మార్కులు పడతాయి. బోధన, అభ్యసన అంశాలు, పరీక్షల నిర్వహణకు విద్యార్థుల ఆమోదం తప్పనిసరి. తరగతి గదిలో మెజార్టీ విద్యార్థుల అభిప్రాయం మేరకు ఆరోజు కార్యక్రమాలు సాగుతాయి.

### ఈ స్కూళ్లు ఎక్కడెక్కడంటే..

రాష్ట్రవ్యాప్తంగా 23 గురుకుల పాఠశాలలను ఫ్రీడం స్కూల్ పద్ధతిలో నిర్వహిస్తున్నారు. బోథ్, బెల్లంపల్లి, మంచిర్యాల, హయత్‌నగర్, సరూర్‌నగర్, కొందుర్గు, శంషాబాద్, ఆర్కేపురం, చేవెళ్ల, నార్సింగి, షేక్‌పేట్, చొప్పదండి, తిరుమలాయపాలెం, వెల్దండ, గద్వాల్, ఆర్.ఆర్.గూడెం, సిద్దిపేట్ రూరల్, ములుగు, చండూరు, వేల్పూర్, వరంగల్ ఈస్ట్, అడ్డగూడూరు, చౌటుప్పల్ గురుకుల పాఠశాలల్లో ఈ విధానాన్ని అమలు చేస్తున్నారు. ఈ పాఠశాలల నిర్వహణపై ప్రతి నెలా సమీక్ష నిర్వహిస్తున్న సొసైటీ క్రమక్రమంగా వాటిని మెరుగుపర్చేందు కు సరికొత్త కార్యాచరణ ప్రణాళికలు త యారు చేస్తున్నారు.


**P.V.NARSIMHA RAO TELANGANA VETERINARY UNIVERSITY**
Administrative Office, Rajendranagar, Hyderabad - 500 030

**PG ADMISSION NOTIFICATION**

NO.2/Exams/PVNRTVU/2019, Dt.21.10.2019

Applications are invited from the eligible candidates for admission into the Master's and Doctoral Degree programmes in Faculty of Veterinary Science in **PV Narsimha Rao Telangana Veterinary University, Rajendranagar, Hyderabad** for the Academic Year 2019-20.

Filled in applications are to be sent to The Registrar, PVNR Telangana Veterinary University, Administrative Office, Rajendranagar, Hyderabad - 500 030 **on or before 05.11.2019, 4.00 PM.**

For application and other infomation please visit University Website : http://tsvu.nic.in.

Y.NARASIMHA REDDY,
REGISTRAR(FAC)





**Honda Motorcycle and Scooter India Pvt. Ltd., Registered Office:** Commercial Complex II, Sector - 49-50, Golf Course Extension Road, Gurugram - 122018 (Haryana), India; **Website:** www.honda2wheelersindia.com; **Customer Care:** customercare@honda2wheelersindia.com

**Honda Exclusive Authorized Dealerships: NALGONDA:** Sri Vigneshwara Honda - 9290143623, 9290053788; Kushal Honda - 08682-248822/33, 9160644472/73/74; **MIRYALGUDA:** Mereddy Honda - 9618688155, 08689230666/7; **KODAD:** GHR Honda - 8143121988; **HUZURNAGAR:** Mereddy Honda - 8683242888, 9618002354; **SURYAPET:** Sri Vigneshwara Honda - 8885312455, 8179181884; **DEVARAKONDA:** Sri Honda - 8688111770, 08691-252225; **HALIA:** Mereddy Honda - 9618688166, 08680278822; **BHONGIR:** Kushal Honda - 08685-243555, 9154308152; **MOTHKUR:** Kushal Honda - 08694-287999, 9949939988; **THIRUMALGIRI:** Saraswathi Honda - 08693-243243 9505243243; **BIBINAGAR:** Kakateeya Honda - 9949588911, 9121886912; **CHITIYAL:** Sri Laxmi Narasimha - 9948138583, 9948537805; **ALER:** Kushal Honda - 9951208888; **CHOUTUPPAL:** Kushal Honda - 7330869678.

**For Bulk/Institutional enquiries, please write us at: institutionalsales@honda2wheelersindia.com**

సాక్షి
మంగళవారం, అక్టోబర్, 22

# అభిజిత్ 'నోబెల్' వెలుగు నీడలు

## పాక్‌కు గట్టి జవాబు

నియంత్రణ రేఖ(ఎల్‌ఓసీ)లో ఎప్పటిలాగే తుపాకులు గర్జించాయి. కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి పాకిస్తాన్ శనివారం జరిపిన కాల్పుల్లో ఇద్దరు భారత సైనికులు మరణించాక మన సైన్యం అటువైపున్న నాలుగు ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేసిందని, దాదాపు 20మంది ఉగ్రవాదులను, 10మంది పాక్ సైనికులను మట్టుబెట్టిందని సైనిక దళాల ప్రధానాధికారి బీపీ రావత్ ప్రకటించారు. ఆగస్టు 5న జమ్మూ–కశ్మీర్‌ను రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించి, 370వ అధికరణను రద్దు చేశాక పాకిస్తాన్ వైపు నుంచి తీవ్ర పదజాలంతో ప్రకటనలు వెలువడటం అందరూ చూస్తున్నదే. వీటికితోడు గత నెలాఖరున ఐక్యరాజ్యసమితి వేదికపై నుంచి పాకిస్తాన్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ చేసిన ప్రకటన మరింత తీవ్రంగా ఉంది. కశ్మీర్‌లో నెత్తురుటేర్లు పారతాయంటూ ఆయన హెచ్చరించారు. అప్పటినుంచీ సరిహద్దుల్లో మన సైన్యం మరింత అప్రమత్తంగా ఉంటున్నది. ఉగ్రవాదులను ప్రవేశపెట్టి భారీయెత్తున విధ్వంసం సృష్టించాలని పాక్ పథకరచన చేస్తున్నట్టు ఈమధ్యకాలంలో తరచుగా కథనాలు వెలువడుతున్నాయి. చివరకు శనివారం నాటి ఘటన ఆ కథనాల్లో నిజం ఉన్నదని రుజువు చేసింది.


2003లో కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిందన్న మాటేగానీ ఎల్‌ఓసీ ఎప్పుడూ ప్రశాంతంగా లేదు. ఆ ప్రాంతంలో ఘర్షణలను క్రమేపీ పెంచి ఇరు దేశాల మధ్యా దాన్నొక ప్రధాన సమస్యగా మార్చి రాజకీయంగా లేదా సైనికంగా లాభపడదామన్న పాక్ ఉద్దేశం తరచు కనబడుతూనే ఉంది. 2016 డిసెంబర్ వరకూ కనీసం రెండు దేశాల జాతీయ భద్రతా సలహాదార్లు మాట్లాడుకున్న సందర్భాలైనా ఉన్నాయి. బ్యాంకాక్‌లో ఆ ఏడాది డిసెంబర్‌లో వారిద్దరూ ఆఖరుసారి మాట్లాడుకున్నారు. అటుతర్వాత 2018 జనవరిలో కూడా ఇద్దరి సమావేశం జరిగిందన్న కథనాలొచ్చినా మన దేశం ఖండించింది. ఇరుదేశాల మిలిటరీ ఆపరేషన్స్ డైరెక్టర్ జనరళ్ల (డీజీఎంఓ)మధ్య చర్చలు అంతకు మూడేళ్లక్రితమే ఆగిపోయాయి. వీటి పర్యవసానాలు ఎంత తీవ్రంగా ఉంటాయో అనంతరకాలంలో జరిగిన ఉదంతాలను చూస్తే అర్థమవుతుంది. 2016లో 228 కాల్పుల విరమణ ఉదంతాలు చోటుచేసుకుంటే ఆ మరుసటి ఏడాది అవి 860కి పెరిగాయి. ఆ ఏడాది ఎన్నడూలేనంత స్థాయిలో నెత్తురోడింది. మన సైన్యం 138మంది పాక్ సైనికుల్ని కాల్చిచంపగా, పాక్ కాల్పుల్లో మన సైనికులు 28మంది ప్రాణాలు కోల్పోయారు. నిరుడు మొత్తం 1,629 ఉదంతాలు జరగ్గా...ఈ ఏడాది ఇంతవరకూ అవి 2,318కి చేరాయి. ఇరుగుపొరుగు దేశాల మధ్య సమస్యలున్నప్పుడు సరిహద్దులు ప్రశాంతంగా ఉండవు. కనుకనే రెండు దేశాలూ కాల్పుల విరమణ ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. ఇది జరిగాక తమవైపు నుంచి ఎలాంటి కవ్వింపు చర్యలూ లేకుండా చూసుకుందామని పాకిస్తాన్ ఎప్పుడూ అనుకోలేదు. పైపెచ్చు దాన్ని అడ్డుపెట్టుకుని ఉగ్రవాదుల్ని సరిహద్దులు దాటిద్దామని ఎప్పటికప్పుడు అది ప్రయత్నిస్తూనే ఉంది. మన సైనికులే లక్ష్యంగా ఉగ్రవాదులు గత మూడేళ్లుగా జరిపిన దాడులన్నీ పాక్ సైన్యం వారిని సరిహద్దులు దాటించిన పర్యవసానమే. 2016 జనవరిలో పంజాబ్‌లోని పఠాన్‌కోట్ వైమానిక స్థావరంపై దాడి జరిపి ఏడుగురు భద్రతా సిబ్బందిని బలి తీసుకోవడం, అదే ఏడాది ఉడి సైనిక స్థావరంపై దాడి చేసి 18మంది జవాన్ల ప్రాణాలు తీయడం, ఈ ఏడాది ఫిబ్రవరిలో పుల్వామాలో ఆత్మాహుతి దాడి జరిపి 40 జవాన్లను పొట్టనబెట్టుకోవడం వంటి ఉగ్రవాద ఘటనలన్నీ పాక్ సైన్యం అండదండలతో సాగినవే. గత నెలలో మొత్తం 28మంది ఉగ్రవాదుల్ని మన దేశంలోకి ప్రవేశపెట్టడానికి ప్రయత్నించగా 16మందిని నిలువరించగలిగామని, 12మంది మాత్రం సరిహద్దులు దాటారని ఈ నెల మొదట్లో నిఘా విభాగం ప్రకటించింది. అంతర్జాతీయ వేదికపై నుంచి కశ్మీర్‌లో నెత్తురుటేర్లు పారతాయని ఇమ్రాన్ ఖాన్ హెచ్చరికలోని అంతరార్థాన్ని మన దేశం సులభంగానే గ్రహించగలిగింది. సరిహద్దుల్లో అప్రమత్తతను మరింత పెంచింది. ఈ ఉల్లంఘనల సమయంలో పాక్ సైనికులు తరచుగా పౌర ప్రాంతాలపై కూడా గురిపెడుతున్నారు. గత నెల 14న పాక్ సైన్యం బాలాకోట్, సందోత్ సెక్టార్లలో పాఠశాలలపై తుపాకులు ఎక్కుపెట్టడం వల్ల విద్యార్థుల్ని సురక్షిత ప్రాంతాలకు తరలించవలసి వచ్చింది. ఈ నెల 1న ఇరు దేశాల బ్రిగేడియర్ స్థాయి అధికారులు మాట్లాడుకున్నప్పుడు ఈ ఉదంతాన్ని మన దేశం ప్రత్యేకించి ప్రస్తావించింది.

కాల్పుల విరమణ ఒప్పందం ఉల్లంఘనలకూ, ఉగ్రవాదుల చొరబాటుకూ మధ్య సంబంధమేమిటో ఈ ఘటనలన్నీ వెల్లడిస్తున్నాయి. ఇది దీర్ఘకాలం కొనసాగితే ఘర్షణలు అధీన రేఖకే పరిమితమవుతాయని చెప్పలేం. తాజా ఉదంతమే అందుకు ఉదాహరణ. పాక్ సైన్యం కవ్వింపు చర్యలకు పాల్పడగానే మన సైనికులు కేవలం వాటికి జవాబివ్వడంతో సరిపెట్టలేదు. పాక్ సైనిక పోస్టులపై దాడి చేయడమే కాదు... ఆక్రమిత కశ్మీర్‌లో ఉన్న మూడు ఉగ్ర శిబిరాలను నేలమట్టం చేయడంతోపాటు, మరో ఉగ్ర శిబిరాన్ని పాక్షికంగా ధ్వంసం చేశారు. కనుక తన ప్రయత్నాల్లోని నిరర్థకతను మాత్రమే కాదు... పర్యవసానాల తీవ్రతను పాక్ గుర్తించడం అవసరం. ఒకపక్క ఉగ్రవాదులకు ఆర్థికంగా అండదండలందిస్తున్నందుకు పాకిస్తాన్‌కు అంతర్జాతీయంగా చీవాట్లు పడుతున్నాయి. ఈ ధోరణి మార్చుకోనట్టయితే పాకిస్తాన్‌ను బ్లాక్‌లిస్టులో పెడతామని ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్‌ఫోర్స్ రెండు నెలల క్రితమే పాక్‌ను హెచ్చరించింది. మొన్నీమధ్యే జరిగిన సమావేశంలో పాకిస్తాన్‌కు మరో నాలుగు నెలలు...అంటే వచ్చే ఫిబ్రవరి వరకూ గడువు విధించాలని నిర్ణయించింది. మొత్తం 27 అంశాల్లో సరిదిద్దుకోవాలని సూచించగా కేవలం అయిదింట్లో మాత్రమే పాక్ చర్యలు తీసుకుందని తెలిపింది. ధోరణి మారనట్లయితే మరికొన్నాళ్లకైనా అంతర్జాతీయంగా తాను ఏకాకి కాక తప్పదని పాకిస్తాన్ ఇప్పటికైనా గ్రహిస్తే మేలు.

### గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు ఆశ్వయుజ మాసం, తిథి బ.నవమి రా.11.17 వరకు, తదుపరి దశమి, నక్షత్రం పుష్యమి ప.1.36 వరకు, తదుపరి ఆశ్లేష, వర్జ్యం రా.1.42, నుంచి 3.12 వరకు, దుర్ముహూర్తం ఉ.8.15 నుంచి 9.02 వరకు, తదుపరి రా.10.31 నుంచి 11.19 వరకు అమృతఘడియలు... ఉ.10.45 నుంచి 12.16 వరకు.

**సూర్యోదయం :** 5.58
**సూర్యాస్తమయం:** 5.32
**రాహుకాలం :** ప. 3.00 నుంచి 4.30 వరకు
**యమగండం :** ఉ.9.00 నుంచి 10.30 వరకు



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

*"దేశాల అభివృద్ధికి దోహదం చేయగల ప్రయోగాల ద్వారా ఆర్థిక శాస్త్రంలో నూతన ఆవిష్కరణలు చేసి ప్రపంచ వ్యాప్తంగా దారిద్ర్య బాధల్లో ఉన్న ప్రజా బాహుళ్యానికి విముక్తి కలిగించే ప్రయోగాలు చేసినందుకు ఆర్థికవేత్తలు అభిజిత్ బెనర్జీ, ఆయన సతీమణి ఈస్తర్ డఫ్లో, మైఖేల్ క్రీమర్‌లు నోబెల్ బహుమతికి సంయుక్తంగా అర్హులయ్యారు"*

*– నోబెల్ కమిటీ ప్రకటన (14–10–2019)*

అయితే "దారిద్ర్య కారణాలను సునిశితమైన దృష్టికోణం నుంచి అందుకు దారితీసిన లేదా కారకులైన శక్తులు లేదా పాలకులు అనుసరించిన మార్గాలను మరింత నిశితంగా విమర్శనాత్మకంగా పరిశీలించాలి. ప్రజల ఆర్థిక స్థితిగతుల పరిశీలనలో మచ్చుకు జరిపే కొన్ని నియంత్రిత ప్రయోగాలను కూడా ఈ శక్తులు బరితెగించి ఉల్లంఘిస్తాయి."


*– ప్రసిద్ధ ఆర్థిక వేత్తలు ఫర్వాసియాల్, కరోలినా ఆల్వెస్*

అధికారం లేని ప్రజ్ఞ ఓంకారం లేని మంత్రం లాంటిదన్నది ఓ సామెత. ప్రజల దారిద్ర్య నిర్మూలనకు సామాజిక రాజకీయ పాలనా వ్యవస్థ మూలాల్లోకి వెళ్లి తరచి చూడకుండా పరిష్కారం కోసం మార్గాన్వేషణ చేయడం అర్ధసత్యంగానే మిగిలిపోతుంది. అభిజిత్ బెనర్జీ త్రయానికి, నోబెల్ కమిటీ అత్యున్నత పురస్కారం ఇవ్వడాన్ని దృష్టిలో పెట్టుకుని మరొక ప్రసిద్ధుడు రోహన్ వెంకట్రావు కృష్ణన్ ఒక సహేతుకమైన ప్రశ్న వేశారు– దేశాభివృద్ధికి సంబంధించిన విధానాలను, మానవ నైజాన్నీ, రోగికి వాడే మందుల మంచి చెడులను పరీక్షించి నిగ్గు తేల్చినట్లుగా కొలవగలమా అని? ఇందుకు సమాధానమా అన్నట్లు నోబెల్ కమిటీ "ప్రపంచ వ్యాపిత దారిద్ర్య నిర్మూలనకు జరిగే పోరాటంలో మన శక్తియుక్తులను పెంచడానికి ఈ ఏడాది బహుమాన గ్రహీతలు ఆర్థిక శాస్త్రంలో జరిపిన పరిశోధనలు తోడ్పడతాయి. ఆర్థికాభివృద్ధి పరివర్తన వైపుగా ఆర్థికవ్యవస్థల్ని మల్చడానికి కేవలం గత రెండు దశాబ్దాల్లోనే అభిజిత్ ప్రభృతుల నూతన ప్రయోగాలు తోడ్పడ్డాయి. ఇకనుంచి ఈ ప్రయోగ పరిశోధనా పద్ధతులు అభివృద్ధికి దోహదకారి కాగల అర్థశాస్త్రాన్ని శాసించనున్నాయి" అని జోస్యం చెబుతోంది. ఆశాభావం మంచిదే కానీ, ప్రస్తుతమున్న సామాజిక దోపిడీ వ్యవస్థా చట్రాన్ని, అందుకు పనిగట్టుకుని చేదోడువాదోడుగా ఉంటున్న రాజకీయ, ఆర్థిక పాలనా వ్యవస్థను, పద్ధతుల్ని సమూలంగా మార్చకుండా ఆర్థిక స్థితిగతుల మంచి చెడుల గురించి మచ్చుకు (రాండమైజ్డ్ కంట్రోల్డ్ ట్రయల్స్) జరిపే తాత్కాలిక ప్రయోగాల వల్ల అంతగా ప్రయోజనం లేకపోవచ్చు. బహుశా నోబెల్ పురస్కారం అందుకోకముందు, భారత ఆర్థిక వ్యవస్థ ప్రస్తుత పాలకుల ఆధ్వర్యంలో గాడితప్పి పోతోందని అభిజిత్ భావించినట్లు కనపించినా అందుకు గల పెట్టుబడి వ్యవస్థాగత మూలాల గురించి ఎక్కడా ప్రస్తావించినట్టు కన్పించదు.

### తాత్కాలిక 'లేపనాలు' పరిష్కారం కావు

అసలు ప్రస్తుతం దేశంలో పెట్టుబడిదారీ వ్యవస్థ దోపిడీ చట్రంలో బందీగా ఉన్న వాస్తవాన్ని గుర్తించి, దాన్ని బహిర్గతం చేయకుండా ప్రస్తుత పాలక వర్గం కార్పొరేట్ మోతుబరులపై తగ్గించిన పన్నుల మొత్తాల్ని గాంధీ గ్రామీణ ఉపాధి పథకానికి, ప్రధానమంత్రి కిసాన్ పథకానికి మళ్లించాలని అభిజిత్ ప్రభృతులు (2.10.2019) సూచించడం మెచ్చుకోదగిన ప్రతిపాదన. అయితే అంతమాత్రాన పెట్టుబడిదారీ వ్యవస్థ మూలాల్లో పేరుకున్న దోపిడీ లక్షణమనే 'పుండు' తొలగిపోదని గ్రహించాలి. ఎప్పటికప్పుడు పాలకులు గడిచిన ఐదేళ్లలో స్వయంకృత ఆర్థిక సంక్షోభం నుంచి దేశాన్ని బయటపడవేయడంలో ఘోరంగా విఫలమై, రానున్న ఐదేళ్లలో దేశంలో రూ. 375 లక్షల కోట్ల ఆర్థిక వ్యవస్థను నిర్మిస్తామని 'ఉత్తరకుమార ప్రజ్ఞలు' పలుకుతూ... ఉన్న ఉద్యోగాలకు ఎసరుపెడుతూ, గ్రామీణ, మధ్యతరగతి, పారిశ్రామిక, వ్యావసాయక రంగాలలో సర్వవ్యాపిత

**రెండో మాట**



సంక్షోభాన్ని ఆవిష్కరించి కూర్చున్నారు. బహుశా అందుకే అభిజిత్ ప్రభృతులు మూలాలకు వెళ్లకుండా కునారిల్లుతున్న దేశ ఆర్థిక వ్యవస్థకు తాత్కాలిక 'లేపనాలు' (చికిత్సలు) అద్దడానికి ప్రయత్నిస్తున్నారు. అన్నీ పండించే రైతుకు అన్నం కరువు, అయినా 'సున్నం' తిని బతకమంటూ వ్యవస్థ మిగిలిన 'మూలుగ'లను కూడా పాలకులు పిండేస్తున్నారు. బ్యాంకింగ్, సహకార సంస్థలు, పరపతి సంస్థలు ఒక్కటొక్కటిగా మూలపడుతున్నాయి. దేశ ఆర్థిక వ్యవస్థ మూలాలన్నీ దేశ సాంస్కృతిక, చారిత్రిక, సామాజిక, రాజకీయ, ఆర్థిక, తాత్విక రంగాల పునాదులపై ఆధారపడి ఉంటాయి. వీటన్నింటినీ కూలంకషంగా మథించిన తరువాతనే మానవజాతి ఉత్థాన పతనాల గురించి శాస్త్రీయ సోషలిజం సిద్ధాంతాన్ని రూపొందించిన ఏకైక దార్శనికుడు కారల్‌మార్క్స్.. తత్వశాస్త్రజ్ఞులు ప్రపంచానికి భాష్యం చెబుతూ వచ్చారు. కానీ ఇకనుంచి మనం ప్రపంచ పరిణామాన్ని విలువైన మలుపు తిప్పాలన్నాడు.

### టెక్నాలజీ ముసుగులో సరికొత్త దోపిడీ

కనుకనే భారతదేశంలో అమెరికా రాయబారిగా పనిచేసిన గాల్‌బ్రెయిత్, సోవియెట్ యూనియన్‌లో పాలకుల వికృత విధానాల మూలంగా సోషలిజం వ్యవస్థకు చేటు మూడినప్పుడు దాన్ని మార్క్సిజం పతనంగా ప్రపంచ పెట్టుబడిదారీ వర్గమూ, వారి నాయకులూ పట్టలేని ఆనందంతో ప్రకటనలు గుప్పిస్తున్నప్పుడు ఇలా వ్యాఖ్యానించారు: "సోషలిజానికి ఒకచోట ఎన్ని అవాంతరాలొచ్చినా, మార్క్స్ మార్క్సిజం మాత్రం జగజ్జేగీయమానంగా ప్రపంచం ఉన్నంతవరకూ వెలుగొందుతూనే ఉంటుందన్నాడు. దోపిడీ దౌర్జన్యాలపై ఆధారపడి మనుగడ సాగించగోరే పెట్టుబడి వ్యవస్థ మనుగడ నిరంతరం సైన్స్, టెక్నాలజీల వృద్ధిమీద ఆధారపడి కొనసాగించాలనుకుంటుంది. కానీ దాని దోపిడీ స్వరూపాన్ని విడనాడకుండానే దోపిడీని టెక్నాలజీ ముసుగులో కొనసాగించడానికి ప్రయత్నిస్తుంది. కనుకనే ప్రపంచవ్యాపితంగా అన్ని ఖండాలలోని బడుగు, బలహీన వర్ధమాన దేశాలను అప్పుల కుంపటిలోకి నెట్టి నిరంతర రుణాలలో మగ్గిపోయేటట్టు చేస్తూ తన ఉనికిని కాపాడుకుంటోంది. ఇందుకు టెక్నాలజీలో ప్రవేశపెట్టిన డిజిటల్ యుగం మరింత రాక్షస రూపంలో ఇళ్లల్లోకే కాదు, పడక గదుల్లోకి కూడా దూరి తిష్టవేసి, పౌర సామాజికుల గోప్యతకు రక్షణలేని దుస్థితిని ఆవిష్కరిస్తోంది. 'ఆధునికత' పేరిట సాగే ఈ వికృత ఆవిష్కరణలన్నీ పాత, కొత్త వలస సామ్రాజ్యాలు, వాటిపై ఆధారపడి మనుగడ సాగించజూస్తున్న కొన్ని వర్ధమాన నయా పెట్టుబడిదారీ వ్యవస్థలు, పాలకులు తమ మనుగడను మరికొన్నాళ్లు పొడిగించుకోవడానికి తోడ్పడుతున్నాయి.

### అభిజిత్ అభ్యుదయ కోణం పరిమితమే!

ఈ దశలో అభిజిత్ ప్రభృతులు నోబెల్ గ్రహీతలయినందుకు సంతోషిద్దాం. కానీ అభిజిత్ బెనర్జీలోని పరిమిత అభ్యుదయ కోణాన్ని హర్షిస్తూనే, కొద్దికాలం క్రితం ఆయనలో తొంగిచూసిన అభ్యుదయ వ్యతిరేక సామాజిక దృక్పథాన్ని కూడా ఖండించకుండా ఉండలేం. మహిళలపట్ల అభిజిత్ దృక్పథాన్ని, రేప్, సెక్స్ (లైంగిక, అత్యాచార సమస్యలపైన) విషయాలపై వెలిబుచ్చిన విస్మయకరమైన అభిప్రాయాలపైన 'ఫ్రీప్రెస్ జర్నల్' (16.10.2019) ఒక వ్యాసం ప్రచురించింది. దేశంలో పెరిగిపోతున్న సెక్స్, రేప్‌లకు కారణం స్త్రీ–పురుషుల మధ్య కలివిడిగా జరిపే సంభాషణలే కారణమన్నది అభిజిత్ అభిప్రాయం. లైంగిక వ్యవహారాల్లో అసమానతలను సమాజం ఎలా తొలగించగలదో చూడాలని అభిజిత్ ఆ జర్నల్‌లో పేర్కొన్నందుకు 'గబ్బు' లేచింది. సెక్స్ కోర్కెలు తీర్చుకోవడంలో స్త్రీ పురుషుల మధ్య అసమానతలుండకూడదన్నది ఆయన అభిప్రాయంలా ఉంది. ఏది ఏమైనా, ఇలాంటి భావాలన్నీ బుద్ధి జాడ్యజనితోన్మాదం కిందకు, పెడదారి కిందికి వస్తాయి. అయితే సమాజ దోపిడీపై ఆధారపడి బతుకుతున్న పెట్టుబడిదారీ వ్యవస్థలో వ్యక్తుల ఆలోచనా సరళిలో ఈ పెడదారులు సహజమై ఉండాలి. ఎందుకంటే, ఒకవైపున దారిద్ర్య బాధనుంచి సామాన్య ప్రజా బాహుళ్యాన్ని తప్పించేందుకు ఆర్థిక శాస్త్రంలో నూతన ప్రయోగాలకు, ఆవిష్కరణలకు నడుం కట్టిన అభిజిత్ ప్రస్తుత విద్యా విధానంలో పిల్లల సంఖ్యకు తగినట్టుగా ఉపాధ్యాయుల సంఖ్యను పెంచాలని కాకుండా కాంట్రాక్టు పద్ధతిపై ఉపాధ్యాయుల రిక్రూట్‌మెంట్ ఉండాలని ప్రతిపాదించడం విద్యా బోధనా క్రమంలో ఎలాంటి అస్తవ్యస్థ స్థితికి కారణమవుతుందో బోధపడటం లేదు. శాశ్వత ప్రాతిపదికపై ఉపాధ్యాయుల నియామకాలకన్నా కాంట్రాక్టు పద్ధతిపై టీచర్లను నియమించడమే మేలన్నది అభిజిత్ భావన.

### నూతన ప్రయోగాలకు మౌలిక 'బీజం' ఎక్కడ?

ఇంతకూ అభిజిత్ ప్రభృతులకు, తాము పేదరిక నిర్మూలనకు గాను ఉద్దేశిస్తున్న ఆర్థిక శాస్త్రంలో ఆవిష్కరించిన 'నూతన ప్రయోగాల'కు మౌలికమైన ఆలోచనా బీజం ఎక్కడనుంచి మొలకెత్తాలో తెలిసి ఉండాలి. ఆ మౌలిక వాస్తవాన్ని 19వ శతాబ్దిలోనే దోపిడీ సమాజంలో బతుకుతున్న ఇంగ్లండ్ శ్రమజీవులైన ప్రజలకు షెల్లీ మహాకవి ఇచ్చిన సందేశ కవితలో ఇలా ఆవిష్కరించారు:

*"పంట విత్తనం చల్లేది నీవు, కోసుకెళ్లేది వాడు!*
*సంపద సృష్టించేది నీవు, అప్పనంగా అనుభవించేది వాడు!*
*అందమైన బట్టల సృష్టి నీవు, వాటిని ధరించేది వాడు!*
*ఆయుధాలు తయారు చేసేది నీవు, వాటిని*
*నీమీదికే ఉపయోగించేది వాడు!*
*విత్తనం చల్లు– కానీ ఏ నిరంకుశుడూ అనుభవించకుండా చూడు!*
*సంపదను సృష్టించు– కానీ మరెవడో వచ్చి అనుభవించకుండా చూడు!*
*బట్టలు తయారుచేయి– కానీ సోమరిపోతుకు దక్కకుండా చూడు!*
*ఆయుధాలు తయారు చేయి– కానీ వాటిని నీ రక్షణ కోసమే వాడుకో!"*

అర్థశాస్త్రంలో నూతన ఆవిష్కరణలు అలాంటి మహోదయానికి దారితీయగలగాలి. ఎండమావుల్ని తొలగించగలగాలి.

abkprasad2006@yahoo.co.in

---

**సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!**



## సోషల్ మీడియా

### దీపావళి



"కశ్మీర్‌లోని సోదరసోదరీమణులకు మద్దతుగా ఈ సంవత్సరం నేను దీపావళి పండుగ జరుపుకోకూడదని నిర్ణయించుకున్నా. తమ కుటుంబ సభ్యులు ఎక్కడున్నారో కూడా కనీసం తెలుసుకోలేని స్థితిలో అక్కడి కుటుంబాలు ఉన్నప్పుడు నేను నా కుటుంబ సభ్యులతో కలిసి దీపావళి జరుపుకోలేను"
– భవికా కపూర్, గాయని

### ఆశ్చర్యం



"దేశంలో ఎన్నికలు జరిగినప్పుడల్లా పాకిస్తాన్ సైన్యం సరిహద్దుల్లో చొరబాట్లకు, కాల్పులకు పాల్పడుతుంది. ఎందుకో ఆశ్చర్యం వేస్తుంది"
– సుమంత్ రామన్, యాంకర్

### పెళ్లి



"పెళ్లితో మనిషి జీవితంలోకి సంతోషం, కన్నీళ్లు, మసాలా, అనుభూతి, రుచి మొదలైనవన్నీ వస్తాయని కొందరు చెబుతారు. కానీ, పెళ్లికంటే పానీపూరీ అతి తక్కువ ఖరీదులో అంతకంటే ఎక్కువగా పనిచేస్తుందని నేను వ్యక్తిగతంగా నమ్ముతా"
– హర్ష గోయెంకా, వ్యాపారవేత్త

### అంచనా



"ఇండియా టు డే మినహా అందరూ భారతీయ జనతా పార్టీకి మహారాష్ట్రలో 2/3 ఆధిక్యం లభిస్తుందని అంచనా వేస్తున్నారు. హరియాణాలో మాత్రం బీజేపీ 3/4 ఆధిక్యం లభిస్తుందని అందరూ అంటున్నారు'
– ఆదిత్య మీనన్, జర్నలిస్ట్

### దుఃఖం



"ప్రపంచంలో ఎక్కడైనా దుఃఖంలో ఉన్న కుటుంబాలను ఎవరైనా వెళ్లి పరామర్శిస్తారు. కానీ, ఉత్తరప్రదేశ్‌లో దుఃఖంలో ఉన్న కుటుంబ సభ్యులను తన నివాసానికి రావల్సిందిగా ముఖ్యమంత్రి యోగి ఆదిత్యానాథ్ ఆదేశించారు. ఇదేం పరిహాసం, నిజంగా విషాదకరం"
– ఆదిత్య రాజ్ కౌల్, జర్నలిస్ట్

### ట్రెండ్



"ప్రతిరోజూ ఇస్లామ్ ఫోబిక్ హ్యాష్ ట్యాగ్ ట్రెండ్ కావడం ట్విట్టర్ లో కనిపిస్తోంది. ఇదేదో పొరపాటున జరిగేది కాదు. ఇదంతా బీజేపీ పథకం. ఒకవైపు ఆర్థిక వ్యవస్థ పతనమవుతుంటే వాళ్లు ద్వేషాన్ని ప్రేరేపిస్తున్నారు. అందుకనే ద్వేషంతో రగిలిపోయే ప్రతి ఒక్క ద్వేషపూరిత చీర్ లీడర్‌పై చట్టపరంగా పగసాధిస్తా"
– సాకేత్ గోఖలే, సామాజిక కార్యకర్త

### శ్రీరంగ నీతులు



"దేశంలోనే అత్యంత అసమర్థ ఆర్థిక మంత్రిగా యనమల గారు రికార్డులకెక్కారు. అధిక వడ్డీ ఆశ చూపి దొరికిన చోటల్లా అప్పు చేసి బోర్డు తిప్పేసే ఫైనాన్స్ కంపెనీ కంటే దారుణంగా ఆర్థిక నిర్వహణ సాగింది ఆయన హయాంలో. అధికారం కోల్పోయాక శ్రీరంగ నీతులు చెబుతున్నారు"
– విజయసాయి రెడ్డి, వైఎస్సార్‌సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి

---

# సాగిలపడిన 'బాబు' రాజకీయం

**అభిప్రాయం**




సి. రామచంద్రయ్య

మెర్జర్లు, ఎక్విజిషన్లు అన్నవి ఒకప్పుడు ఆర్థిక రంగానికి మాత్రమే పరిమితం. ఇప్పుడు విలీనాలు, ఎక్విజిషన్లు, టేకోవర్లు అన్నవి రాజకీయ రంగంలో ఎక్కువయ్యాయి. సిద్ధాంతాల ప్రాతిపదికన, ప్రజా ప్రయోజనాల దృష్ట్యా రాజ్యాంగ బద్ధంగా ప్రజాస్వామ్య స్ఫూర్తితో ఇవి జరిగితే ఎవరూ తప్పు పట్టరు. అయితే, ఒక కంపెనీ మెజార్టీ వాటాలను మరో కంపెనీ దక్కించుకొని అంతిమంగా సదరు కంపెనీని తమలో కలిపేసుకునేవిధంగా.. పార్టీ కీలక నేతల్ని లాక్కొని చిట్టచివరకు గంపగుత్తగా ఆ పార్టీ మొత్తాన్ని తనలో విలీనం చేసుకొనే ప్రక్రియకు భారతీయ జనతాపార్టీ (బీజేపీ) శ్రీకారం చుట్టి చాలాకాలం అయింది. బీజేపీ దూకుడుకు నేడు అనేక రాజకీయ పార్టీలు కకావికలం అవుతున్న దృశ్యం దేశవ్యాప్తంగా గోచరిస్తున్నది. తాజాగా ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీ బలహీనతలను ఆధారం చేసుకొని దానిని తమలో విలీనం చేసుకోవడానికి బీజేపీ పావులు కదుపుతున్నదనే వార్తలు బలంగా వినిపిస్తున్నాయి. ఇందుకు తెలుగుదేశం అధినేత సంపూర్ణంగా సహకరిస్తున్నారని చెప్పడానికి నిర్దిష్టమైన ఆధారాలు, ఆనవాళ్లు స్పష్టంగా కన్పిస్తున్నాయి.

2009 తర్వాత తెలుగుదేశం పార్టీకి సర్వం తామే అన్నట్లు వ్యవహరించిన మాజీ కేంద్రమంత్రి సుజనా చౌదరి, రాజ్యసభ సభ్యులు సీఎం రమేష్, గరికపాటి మోహన్ రావులు మరో తెలుగుదేశం ఎంపీ అయిన టి.జి. వెంకటేష్‌లు బలమైన కారణాలతోనే బీజేపీలోకి చేరారు. తమ పార్టీకి చెందిన నలుగురు రాజ్యసభ సభ్యులు పార్టీ ఫిరాయించిన అంశంపై తెలుగుదేశం స్పందించిన తీరు అందర్నీ ఆశ్చర్య పర్చింది. దీనిలో ఏదో గూడుపుఠాణీ ఉన్నదని అప్పుడే అనుమానం కలిగింది. టీడీపీకి చెందిన 23 మంది ఎమ్మెల్యేల్లో మరికొంతమంది బీజేపీలోకి చేరుతున్నారన్న వార్తలొస్తున్నా.. చంద్రబాబు తనకేమీ పట్టనట్లు నిర్వికారంగా వ్యవహరిస్తున్నారు. ఇక తెలంగాణలో అయితే ఒకరిద్దరు నాయకులు మినహా టీడీపీ దాదాపుగా బీజేపీలో విలీనం అయినట్లుగానే జరిగిపోయింది.

ఈ నేపథ్యంలో ఎన్నికల ముందు చంద్రబాబునాయుడు చేసిన హడావుడిని గుర్తుచేసుకోవాల్సి ఉంది. తమిళనాడు వెళ్లి ఏప్రిల్ 16, 2019న చెన్నైలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. "నా పోరాటం ఏపీలో గెలుపు కోసం కాదు.. దేశం కోసం. అన్ని వ్యవస్థలను ప్రధాని మోదీ నిర్వీర్యం చేస్తున్నారు. ఆయన పాలనకు ముగింపు పలికే వరకు విశ్రమించను. ఈ ఉద్యమం కొనసాగుతుంది. ఈసీ తీరు, ఈవీఎం అవకతవకలపై సుప్రీం కోర్టును ఆశ్రయిస్తాం" అని ప్రకటించారు. వెళ్లిన ప్రతిచోటా దాదాపుగా ఈ విధంగానే మాట్లాడారు. నరేంద్రమోదీ దేశానికి పట్టిన అరిష్టంగా అభివర్ణించారు. తెలుగు రాష్ట్రాల్లో ముగ్గురు మోదీలున్నారంటూ.. వైఎస్ జగన్, కేసీఆర్, నరేంద్ర మోదీలను నీచంగా తిట్టారు. అయితే, ఎన్నికలలో కేంద్రంలో ఎన్డీఏ గెలుపును, ఏపీలో వైఎస్సార్‌సీపీ ఘన విజయాన్ని చూసిన చంద్రబాబు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ఆ విమర్శలు ఎంత దూరం వెళ్లాయంటే.. ఓటర్లకు పంచేందుకు నరేంద్ర మోదీ తాను ప్రయాణిస్తున్న హెలికాప్టర్‌లోనే డబ్బు తీసుకువెళుతున్నారని ఆరోపించారు. 'నమో టీవీ' పేరుతో సొంత చానెల్ పెట్టుకొన్నారని, ఐబీ, ఐటీ, ఈడీ వంటి సంస్థలతో నరేంద్ర మోదీ ప్రత్యర్థుల్ని అణచివేస్తున్నారని చంద్రబాబు చేసిన ఆరోపణలు దేశవ్యాప్తంగా కలకలం సృష్టించాయి. తెలుగునాట చంద్రబాబుకు అనుకూలమైన ఓ దినపత్రిక



ప్రధాని వ్యక్తిత్వాన్ని కించపర్చేవిధంగా "నరేంద్ర మోదీకి సెంటిమెంట్లు లేవు, కుటుంబం లేదు, సొంత భార్యను వదిలి వేసినవాడికి ప్రజలంటే ఏమి అభిమానం ఉంటుంది?" అంటూ వికృత రాతలకు పాల్పడింది. రఫేల్ వ్యవహారంలో ఎన్డీఏ ప్రభుత్వం సుప్రీంకోర్టులో తప్పుడు అఫిడవిట్ వేసిందని, పాక్‌లో ఉగ్రవాద శిబిరాలపై జరిగిన సర్జికల్ దాడుల్లో 300 మంది చనిపోవడం.. హాలీవుడ్ సినిమా కథలో మాదిరిగా ఉందంటూ చంద్రబాబు ఎద్దేవా చేశారు.

తెలుగుదేశం పార్టీకి జాతీయ అధ్యక్షుడిగా ఉన్న చంద్రబాబునాయుడు ఈ 5 నెలల్లో ఏ ఒక్క జాతీయ అంశంపైన కూడా నోరు విప్పలేదు. అస్సాంలో అమలు చేసిన 'జాతీయ పౌర పట్టిక' అంశం మొదలుకొని ఆర్థిక మాంద్యం వరకూ అనేక వివాదాస్పద అంశాలలో బీజేపీని తప్పుపట్టే అవకాశం ఉన్నా.. చంద్రబాబుకు మాట్లాడే ధైర్యం చేయలేకపోయారు. జమ్మూకశ్మీర్‌కు సంబంధించి ఆర్టికల్ 370 రద్దు విషయంలో బీజేపీ కోరకపోయినా.. తెలుగుదేశం మద్దతు పలకడం గమనార్హం. చివరకు పొరుగు రాష్ట్రం తెలంగాణలో ఆర్టీసీ సమ్మె జరిగితే జాతీయ అధ్యక్షుడి హోదాలో చంద్రబాబునాయుడు స్పందించలేదు. ఎన్నికల సమయంలో చంద్రబాబునాయుడు నేషనల్ కాన్ఫరెన్స్ అధినేత ఫరూక్ అబ్దుల్లాతో ఏపీలో ఎన్నికల ప్రచారం చేయించారు. కాగా, ఆర్టికల్ 370 రద్దు నేపథ్యంలో.. కేంద్ర ప్రభుత్వం ఫరూక్ అబ్దుల్లాను గృహ నిర్బంధంలో ఉంచింది. ఆయనను పరామర్శించడానికి రాహుల్‌గాంధీ, సీతారాం ఏచూరి, డి.రాజా వంటి కాంగ్రెస్, వామపక్ష నేతలు చొరవచూపించారు. ఆయన హౌస్ అరెస్ట్‌ను తీవ్రంగా ఖండించారు. కానీ.. చంద్రబాబు చిన్న ప్రకటన చేయలేదు. బీజేపీకి, ప్రధాని మోదీకి చంద్రబాబు భయపడుతున్నాడని చెప్పడానికి ఇంతకంటే మంచి ఉదాహరణ వేరొకటి ఉంటుందా? 100 మంది మోదీలు వచ్చినా తననేమీ చేయలేరని హూంకరించిన చంద్రబాబుకు నేడు నరేంద్రమోదీ పేరు ఎత్తితే నిద్రలేని పరిస్థితి ఏర్పడింది.

చంద్రబాబుకు తెలుగుదేశం పార్టీ అస్థిత్వం కంటే ప్రస్తుత పరిస్థితుల్లో తన అస్థిత్వాన్ని కాపాడుకోవడం ముఖ్యం. ఐదేళ్ల తన పరిపాలనలో జరిగిన అవకతవకలకు సంబంధించిన కుంభకోణాలు బయటపడితే.. తను జైలుకు వెళ్లడం తథ్యం అని ఆయనకు తెలుసు. ఈ నేపథ్యంలోనే.. బీజేపీకి దగ్గర కావాలని తహతహలాడుతున్నారు. చంద్రబాబునాయుడు మనుషులతో ఆంధ్రప్రదేశ్ బీజేపీ ప్రస్తుతం ఓ "ట్రోజన్ హార్స్"గా తయారైంది. బీజేపీని మొదట్నుంచీ నమ్ముకున్న నాయకుల్ని బయటకు పంపి బీజేపీపై పట్టు సాధించి రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి ఇబ్బందులు కలిగించాలన్నది చంద్రబాబునాయుడి దురాలోచనగా కనిపిస్తున్నది. నాలుగు దశాబ్దాల రాజకీయం తన సొంతం అని చెప్పుకొనే చంద్రబాబునాయుడు రాజకీయంగా అత్యంత హీన స్థితికి చేరారు. అయితే, చంద్రబాబును బీజేపీ చేరదీస్తుందా? చంద్రబాబు ధృతరాష్ట్ర కౌగిలిలో చేరి తెలంగాణ కాంగ్రెస్ కోలుకోలేనంత తీవ్రంగా నష్టపోయింది. ఏపీ బీజేపీ చంద్రబాబు ఎత్తుగడలు, టక్కుటమార విద్యలకు బలికాకుండా జాగ్రత్త పడుతుందా?


వ్యాసకర్త మాజీ ఎంపీ,
అధికార ప్రతినిధి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ

---

# ఇంద్రియ పంచకం

మనిషికి అయిదు జ్ఞానేంద్రియాలు ఉన్నాయి. కన్నూ, ముక్కూ, చెవీ, నాలుకా, చర్మం. మనిషికి బాహ్యప్రపంచాన్ని గురించిన ప్రత్యక్ష జ్ఞానాన్ని ఈ జ్ఞానేంద్రియాలే సమకూరుస్తాయి. రూపమూ, గంధమూ, శబ్దమూ, రుచీ, స్పర్శా వరుసగా పై అయిదు ఇంద్రియాలకు సంబంధించిన విషయాలు. ఇంద్రియాలు ఇంద్రియ విషయాలవైపు ఆకర్షితమవడం, వాటి వెంట పరుగెత్తడం, తమ వెంట మనస్సును కూడా బలవంతంగా లాక్కెళ్లిపోయేందుకు ప్రయత్నం చేయడం సహజ గుణాలు.

ఈ ఇంద్రియాలకు తమతమ ఇంద్రియ విషయాల పట్ల ఇది బాగుంది, నాకు ఇష్టం, మరింత కావాలి! ఇది బాగాలేదు. నాకు ఇష్టం లేదు, వద్దు! అనే రాగద్వేషాలే తప్ప.. ఇది మంచీ, ఇది చెడు, ఇది శ్రేయస్కరం.. ఇది కాదూ అని నిర్ణయించే విచక్షణ లేదు. ఆ విచక్షణ శక్తి బుద్ధిది. భగవద్గీత ఇంద్రియాల గురించి, ఇంద్రియ నిగ్రహాన్ని గురించి ఎన్నోసార్లు ఎన్నోవిధాలుగా ప్రస్తావిస్తుంది. జీవుడికి శరీరం అనేది ఒక ఉపాధి. సాధనం. తన జ్ఞానేంద్రియ పంచకం మనసుకు అందించే విషయ పరిజ్ఞానాన్ని స్వీకరించి, బుద్ధి ద్వారా గ్రహించి, కర్మేంద్రియాల ద్వారా తనకు శ్రేయోదాయకమైన కర్మలు చేసుకోవాలి అని వ్యవస్థ. అంటే, జీవుడు యజమాని. ఆయన తన గమ్యస్థానం చేరటం కోసం ఎక్కి కూర్చున్న రథం శరీరం. ఆ రథానికి సారథి తన బుద్ధి.



జ్యోతిర్మయం

యజమానికి కావలసిన మార్గంలో గుర్రాలు పరుగెత్తితే రథం యజమాని కోరిన గమ్యానికి చేరుతుంది. కానీ గుర్రాలు ఎటులాగితే రథం అటు వెళ్లే మాటయితే, యజమాని చేరేది గుర్రాలు తీసుకునే గమ్యానికే! ఇంద్రియాలు అనే గుర్రాలకు ఇష్టాయిష్టాలున్నాయే తప్ప మంచీ, చెడూ విచక్షణ లేదు. యజమానిని విషయలోలత్వం అనే లోయలోకి కూలదోసి భ్రష్టుణ్ణి చేస్తాయి. గుర్రాలు యజమాని చెప్పుచేతలలో నడవడం పోయి, యజమాని గుర్రాల చెప్పుచేతల్లో నడిస్తే అంతే అవుతుంది. ఇంద్రియాలను వాటి ఇష్టప్రకారం ఇంద్రియ విషయాల వెనక పరుగెత్తకుండా నియంత్రించి, వాటిని తన స్వాధీనంలో ఉంచుకుని నడిపించే వాడే ఘనుడు, విజేత అతగాడే కోరుకున్న గమ్యాన్ని చేరుకుంటాడు అంటుంది భగవద్గీత.

– ఎం. మారుతి శాస్త్రి

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 425 9899

epaper.sakshi.com

టాలీవుడ్‌ను స్పోర్ట్స్ ఫీవర్ పట్టుకున్నట్లుంది. బాక్సింగ్, రన్నింగ్, హాకీ... ఇలా ఏ ఆటలో మంచి కథ దొరికితే ఆ క్రీడాకారులుగా మారిపోయి మైదానంలోకి అడుగుపెడుతున్నారు నటీనటులు. ఇండస్ట్రీ గ్రౌండ్‌లో వెండితెర వేదికపై సూపర్ హిట్ కప్పు కొట్టాలనే కసితో ఆటకు రెడీ అయ్యారు. స్పోర్ట్స్ స్టార్స్‌గా ప్రేక్షకుల నుంచి రికార్డు వసూళ్లు అందుకోవాలనే సంకల్పంతో టాలీవుడ్ బాక్సాఫీస్ టోర్నీకి సిద్ధమవుతున్న సినిమా స్టార్స్ గురించి తెలుసుకుందాం.







# స్పోర్ట్స్ స్టార్స్

**‘ఆట గదరా శివా’... అని జీవుడు దేవుడు గురించి అనుకోవచ్చు. హీరో హీరోయిన్లు ఆటాడుకుందాం రా అని డైరెక్టర్‌తో అంటున్నారు. కొందరు కబడ్డీ ఆడుతున్నారు.. కొందరు బాక్సింగ్ గ్లవ్స్ తొడుక్కుంటున్నారు.. కొందరు ట్రాక్ మీద బుల్లెట్ సౌండ్ వినగానే పరుగు తీయడానికి రెడీ అవుతున్నారు.. మరికొందరు కుస్తీ గోదాలో తొడగొడుతున్నారు. కథలిప్పుడు ఆట ఆటగా ఉన్నాయి. ప్రేక్షకుల చేత కలెక్షన్లనే పాయింట్లు కోరుతున్నాయి. గెలిచిన వారికే సక్సెస్ కప్!**

## స్వారీకి సై

‘గురు’ సినిమాలో బాక్సర్‌గా బాక్సాఫీస్‌కు ఫటా ఫట్ పంచ్‌లు ఇచ్చిన వెంకటేశ్ మరో స్పోర్ట్స్ మూవీ కోసం గుర్రపు స్వారీకి సై అన్నారని సమాచారం. ఈ స్పోర్ట్స్ సినిమాకు ‘పెళ్ళిచూపులు’ ఫేమ్ తరుణ్‌భాస్కర్ దర్శకత్వం వహించనున్నారని తెలిసింది. హైదరాబాద్‌లోని మలక్‌పేట రేస్ క్లబ్ నేపథ్యంలో ఈ సినిమా కథాంశం ఉండబోతుందని టాక్. ప్రస్తుతం స్క్రిప్ట్‌కు ఫినిషింగ్ టచ్ ఇస్తున్నారట తరుణ్ భాస్కర్.

## కబడ్డీ... కబడ్డీ..

కబడ్డీలాంటి ఆటలకు గోపీచంద్‌లాంటి కటౌట్ ఉన్న హీరోలు బాగా సూట్ అవుతారు. త్వరలో గోపీచంద్ కబడ్డీ కోర్టులోకి అడుగుపెట్టనున్నారు. కానీ ఆటగాడిగా కాదు.. కోచ్‌గా. కోర్టులోకి దిగి తన జట్టు సభ్యులకు శిక్షణ ఇచ్చి గెలుపు మంత్రం చెప్పబోతున్నారు. ఆంధ్రా కబడ్డీ జట్టు కోచ్‌గా గోపీచంద్ నటించనున్న ఈ చిత్రానికి సంపత్ నంది దర్శకుడు. ఈ చిత్రంలో తెలంగాణ జట్టు కబడ్డీ కోచ్‌గా తమన్నా నటిస్తారు.

## గెలుపు గోల్

మ్యాచ్‌లో తన సహచర ఆటగాడు అందించిన పాస్ అందుకుని హాకీ స్టిక్‌తో బంతిని ఎక్స్‌ప్రెస్ వేగంతో గోల్ పోస్ట్ వైపు తీసుకెళ్తున్నారు సందీప్ కిషన్. మ్యాచ్‌ని మలుపు తిప్పే ఓ గోల్ కోసం గోల్‌పోస్ట్‌లోకి షాట్ కొట్టారు. ఆ నెక్ట్స్ ఏమైందో ఇప్పుడే చెబితే ఎలా? ఆటను, ఆ షాట్‌ను వెండితెరపై చూస్తేనే కదా అసలు మజా. ప్రేక్షకులకు ఆ కిక్‌ను అందించడానికే ‘ఏ1 ఎక్స్‌ప్రెస్’ సినిమాలో హాకీ ప్లేయర్ అవతారం ఎత్తారు సందీప్ కిషన్. డెన్నిస్ జీవన్ కనుకొలను ఈ చిత్రానికి దర్శకుడు. వచ్చే నెలలో చిత్రీకరణ ప్రారంభం కానుంది.

## కలల పరుగు

400 మీటర్స్ స్ప్రింటర్‌గా సరికొత్త ట్రాక్ రికార్డును క్రియేట్ చేయాలనుకునే కలలవైపు పరుగులు పెడుతున్నారు ఆది పినిశెట్టి. పృథ్వీ ఆదిత్య దర్శకత్వంలో ఆది పినిశెట్టి హీరోగా తెరకెక్కుతోన్న చిత్రం ‘క్లాప్’. ఈ చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తున్న ఆకాంక్షా సింగ్ హాకీ క్రీడాకారిణిగా కనిపిస్తారు. అథ్లెట్ విష్ణు పాత్రలో నటిస్తున్నారు ఆది పినిశెట్టి. ఈ సినిమాకు ఇళయరాజా సంగీతం అందిస్తుండటం విశేషం.

## గురి పెట్టాడు

బాణం చేతపట్టి హిట్ మూవీపై గురి పెట్టారు నాగశౌర్య. సంతోష్ జాగర్లపూడి దర్శకత్వంలో నాగశౌర్య హీరోగా ఓ స్పోర్ట్స్ మూవీ తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా చిత్రీకరణ ఆర్చరీ నేపథ్యంలో తెరకెక్కనుందని సమాచారం. ఈ ఏడాదిలోనే ఈ సినిమా షూటింగ్ ఆరంభం కానుంది. ఈలోపు ఆర్చరీ (విలు విద్య)లో ప్రత్యేక్ష శిక్షణ తీసుకునే పనిలో బిజీగా ఉంటారట నాగశౌర్య.

## డబుల్ ధమాకా

బాక్సర్‌గా... రేసర్‌గా.. ఒకేసారి రెండు ఆటలు ఆడటానికి రెడీ అవుతున్నారట విజయ్ దేవరకొండ. ప్రముఖ దర్శకుడు పూరి జగన్నాథ్ దర్శకత్వంలో విజయ్ దేవరకొండ హీరోగా తెరకెక్కుతోన్న చిత్రం ‘ఫైటర్’. ఈ చిత్రం కిక్ బాక్సింగ్ నేపథ్యంలో సాగుతుందని, విజయ్ బాక్సర్‌గా నటిస్తారని టాక్. మరోవైపు ‘హీరో’ చిత్రం కోసం రేసర్‌గా ట్రాక్‌లో పడ్డారు విజయ్. బైక్ రేసింగ్ నేపథ్యంలో సాగే ఈ సినిమాకు ఆనంద్ అన్నామలై దర్శకుడు. ఈ సంగతి ఇలా ఉంచితే... ‘అర్జున్‌రెడ్డి’ సినిమాలో ఫుట్‌బాల్ గోల్ కీపర్‌గా విజయ్ దేవరకొండ కనిపించిన సంగతి తెలిసిందే.

**– మునిమి శివాంజనేయులు**

## మరికొన్ని...

ఆల్రెడీ కొంతమంది హీరోలు క్రీడాకారులుగా సాధన మొదలుపెట్టేశారు. ప్రముఖ బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్ బయోపిక్ తెరకెక్కనుంది. ఇందులో గోపీచంద్ పాత్రలో సుధీర్ బాబు నటించనున్నారు. సుధీర్‌బాబు ఆల్రెడీ బ్యాడ్మింటన్ ప్లేయర్ అనే విషయం తెలిసిందే. దర్శకుడు ప్రవీణ్ సత్తారు ఈ బయోపిక్‌ను తెరకెక్కిస్తారు. ‘గద్దలకొండ గణేష్’ తర్వాత చేయబోతున్న చిత్రంలో వరుణ్ తేజ్ బాక్సర్‌గా కనిపించనున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంతో కిరణ్ కొర్రపాటి దర్శకునిగా పరిచయమవుతున్నారు. ఇక ప్రముఖ మల్లయోధుడు కోడి రామ్మూర్తి బయోపిక్‌లో రానా నటిస్తారని అప్పట్లో వార్తలు వచ్చిన సంగతి గుర్తుండే ఉంటుంది. అలాగే కీర్తి సురేశ్ ప్రధాన పాత్రధారిగా నగేష్ కుకునూరు దర్శకత్వంలో స్పోర్ట్స్ కామెడీ నేపథ్యంలో ఓ సినిమా తెరకెక్కుతోంది. ‘కౌశల్య కృష్ణమూర్తి: ది క్రికెటర్’ సినిమాలో క్రికెటర్‌గా కనిపించిన ఐశ్వర్యా రాజేష్ ‘మిస్ మ్యాచ్’ సినిమాలో రెజ్లర్‌గా నటించారు. ఎన్.వి. నిర్మల్‌కుమార్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో ఉదయ్ శంకర్ హీరోగా నటించారు. ఈ చిత్రం విడుదలకు సిద్ధమవుతోంది.

డాగిల దళం

# కోరపళ్ల తుపాకులు

**మ**నకు పోలీసుల, సైనికుల శిక్షణ మాత్రమే తెలుసు. వారు చేసే సాహసాలు తెలుసు. ప్రమాదాల్లో అర్పించే ప్రాణాలు తెలుసు. కాని వారితో సమానంగా వివిధ రక్షణ దళాలలో శునకాలు సేవలు అందిస్తాయి. త్యాగాలూ చేస్తాయి. కాకుంటే అవి పెద్దగా అందరికీ తెలియవు.

పోలీసులకు, సైనికులకు శిక్షణ విభాగాలు ఉన్నట్టే ఈ దళాలతో పని చేసే శునకాలకు శిక్షణ ఇచ్చే విభాగం కూడా ఒకటి ఉంది. దానిని ‘ఇండియన్ ఆర్మీ రిమౌంట్ వెటర్నరి కోర్’ అంటారు. ఇది మీరట్‌లో ఉంది. ఇక్కడే భారత దేశంలోని సాయుధ రక్షణబృందాలకు అవసరమైన అశ్వాలకు, శునకాలకు శిక్షణ ఇస్తారు. ఇది కాకుండా బి.ఎస్.ఎఫ్.ఏ వాళ్ల ‘నేషనల్ ట్రైనింగ్ సెంటర్ ఫర్ డాగ్స్’ కూడా ఉంది. ఆయా రాష్ట్రాల పోలీసు విభాగాల కింద నడిచే ట్రయినింగ్ సెంటర్లూ ఉన్నాయి. ఇవన్నీ విధి నిర్వహణ కోసం, ప్రజా రక్షణ కోసం శునకాలకు శిక్షణ ఇచ్చి వాటి సేవలు తీసుకుంటాయి. సి.ఆర్.పి.ఎఫ్ వారి సరిహద్దు సేవల కోసం శిక్షణ పొందిన శునకాలు ఎక్కువ ప్రమాదకరమైన పరిస్థితుల్లో పని చేస్తాయి ● పోలీసులు, సైనికులకు శిక్షణ ఉన్నట్టే డాగ్ స్క్వాడ్‌లో పని చేసే శునకాలకూ శిక్షణ ఉంటుంది. ● ట్రాకర్ డాగ్స్ అంటే నిందితులు వాడిన వస్తువుల వాసనను బట్టి నిందితులను వెతుక్కుంటూ వెళ్లే శునకాలకు 36 వారాలు, పేలుడు పదార్థాలను గుర్తించడం కోసం 24 వారాలు, మాదక ద్రవ్యాలను గుర్తించడానికి 24 వారాలు, ప్రమాదాల్లో బాధితులను గుర్తించే శిక్షణ 24 వారాలు, అటవీ సంపద రక్షణకు పని చేసే వీలుగా 24 వారాలు... ఇలా శిక్షణ ఇస్తూ వెళతారు ● ఈ శునకాలను ఉపయోగించే వ్యక్తిని (పోలీస్/సైనికుడు) డాగ్ హ్యాండ్లర్ అంటారు. డాగ్, డాగ్ హ్యాండ్లర్ ఒక జట్టుగా పని చేస్తారు. సైగలూ, శబ్దాలూ ఉపయోగించి డాగ్ హ్యాండ్లర్ వాటికి పనులు చెబుతాడు. డాగ్ హ్యాండ్లర్ జీతం 31 వేల నుంచి మొదలవుతుంది ● మొరగడం కుక్క సహజ లక్షణం. కాని కొన్ని సందర్భాలలో అవి మొరగడం వల్ల శత్రువు అప్రమత్తం కావచ్చు. అందుకే వాటిని మొరగకుండా కూడా శిక్షణ ఇస్తారు ● ఒక డాగ్ స్క్వాడ్ శునకం వృత్తి జీవితం 8 నుంచి 10 సంవత్సరాలు ఉంటుంది. ఆ తర్వాత అవి రిటైర్ అవుతాయి. **ఎన్నో సేవలు...** భూకంపాలు, సునామీలు వచ్చినప్పుడు తప్పిపోయిన, శిథిలాల కింద చిక్కుకున్నవారిని ఎందరినో ఈ రక్షణ శునకాలు పసిగట్టి కాపాడాయి. ప్రధాని, రాష్ట్రపతి వంటి వి.వి.ఐ.పిలు ప్రయాణించే దారులను ఈ శునకాలే మొదటగా ప్రయాణించి క్లియర్ చేస్తాయి. గతంలో భూటాన్ రాజుకు మన దగ్గర శిక్షణ పొందిన శునకాన్ని కాపలా కోసంగా ఇచ్చారు. రాజు మీద హత్యాయత్నం చేద్దామని వచ్చిన వ్యక్తి జారవిడిచిన రుమాలును వాసన పట్టిన శునకం కొన్ని మైళ్లు ప్రయాణించి మరీ ఆ దుండగుణ్ణి పట్టించింది. జమ్ము–కాశ్మీరు సరిహద్దుల్లో శత్రువు రాకను ఈ శునకాలే పసిగట్టి ఆచూకీ ఇస్తాయి. సి.ఆర్.పి.ఎఫ్ దళాలు తాజాగా తమ శునకాలకు కెమెరాలు బిగించడానికి నిర్ణయించాయి. వాటిని వదిలిపెట్టి శత్రుశిబిరాల వైపు చొచ్చుకెళ్లేలా చేసి అవి చూపిన దృశ్యాల ఆధారంగా దాడులు చేయొచ్చని ఆలోచన. తమ ధైర్యం, తెగువ, విశ్వాసంతో ఎన్నో శునకాలు ప్రజలను కాపాడటమే కాదు తమ ప్రాణాలు కూడా త్యాగం చేశాయి. వాటి త్యాగం చాలామందికి పట్టదు. పెద్దగా ప్రచారానికి నోచుకోదు. వీటిని కుక్కబతుకు కాదు. నిజంగా గొప్ప బతుకు.









సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
మంగళవారం
22-10-2019


● అనుష్క

## బర్త్‌డే స్పెషల్

నిశ్శబ్దంగా అమెరికాలో చిత్రీకరణ పూర్తి చేశారు 'నిశ్శబ్దం' చిత్రబృందం. ఆల్రెడీ సినిమాలో అనుష్క, మాధవన్ లుక్స్‌ను విడుదల చేశారు. ఇప్పుడు టీజర్ రెడీ అని తెలిసింది. అనుష్క, మాధవన్, అంజలి, షాలినీ పాండే ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన చిత్రం 'నిశ్శబ్దం'. హేమంత్ మధుకర్ దర్శకత్వం వహించారు. కోన వెంకట్ సమర్పణలో టీజీ విశ్వప్రసాద్ నిర్మించారు. ఈ చిత్రం టీజర్‌ను నవంబర్ 7న విడుదల చేయనున్నట్టు సమాచారం. నవంబర్ 7 అనుష్క బర్త్‌డే. ఆమె బర్త్‌డే స్పెషల్‌గా ఈ టీజర్‌ను విడుదల చేయాలనుకుంటున్నారట. ప్రస్తుతం అమెరికా, ఇండియాలో ఏకకాలంలో పోస్ట్ ప్రొడక్షన్ పనులు ఫుల్ స్పీడ్‌గా జరుగుతున్నాయి. ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది జనవరి 24న రిలీజ్ చేయాలనుకుంటున్నారని సమాచారం. ఇందులో అనుష్క మూగ చిత్రకారిణి సాక్షి పాత్రలో నటించారు.

# ఫైనల్‌కొచ్చేశారు


● మహేశ్ బాబు

'సరిలేరు నీకెవ్వరు' షూటింగ్ తుది దశకు చేరుకుంది. చివరి షెడ్యూల్ మినహా షూటింగ్ పూర్తయిందని చిత్రబృందం తెలిపింది. మహేశ్‌బాబు హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'సరిలేరు నీకెవ్వరు'. అనిల్ సుంకర, 'దిల్' రాజు, మహేశ్ బాబు నిర్మిస్తున్న ఈ సినిమాలో రష్మికా మందన్నా కథానాయిక. విజయ శాంతి కీలక పాత్రలో నటిస్తున్నారు. ఇటీవలే ఓ షెడ్యూల్‌ను ప్రత్యేకంగా వేసిన ఇంటి సెట్‌లో పూర్తి చేశారు. కథానుసారం ఇది విలన్ (ప్రకాశ్ రాజ్) ఇల్లు అని సమాచారం. ఈ సెట్ రూపొందించడానికి రెండున్నర కోట్లు ఖర్చు చేశారట. త్వరలో చివరి షెడ్యూల్ ప్రారంభం కానుంది. సంక్రాంతి సందర్భంగా జనవరి 12న రిలీజ్ కానున్న ఈ సినిమాకు సంగీతం: దేవిశ్రీ ప్రసాద్, కెమెరా: రత్నవేలు.

**అసురన్ బావుంది**

ధనుష్ హీరోగా వెట్రిమారన్ రూపొందించిన తమిళ చిత్రం 'అసురన్'. ఇటీవల విడుదలైన ఈ సినిమాను చూసిన మహేశ్ ఆ సినిమాను అభినందిస్తూ ట్వీట్ చేశారు. ''అసురన్' సినిమా చాలా నిజాయతీగా అనిపించింది. అద్భుతంగా ఉంది. టీమ్‌కి నా అభినందనలు'' అన్నారు.

# అలెగ్జాండర్ ఒక్కడే


● జయప్రకాశ్ రెడ్డి

నాటక రంగం నుంచి చిత్ర పరిశ్రమకు వచ్చి విలన్‌గా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా ఎంతో పేరు సంపాదించారు జయప్రకాశ్ రెడ్డి. ఆయన ముఖ్య భూమిక పోషించిన చిత్రం 'అలెగ్జాండర్'. ఒక్కడే నటుడు.. అతడే నట సైన్యం అనేది ట్యాగ్‌లైన్. ఉద్భవ్ నాన్వి క్రియేషన్స్ పతాకంపై విప్లవ చిత్రాల దర్శకుడు ధవళ సత్యం ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. ఈ చిత్రంలో జయప్రకాశ్ రెడ్డి మాత్రమే నటించటం విశేషం. కొన్ని వందల చిత్రాల్లో నటించిన అనుభవం ఉన్న జయప్రకాశ్ రెడ్డి ఒకే పాత్ర ఉన్న చిత్రంలో హీరోగా నటించిన చిత్రం ఇది. చిత్రీకరణ పూర్తయిన ఈ చిత్రం విడుదల తేదీని త్వరలోనే ప్రకటిస్తారు.


# కార్తీ సినిమాలకు పెద్ద అభిమానిని

**- అడివి శేష్**

''కార్తీ 'ఆవారా' సినిమాని బ్లాక్ టికెట్ కొనుక్కొని చూశాను. 'ఖైదీ' ట్రైలర్ నచ్చి ట్వీట్ చేయడం, ఇక్కడికి రావడం జరిగింది. కార్తీ సినిమాలకు నేను పెద్ద ఫ్యాన్‌ని'' అన్నారు అడివి శేష్. కార్తీ హీరోగా లోకేష్ కనకరాజ్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఖైదీ'. ఎస్.ఆర్.ప్రకాష్‌బాబు, ఎస్.ఆర్.ప్రభు, తిరుప్పూర్ వివేక్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 25న విడుదలవుతోంది. ఈ చిత్రాన్ని తెలుగు రాష్ట్రాల్లో శ్రీసత్యసాయి ఆర్ట్స్ అధినేత కె.కె. రాధామోహన్ విడుదల చేస్తున్నారు. ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుకలో రాధామోహన్ మాట్లాడుతూ– ''బెంగాల్ టైగర్, పంతం' లతో నిర్మాతగా మంచి పేరొచ్చింది. 'ఖైదీ' సినిమాతో ఇంకా మంచి పేరు రావాలని కోరుకుంటున్నా. ప్రస్తుతం ప్రేక్షకులు మార్పు కోరుకుంటున్నారు.. మాది అలాంటి సినిమానే'' అన్నారు. ''ఖైదీ' పేరుతో వచ్చిన అన్ని సినిమాలు హిట్ అయ్యాయి. ఈ సినిమా కూడా సూపర్ హిట్ అవ్వాలని కోరుకుంటున్నా'' అన్నారు నిర్మాత బీవీఎస్ఎన్ ప్రసాద్. ''సినిమా చాలా బాగా వచ్చింది. తప్పకుండా మీరందరూ ఎంజాయ్ చేస్తారు'' అన్నారు డ్రీమ్ వారియర్ పిక్చర్స్ అధినేత ఎస్ఆర్ ప్రభు. కార్తీ మాట్లాడుతూ – ''నేను కొత్త ప్రయోగాలు చేయడానికి 'ఖాకీ' సినిమా చిరునామా అయిపోయింది. ఆ చిత్రం తర్వాత వస్తోన్న అలాంటి సినిమా 'ఖైదీ'' అన్నారు. ''ఇండియాలోనే బిగ్గెస్ట్ ఇండస్ట్రీలో ఒక్కటైన తెలుగుకి పరిచయం అవడం సంతోషంగా ఉంది'' అన్నారు నటుడు నరేన్. నిర్మాత 'ఠాగూర్' మధు, మాటల రచయిత రాకేందు మౌళి తదితరులు పాల్గొన్నారు.


● నరేన్, అడివి శేష్, కార్తీ, క.క.రాధామోహన్, యస్.ఆర్. ప్రభు

# మా భవిష్యత్తు కోసం ఆలోచిద్దాం


● నరేశ్

''ఆదివారం జరిగిన 'మా' ఫ్రెండ్లీ అసోసియేషన్ మీటింగ్‌కి మీరు ఎందుకు రాలేదు? అని చాలా మంది నన్ను అడుగుతున్నారు. దానికి అధ్యక్షుడిగా వివరణ ఇవ్వాల్సిన అవసరం నాకుంది'' అని 'మా' అధ్యక్షుడు నరేశ్ అన్నారు. ఇంకా నరేశ్ మాట్లాడుతూ– ''25ఏళ్లలో ఎప్పుడూ 'ఎమర్జెన్సీ జనరల్ బాడీ మీటింగ్' జరగలేదు. 25 రోజుల కిందట నేను షూటింగ్‌లో ఉండగా 'ఎమర్జెన్సీ మీటింగ్ నిర్వహిస్తున్నాం.. మీరు రావాలి' అంటూ నాకు ఓ లెటర్ వచ్చింది. 'మా' అధ్యక్షుడిగా జనరల్ బాడీని ఆహ్వానించాల్సిన బాధ్యత నాకే ఉంది. కొత్త కమిటీ ఎంపికై 6 నెలలు కూడా కాకముందే ఈ జనరల్ బాడీ ఎందుకు జరుగుతోంది? అవసరం ఉందా? పైగా, నేను పిలవాల్సినదాన్ని ఎవరో పిలిచారు కాబట్టి దానికి నేను వెళ్లడం సబబు కాదని కొందరు పెద్దలు నాకు చెప్పారు. రెండు మూడు రోజుల తర్వాత ఇది ఫ్రెండ్లీ సమావేశమని చెప్పారు. ఈ సమావేశానికి అధ్యక్షుడిగా నేను హాజరు కావాల్సిన అవసరం లేదు. సంక్రాంతికి విడుదల కానున్న ఓ సినిమాలో 30మంది ఆర్టిస్టుల కాంబినేషన్ సీన్స్ కోసం ఆదివారం నేను డేట్స్ ఇచ్చాను కాబట్టి షూటింగ్‌లో ఉన్నా. జనరల్ బాడీ మీటింగ్ జరుగుతోందని మళ్లీ ఓ సర్క్యులర్ వచ్చింది. ఈ సమావేశానికి నేను అడ్డుపడుతున్నానంటూ రాశారు. 'మా' కార్యక్రమాలకు అధ్యక్షుడిగా నేనెందుకు అడ్డుపడతాను? ఇది ఏ సమావేశమో తెలియకుండా నేను వెళితే అక్కడ జరిగే పరిణామాలకు నేనే బాధ్యత వహించాల్సి ఉంటుంది. ఇది పనికిరాని ఓ సమావేశం అంటూ ఈసీ మెంబర్ పృథ్వీగారు కూడా పేర్కొన్నారు.. ఇందుకు ఆయన్ని నేను తప్పుబట్టడం లేదు. కొందరేమో ఇది ఫ్రెండ్లీ మీటింగ్ అంటున్నారు.. అక్కడి 'మా' ఫ్లెక్సీల్లోనేమో సర్వసభ్య సమావేశం అని ఉంది. ఫ్రెండ్లీ సమావేశంలో పాల్గొన్న ఓ న్యాయవాది 'మా' బైలాస్ మార్చాలి, పనికిరాని పాయింట్లు ఉన్నాయని చెప్పడం బాధగా అనిపించింది. పైగా ఎమర్జెన్సీ మీటింగ్ పెట్టాలంటే 20శాతం సభ్యులు ఆమోదించాలని ప్రింటెడ్ కాపీలతో వచ్చారంటే ఇది ఓ ప్రణాళిక ప్రకారం జరుగుతోందని తెలుస్తోంది. ప్రభుత్వంతో చర్చించి పేద కళాకారులకు ఇళ్ల స్థలాలు, పెన్షన్లు వచ్చేందుకు కృషి చేస్తున్నాం. రూ.2 కోట్లతో ఓ కార్యక్రమం నిర్వహించనున్నాం. 30లక్షలు బ్యాంకులో ఉంది, మరో 1.70కోట్లు బ్యాంకుకు రానుంది.. వేడుకకు సిద్ధంగా ఉన్నారు. ఇలాంటి కార్యక్రమాలకు అందరూ ముందుకు రండి.. 'మా' సంస్థ భవిష్యత్తు కోసం ఆలోచిద్దాం. ఇవి ఆగిపోయేలా ఎందుకు ఎక్స్‌ట్రార్డినరీ జనరల్ బాడీ మీటింగ్.. మా ఫ్రెండ్లీ మీటింగ్‌గా ఎందుకు టర్న్ అయ్యిందో మాకు తెలియడం లేదు'' అంటూ ఓ వీడియో విడుదల చేశారు.

# కేవలం మీకోసం చేయండి


● శ్రద్ధా శ్రీనాథ్

''నాలుగేళ్ల క్రితం నేను ఉండాల్సిన దానికంటే కొంచెం బరువు ఎక్కువే ఉన్నాను. అలా ఉండటానికి నేనేం ఇబ్బంది పడలేదు. మునుపటి కంటే లుక్స్ పరంగా బావుండాలనే ఉద్దేశంతో వర్కౌట్ మొదలుపెట్టాను. 'గుడ్ లుక్స్'కి అంతం అనేది ఉండదు'' అని శ్రద్ధా శ్రీనాథ్ అన్నారు. ఈ ఏడాది 'జెర్సీ' సినిమాలో తన నటనకు మంచి ప్రసంశలు పొందారు ఈ కన్నడ బ్యూటీ. ఇటీవల తన ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రస్తుత ఫొటోను, నాలుగేళ్ల క్రితం ఫొటోను పోస్ట్ చేసి శారీరకంగా వచ్చిన మార్పుల గురించి మాట్లాడారు. ''లాయర్‌గా ఉద్యోగం వచ్చి, 2014లో నా తొలి ఇంటర్నేషనల్ హాలిడేకు (బాలి) వెళ్లినప్పుడు దిగిన ఫొటో అది. ఉద్యోగంతో నా లైఫ్ స్టయిల్ మారిపోయింది. నాకు నచ్చినంత తినేదాన్ని. నన్ను నేను బాగా కష్టపడి మోటివేట్ చేసుకొని నెలకోసారి జిమ్‌కి వెళ్లేదాన్ని. చేతులు బొద్దుగా ఉన్నాయి అని సంకోచించకుండా నాకు నచ్చిన దుస్తులు వేసుకునేదాన్ని. ఈ ఫొటో దిగిన కొన్నిరోజులకే మరీ చిన్న వయసులోనే ఇలా కనబడకూడదనే ఆలోచనతో జిమ్‌లో జాయిన్ అయ్యాను. ముందు ట్రెడ్‌మిల్ మీద 5 నిమిషాలు, ఆ తర్వాత 15 నిమిషాలు, ఆ తర్వాత బ్రేక్ లేకుండా 40 నిమిషాలు పరిగెత్తగలిగాను. రైట్‌లో ఉన్న ఫొటో 2019 డార్జిలింగ్‌లో దిగాను. ఐదేళ్ల తర్వాత 18 కిలోలు తగ్గా. పొట్ట ఇంకాస్త ఫ్లాట్‌గా ఉంటే బావుండూ, ఆ డ్రెస్‌లో అమ్మాయి ఇంకా బావుంది అనిపిస్తూనే ఉంటుంది. మరోవైపు సోషల్ మీడియా ఎప్పటికప్పుడు అభద్రతా భావానికి గురి చేస్తూనే ఉంటుంది. ఇవన్నీ పక్కన పెట్టండి. మీ కోసం తగ్గండి. ఇంకొంచెం ఎక్కువ కాలం మీ గుండె పని చేయడానికి, చివరి వరకూ మీ మోకాళ్లు మిమ్మల్ని మోసేవరకూ, అనారోగ్యం లేని శరీరం కోసం, హాయిగా నిద్రించగలిగే రాత్రుల కోసం.. ముఖ్యంగా మీకోసం చేయండి'' అన్నారు.


● అంతకుముందు... ఆ తర్వాత

# మాకి ఆమోదం తెలపండి


● జీవితా రాజశేఖర్

హైదరాబాద్ ఫిల్మ్‌చాంబర్‌లోని నిర్మాతల మండలి హాలులో ఆదివారం (20వ తేదీ) తెలుగు సినిమా నటీనటుల సంఘం 'మా' జనరల్ ఆత్మీయ సమావేశం జరిగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో 'మా' జనరల్ కార్యదర్శి జీవితారాజశేఖర్ మాట్లాడుతూ – ''ఆదివారం జరిగిన సమావేశాన్ని ఆత్మీయ సమ్మేళనం, ఆంతరంగిక సమ్మేళనం, 'మా' సమావేశం.. ఇలా ఏదైనా అనుకోవచ్చు. ఈ సమావేశానికి దాదాపు 200 మంది సభ్యులు హాజరయ్యారు. ఆదివారం జరిగిన సమావేశ వివరాలను 'మా' కార్యవర్గం ఆమోదం మేరకు తెలియజేస్తున్నా. ఆదివారం 9గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సమావేశం జరిగింది. 28 మంది కమిటీ సభ్యుల మధ్య కొన్ని భేదాభిప్రాయాలు వచ్చాయి. వాటిని మేం పరిష్కరించుకోలేకపోయాం. మెజారిటీ సభ్యులు అత్యవసరంగా 'ఎక్స్‌ట్రార్డినరీ జనరల్ బాడీ మీటింగ్' పెట్టుకోవాలని సూచనలు చేశారు. ఆ సమావేశంలో 'మా' లాయర్ గోకుల్‌గారు, కోర్టులో కేసు వేసిన వరప్రసాద్‌గారు కూడా ఉన్నారు. 'మా'లో ఉన్న 900 మందికిపైగా సభ్యుల్లో 20శాతం మంది సభ్యులు ఆమోదం తెలిపితే 21 రోజుల్లోగా 'ఎక్స్‌ట్రార్డినరీ జనరల్ బాడీ మీటింగ్' జరుగుతుంది. సమస్యలు పరిష్కారం కావాలని కోరుకునే సభ్యులందరూ 'మా' ఆఫీసుకు వచ్చి సంతకాలతోనో, రావడానికి సాధ్యం కాకపోతే ఈమెయిల్ ద్వారానో, పోస్ట్ ద్వారానో ఆమోదం తెలపాలని విజ్ఞప్తి చేస్తున్నా'' అంటూ ఓ వీడియో ద్వారా పేర్కొన్నారు.

# మనిషిలో మరో కోణం


● జీపీఎస్, కపిలాక్షి

జీపీఎస్ హీరోగా కపిలాక్షి మల్హోత్రా, సోనాక్షి వర్మ కథానాయికలుగా నటించిన చిత్రం 'ప్రేమ పిపాసి'. మురళీ రామస్వామి దర్శకత్వంలో ఎస్ఎస్ ఆర్ట్ ప్రొడక్షన్స్ పతాకంపై రాహుల్ భాయ్ మీడియా, దుర్గశ్రీ ఫిల్మ్స్, పి.ఎస్. రామకృష్ణ నిర్మించారు. ఈ సినిమా టీజర్ లాంచ్‌లో అతిథిగా పాల్గొన్న పి.వి.ఆర్. విష్ణు మాట్లాడుతూ– ''సినిమాల పట్ల మంచి అభిరుచి ఉన్న నిర్మాత రామకృష్ణ. టీజర్ ఆసక్తికరంగా ఉంది. దర్శకుడు మురళి కష్టం తెలుస్తోంది'' అన్నారు. ''నిర్మాతగా ఇది నా తొలి చిత్రం. ఈ సినిమాతో జీపీఎస్ సంచలన హీరో అవుతారు. మురళి చాలా కష్టపడ్డారు. నా స్నేహితుడు యుగంధర్ వల్ల ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తున్నాను. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తాం'' అన్నారు రామకృష్ణ. ''కంటెంట్ నచ్చి ఈ సినిమాలో భాగమయ్యాను'' అన్నారు. ఈ సినిమా సహ–నిర్మాత రాహుల్ పండిట్. ''ప్రతి మనిషిలోనూ మరో కోణం ఉంటుంది. అదే మా సినిమా'' అన్నారు మురళి. ''బ్రేక్ ద రూల్స్ అనేలా మా సినిమా ఉంటుంది'' అన్నారు జీపీఎస్.




# కత్తి కంటే పదునైనది మెదడు



● తన్హాజీ పోస్టర్


'టోటల్ ధమాల్, దేదే ప్యార్ దే' వంటి హిట్స్ తర్వాత బాలీవుడ్ హీరో అజయ్ దేవగన్ చారిత్రాత్మక సినిమాతో రాబోతున్నారు. మరాఠా యోధుడు, ఛత్రపతి శివాజీ సైన్యానికి నాయకత్వం వహించిన సుబేదార్ తన్హాజీ మలుసరే జీవితం ఆధారంగా 'తన్హాజీ: ది అన్‌సంగ్ వారియర్' అనే సినిమా తెరకెక్కుతోంది. అజయ్ దేవగన్ టైటిల్ రోల్ చేస్తున్నారు. సైఫ్ అలీఖాన్ విలన్ పాత్రలో, కాజోల్ ఓ కీలక పాత్రలో నటిస్తున్నారు. ఓం రౌత్ దర్శకత్వంలో ఈ సినిమాను అజయ్ దేవగన్, భూషణ్ కుమార్, కృష్ణ కుమార్ నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో అజయ్ దేవగన్, సైఫ్ అలీఖాన్ లుక్స్‌ను సోమవారం విడుదల చేశారు. అజయ్ తన లుక్‌ని షేర్ చేసి ''మెదడు.. కత్తికంటే కంటే చాలా పదునైనది' అని పేర్కొన్నారు. జనవరి 10న ఈ సినిమా విడుదల కానుంది.

# ఆమె రీమేక్ చేస్తారా?


● కంగనా రనౌత్

అమలాపాల్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన తమిళ చిత్రం 'ఆడై'. తెలుగులో 'ఆమె'గా విడుదలైంది. ఈ సినిమాలో నగ్నంగా నటించి అమలాపాల్ సంచలనం సృష్టించారు. రత్నకుమార్ ఈ సినిమాకు దర్శకుడు. తమిళంలో విమర్శకుల ప్రసంశలు పొందింది ఈ సినిమా. ఈ సినిమా ఇప్పుడు హిందీలో రీమేక్ కాబోతోందని సమాచారం. ఒరిజినల్‌ను రూపొందించిన రత్నకుమారే హిందీ రీమేక్‌ను డైరెక్ట్ చేయనున్నారట. హిందీ రీమేక్‌లో హీరోయిన్‌గా నటించేవారిలో కంగనా రనౌత్ పేరు ముందు వరుసలో వినిపిస్తోంది. అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

# టాక్సీవాలా రీమేక్


● ఇషాన్ కట్టర్

పాత కారు, అందులో దెయ్యం అనే కాన్సెప్ట్‌తో తెరకెక్కిన విజయ్ దేవరకొండ చిత్రం 'టాక్సీవాలా'. రిలీజ్‌కు ముందే పైరసీ అయినప్పటికీ మంచి విజయం సాధించింది ఈ సినిమా. ఇప్పుడు ఈ సినిమా హిందీలో రీమేక్ అవుతోందని సమాచారం. బాలీవుడ్ యంగ్ హీరో, షాహిద్ కపూర్ సోదరుడు ఇషాన్ కట్టర్ హీరోగా 'కాలీ పీలీ' అనే సినిమా తెరకెక్కుతోంది. ఇందులో అనన్యా పాండే హీరోయిన్. మక్బూల్ ఖాన్ దర్శకుడు. ఈ సినిమాలో టాక్సీ కూడా ప్రధాన పాత్ర అని సమాచారం. తాజా సమాచారం ఏంటంటే 'కాలీ పీలీ' చిత్రం 'టాక్సీవాలా' చిత్రం ఆధారంగా రూపొందుతోందని తెలిసింది. వచ్చే ఏడాది జూన్‌లో ఈ సినిమా రిలీజ్. ఇషాన్ గత సినిమా 'ధడక్' కూడా మరాఠీ సినిమాకు రీమేకే.

# ప్రతీకార కథతో..


● వెంకటేశ్ మహా

మొదటి సినిమా 'కేరాఫ్ కంచరపాలెం'లో ప్రేమనే ఇతివృత్తంగా, మూడు దశల్లో ప్రేమ కథలను చూపించారు దర్శకుడు వెంకటేశ్ మహా. ఇప్పుడు తన కొత్త సినిమాను ప్రతీకార ఛాయలున్న కథతో రూపొందిస్తున్నారట. మలయాళ సూపర్ హిట్ చిత్రం 'మహేషింటె ప్రతీకారం' చిత్రానికి ఈ సినిమా రీమేక్ అని తెలిసింది. 'మహేషింటె ప్రతీకారం'లో చిత్రం ఫాహద్ ఫాజల్ ముఖ్యపాత్ర చేశారు. తెలుగు రీమేక్‌లో ఆయన పాత్రను సత్యదేవ్ చేస్తున్నారు. నవంబర్‌లో ఈ సినిమా చిత్రీకరణ పూర్తవుతుందని సమాచారం. 'మహేషింటె ప్రతీకారం' సినిమాకి జాతీయ అవార్డు లభించింది. తమిళంలో ఈ సినిమాను దర్శకుడు ప్రియదర్శన్ రీమేక్ చేశారు.

సాక్షి సాగుబడి
నల్లగొండ
మంగళవారం 22-10-2019



స్వతంత్ర భారత దేశంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి 5 రెట్లకు పైగా పెరిగినా ప్రజల్లో పౌష్టికాహార లోపం చాలా ఎక్కువగా ఉంది. కాబట్టి, పోషకాల సాంద్రత ఎక్కువగా ఉండే చిరుధాన్యాలు, పప్పుధాన్యాల సాగుపై దృష్టి మళ్లించాల్సిన అవసరం వచ్చింది!
– తోమియో సిచిరి, ఎఫ్.ఎ.ఓ. భారత్ ప్రతినిధి

స్వాతి కార్తె : అక్టోబర్ 24 నుంచి

# నీటి బొట్టుతో విప్లవం!



**హివరె బజార్!... పర్యావరణాన్ని పరిరక్షించుకుంటూ కరువును ఆమడ దూరం పారదోలిన అద్భుత ఆదర్శ గ్రామం. మహారాష్ట్రలోని అహ్మద్‌నగర్ జిల్లాలో మారుమూల సహ్యాద్రి పర్వతప్రాంతంలో ఉంది. 400 ఎం.ఎం. వర్షపాతం. కరువు కాటకాలు. కటిక పేదరికం. హింసాత్మక వాతావరణం.. వెరసి జీవితేచ్ఛ అడుగంటిపోతున్న గడ్డు పరిస్థితుల్లో పొపట్‌రావ్ పవార్ కంకణం కట్టుకున్నాడు. సర్పంచ్‌గా బాధ్యతలు తీసుకున్న కొద్ది ఏళ్లలోనే ఆ గ్రామం రూపు రేఖలను మార్చేశారు. ఆ కొద్ది వాన నీటినీ ఒడిసి పట్టి, గ్రామీణుల్లో సమష్టి భావనను మేల్కొల్పి పర్యావరణ పరిరక్షణ ఉద్యమాన్ని నిబద్ధంగా నడిపించారు. 'వాటర్ బడ్జెటింగ్'కు పట్టం కట్టి వ్యవసాయ విప్లవం కలను సాకారం చేసింది హివరె బజార్. వాటర్ మేనేజ్‌మెంట్ ఫోరం, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్, తెలంగాణ విశ్రాంత ఇంజినీర్ల సంఘం సంయుక్త ఆహ్వానంపై ఇటీవల హైదరాబాద్ వచ్చిన గాంధేయ వాది, ప్రసిద్ధ జలయోధుడు పొపట్‌రావు పవార్‌తో 'సాగుబడి' ప్రతినిధి పంతంగి రాంబాబు ముఖాముఖిలో ముఖ్యాంశాలు..**

**● ఉన్నత విద్యావంతులై, రాష్ట్రస్థాయి క్రికెటర్‌గా పేరు గడించిన తర్వాత మారుమూల ప్రాంతంలోని మీ స్వగ్రామం హివరె బజార్‌లో స్థిరపడ్డారు. 28 ఏళ్ల నుంచి గ్రామాన్నే అంటిపెట్టుకొని ఉంటూ అద్భుత ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దారు.. ప్రస్తుతం మీ గ్రామం ఎలా ఉంది?**

1989లో నేను మా ఊరిపై దృష్టి పెట్టే నాటికి తీవ్ర కరువు ఉండేది. పంటలు లేవు. తాగు నీటికీ కటకటగా ఉండేది. గ్రామంలో ఉపాధి లేదు. గొడవలు, హత్యల వల్ల మా గ్రామాన్ని అధికారులు బ్లాక్ లిస్ట్‌లో పెట్టారు. 95% కుటుంబాలు పొట్ట చేతపట్టుకొని పట్టణాలు, నగరాలకు వలసపోయి జీవించేవారు. మా ఊరికి ఏదైనా చెయ్యాలని ఉద్యోగానికి వెళ్లకుండా 28 ఏళ్ల క్రితం నుంచి అక్కడే ఉండిపోయాను. తొలి ఏడాదే నేను సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యాను. రిజర్వేషన్ లేనప్పుడు సర్పంచ్‌గా, రిజర్వేషన్ ఉన్నప్పుడు ఉపసర్పంచ్‌గా ఉంటున్నాను. రెండేళ్లుగా ఉప సర్పంచ్‌గా ఉన్నాను. మౌలిక మార్పు తెచ్చే పనికి వాన నీటి సంరక్షణ పనులతో శ్రీకారం చుట్టాం. 40 వేల మీటర్ల పొడవున మీటరు లోతు, మీటరు వెడల్పుతో కొండల చుట్టూతా కందకాలు తీయించాం (40 మీటర్లకు ఒక చోట 1–2 మీటర్లు వదిలేసి కందకం తీయాలి). వాననీటిని ఇంకించే 2 పర్క్యులేషన్ చెరువులు, 54 మట్టి కట్టలతో కూడిన చెరువులు, 9 సెమీ స్టోరేజ్ టాంక్‌లు నిర్మించాం. వీటన్నిటినీ గ్రామస్తులతో ఉపాధి హామీ పథకం కింద అమలుపరిచాం. ఇప్పుడు మా భూముల్లో 30–40 అడుగుల లోతులో నీరుంటుంది(చుట్టుపక్కల గ్రామాల్లో 300–400 అడుగుల లోతులోనే నీరుంటుంది). అయినా, ఎంత వర్షపు నీరు భూగర్భంలోకి చేరిందో, అంత నీటిని మాత్రమే తిరిగి వాడుకుంటున్నాం. రబీ, వేసవి కాలపు పంటలకు లెక్కగట్టి మరీ వాడుకుంటాం. ఖరీఫ్‌లో పంటలకు నీటి తడులు ఇవ్వం. రబీ, వేసవి పంటలకు మాత్రమే డ్రిప్, స్ప్రింక్లర్లు వాడుతూ పొదుపుగా నీటిని వాడుతున్నాం. నీటిని అధికంగా తీసుకునే చెరకు, అరటి, దానిమ్మ, వరి తదితర పంటలను పూర్తిగా నిషేధించాం. 400 ఎం.ఎం. మా గ్రామం సగటు వర్షపాతం. 100 ఎం.ఎం. వర్షం పడితే మంచినీటికి కొరత ఉండదు. 400 ఎం.ఎం. పడిన సంవత్సరం రబీ, వేసవి పంటలు కూడా సాగు చేస్తాం. 300 ఎం.ఎం. వర్షం మాత్రమే కురిస్తే ఖరీఫ్, రబీలతోనే సరిపెడతాం. వేసవిలో ఏ పంటా వేయం.

**● 'వాటర్ బడ్జెటింగ్' అంటే..?**

అవును. 1995 నుంచి గ్రామసభలో 'వాటర్ బడ్జెటింగ్' చేసుకుంటున్నాం. వర్షం తక్కువ కురిస్తే ఆ ఏడాది తక్కువ విస్తీర్ణంలో పంటలు వేస్తాం. భూ గర్భంలోకి ఆ ఏడాది అదనంగా చేరిన నీటిని మాత్రమే బావుల ద్వారా తోడుకొని, ఆ నీటితో పండించగలిగే రకం పంటలను, తగిన విస్తీర్ణంలో మాత్రమే పండిస్తాం. ప్రతి రెండు నెలలకు గ్రామ సభ జరుగుతుంది. అందరిముందూ చర్చించి నిర్ణయం తీసుకొని అమలు చేస్తాం. బోర్లను పూర్తిగా నిషేధించాం. అందరి పొలాల్లోనూ బావులే (మొత్తం 376) ఉంటాయి. నీటి సంరక్షణ ఫలితంగా పశుగ్రాసానికి ఇబ్బంది లేకుండా పోయింది. పశుసంపద పెరిగింది. రోజుకు 5 వేల లీటర్ల పాలు అమ్ముతున్నాం. దాదాపు ప్రతి ఇంట్లో బయోగ్యాస్ ఉంటుంది. స్లర్రీని పంటలకు ఎరువుగా వాడుతున్నాం. క్రమంగా 80 శాతం రసాయనిక ఎరువుల వాడకం తగ్గించేశాం. మా భూములు సారవంతమయ్యాయి. తేమను నిలుపుకునే సామర్థ్యాన్ని పెంచుకున్నాయి. సేంద్రియ కర్బనం 1 శాతం కన్నా ఎక్కువగానే ఉంది. నీటి నాణ్యత, భూసారం, పంటల ఉత్పాదకత పెరిగింది.

**● గత రెండేళ్ల పరిస్థితి ఎలా ఉంది?**

గత రెండేళ్లలో వర్షం సరిగ్గా లేదు. గత ఏడాది 168 ఎం. ఎం. కురిసింది. అంతకుముందు ఏడాదీ దాదాపు అంతే. ఖరీఫ్‌లో వర్షాధారంగా పంటలు పండించాం. పశుగ్రాసపు పంటలు తప్ప రబీ, వేసవి పంటలకు పూర్తిగా విరామం ప్రకటించాం. దాదాపు ప్రతిఇంట్లోనూ గేదెలు, ఆవులు ఉన్నాయి. అందరికీ రోజువారీగా పాడి ఆదాయం వస్తుంది. అడవిలో పశువులు మేపడం నిషేధించాం. దసరా, దీపావళి తర్వాత గడ్డి కోసుకోవడానికి రైతులకు వీలు కల్పించాం. ఏడాదికి రూ. 100 రుసుము. బలహీనవర్గాలకు రూ. 25 మాత్రమే. చెట్లు నరకడంపై నిషేధం మొదటి నుంచీ ఉంది. మా గ్రామ పరిసరాల్లో 10 లక్షల చెట్లు నాటాం.

**● గ్రామస్తులను భాగస్వాములను చేయడం ద్వారా 28 ఏళ్లుగా ప్రకృతి వనరులను పరిరక్షించుకుంటూ నిజమైన అభివృద్ధికి బాటలు వేశారు కదా.. పేదరికాన్ని పూర్తిగా జయించగలిగారా?**

అవును. మా గ్రామంలో 1995లో 95% కుటుంబాలు పేదరికంలో మగ్గేవి. ఇప్పుడు మా గ్రామంలో పేదరికంతో బాధపడేవారు ఒక్కరూ లేరు. ఉపాధి హామీ పని కావాలని అడిగే వారే లేరు. నెలకు తలసరి ఆదాయం అప్పట్లో రూ. 830 ఉండేది, ఇప్పుడు రూ. 32,000కి పెరిగింది. ఆర్థికాభివృద్ధి కన్నా ఆనందంగా ఉండటంపైనే దృష్టి పెడుతున్నాం. మా ఊళ్లో రైతులెవరూ ఇతరులకు భూములు అమ్మకూడదని నియమం పెట్టుకున్నాం. ఊళ్లో నలుగురికి తప్ప మిగతా అందరికీ భూమి ఉంది. వారికి కూడా త్వరలో భూమి ఇప్పిస్తాం. 79% కుటుంబాల్లో కనీసం ఒక్కరికి ప్రభుత్వ ఉద్యోగం ఉంది. టీచర్లు, సైనికులుగా ఎక్కువ మంది పనిచేస్తున్నారు. ముగ్గురు వైద్యులు కూడా ఉన్నారు.

**● మీ గ్రామంలో సాంఘిక, రాజకీయ పరిస్థితులు ఎలా ఉన్నాయి?**

రాజకీయ, కుల, మత గొడవలు లేవు. చాలా ఏళ్ల క్రితమే ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి నిర్మించుకున్నాం. దోమల్లేకుండా చేశాం. దోమను పట్టి చూపితే రూ. వంద బహుమతి ప్రకటించాం. మద్యపానాన్ని నిషేధించాం. హోటల్ లేదు. ఎటువంటి విగ్రహాలూ పెట్టం. సిగరెట్, తంబాకు, మాదకద్రవ్యాలకు అనుమతి లేదు. ఎన్నికల ప్రచారానికి వచ్చే నేతలు ఊరి బయటే వాహనాలు, జెండాలు వదిలి గ్రామంలోకి వచ్చి ప్రచారం చేసుకోవాలి. నినాదాలు ఇవ్వకూడదు. ఏజెంట్లను గ్రామసభే ఎంపిక చేస్తుంది. పోలింగ్ గొడవలకు తావులేదు. 90%పైగా పోలింగ్ ప్రశాంతంగా జరుగుతుంది. మా ఊళ్లో మగవాళ్ల కన్నా ఆడవాళ్లే ఎక్కువ మంది ఉన్నారు. అన్ని ఇళ్లలోనూ వంట గ్యాస్ ఉంది. వంట చెరకు కోసం, నీటి కోసం కడవలతో కిలోమీటర్లు తిరగాల్సిన బాధ తప్పటం, మద్యనిషేధం, మంచి నడవడిక నేర్పే చదువు 10వ తరగతి వరకు ఊళ్లోనే అందుబాటులోకిరావడంతో ముఖ్యంగా మహిళలు సంతోషంగా ఉన్నారు.

**● నీటిని పొదుపుగా వాడుకునే పంటల సరళి గురించి చెప్పండి..?**

మార్కెట్‌ను బట్టి పంటలను ఎంపిక చేసుకొని పండించడం వల్లనే రైతులు సంక్షోభంలో కూరుకుపోతున్నారు. పర్యావరణానికి హాని కలగని రీతిలో పంటల సరళిని రూపొందించుకోవాలి. నీటి అక్షరాస్యత, పంటల సరళి అక్షరాస్యత, గ్రామ ప్రజల భాగస్వామ్యం.. గ్రామాల అభివృద్ధికి చాలా కీలకం. మన భూములు ఎలాంటివి? ఆ భూములకు నీటి తేమను పట్టి ఉంచే శక్తి ఎంత మేరకు ఉంది? భూగర్భంలోకి ఎంత వాన నీటిని ఇంకింప జేసుకోవచ్చు? వర్షాకాలంలో వ్యవసాయ బావుల్లోకి నీరు ఎంత మేరకు వస్తోంది? ఈ వివరాలను అధ్యయనం చేస్తే మూడేళ్లకు ఆ గ్రామంపై పూర్తి అవగాహన వస్తుంది. ఆ తర్వాత సాగుకు నీరు ఎంత అందుబాటులో ఉండేదీ అంచనా వేసుకొని, ఆ ఏడాది ఏయే పంటలు ఎంత విస్తీర్ణంలో పండించాలన్నది నిర్ణయించుకోవాలి.

**● మీ గ్రామంలో ఎలా చేశారు?**

ఉన్నది వెయ్యి హెక్టార్ల సాగు భూమి. 250 హెక్టార్లలో చింత, వేప, మామిడి, బత్తాయి వంటి తోటలు వేసి వర్షాధారంగానే సాగు చేస్తున్నాం. ఈ తోటల్లో అంతరపంటలుగా మునగ, తదితర కూరగాయలు వేస్తుంటాం. ఖరీఫ్‌లో వర్షం బాగానే ఉంటే ఉల్లి ఎక్కువ వేస్తాం. ప్రధానంగా తీపి జొన్న, సజ్జ, టమాటా, బంతి పూలు, ఆకుకూరలు వర్షాధారంగానే సాగు చేస్తాం. రబీలో పంటలకు మాత్రమే నీటి తడులు ఇస్తాం. నీటిని పారగట్టడం అసలు లేదు. రబీలో జొన్న, బంగాళదుంప, బఠాణి, టమాట, ఆకుకూరలు వంటి పంటలు వేస్తాం. సగం నీరు వర్షం ద్వారా అందతుంది. మిగతా సగం నీరు డ్రిప్/స్ప్రింక్లర్ ద్వారా ఇస్తాం. ఏడాది పొడవునా ముఖ్యంగా వేసవిలో పశుగ్రాసపు పంటలు వేస్తాం, పాడి పశువులకు ఇబ్బంది లేకుండా. వేసవిలో పూల తోటలు కూడా వేస్తాం. వరుసగా రెండేళ్లు 400 ఎం.ఎం. వర్షపాతం ఉంటే పూర్తిస్థాయిలో పంటలు పండిస్తాం. అంటే.. ఖరీఫ్‌లో 100%, రబీలో డ్రిప్/స్ప్రింక్లర్ల ద్వారా 70%, వేసవిలో 30% విస్తీర్ణంలో తగిన పంటలు వేస్తాం. 200 ఎం.ఎం. మాత్రమే వర్షపాతం ఉంటే ఖరీఫ్‌లో తక్కువ రోజుల్లో తక్కువ నీటితో పండే బఠాణి, ఆకుకూరలు, పశుగ్రాసం, టమాట పండిస్తాం. రబీలోనూ అంతే. నాలుగు సార్లు నీటి తడి అవసరమయ్యే ఉల్లి పంట కూడా వేయం. తీపి జొన్నకు రెండు తడులు, శనగకు ఒక తడి సరిపోతాయి. ఉల్లికి 4 తడులు అవసరమవుతాయి.



● టమాటా తోటలో తోటి రైతులతో పవార్

**● రైతులంతా ఒప్పుకుంటున్నారా?**

గ్రామసభలోనే చర్చించి ఈ నిర్ణయాలు తీసుకుంటున్నాం. మొదటి ఐదేళ్లలో కొంత ఇబ్బంది ఉండేది. ఇప్పుడు నీటి అక్షరాస్యత పెంపొందించుకోవడంతో రైతులందరూ సంతోషంగానే ఒప్పుకుంటున్నారు. పంట విరామం కాలంలో బంధువుల ఊళ్లకు వెళ్లి సెలవులు ఎంజాయ్ చేస్తున్నారు.

**● హెక్టారుకు ఎంత నికరాదాయం వస్తున్నది?**

సాధారణంగా హెక్టారుకు ఏడాదికి రూ. 30 వేల నుంచి 50 వేల వరకు రైతులకు నికరాదాయం వస్తున్నది. ఎక్కువ డబ్బు కావాలని లేదు. ఆనందంగా ఎంత వస్తే అంతే చాలు.

**● మీ కుటుంబం గురించి..?**

మాది ఉమ్మడి కుటుంబం. ముగ్గురు అన్నదమ్ములం, ముగ్గురు అక్కచెల్లెళ్లు. ఉమ్మడి భూమి 25 ఎకరాలు. 28 ఏళ్ల నాడూ అంతే, ఇప్పుడూ అంతే. 10 ఎకరాల్లో సీతాఫలం తోట వేశాం. మిగతా 15 ఎకరాల్లో ఉల్లి, తీపి జొన్న, టమాట, బంతి పూలు తదితర పంటలు పండిస్తున్నాం. ఎం.కాం. చదివాను. క్రికెటర్‌గా రాష్ట్ర స్థాయిలో పేరు సంపాదించాను. అయినా, ఉద్యోగం చూసుకోవడం కన్నా ఊరికోసం పనిచేయడం మంచిదని ఊళ్లోనే ఉంటున్నాను. నా కుమార్తెకు పెళ్లి చేశాను. కుమారుడు ఈ మధ్యనే అగ్రి బిఎస్సీ పూర్తి చేశాడు. ఊళ్లోనే ఉండి వ్యవసాయోత్పత్తుల మార్కెటింగ్ చేయాలని అనుకుంటున్నాడు.

**● ప్రపంచవ్యాప్తంగా నీటి నిపుణుల దృష్టిని మీ గ్రామం ఆకర్షించింది కదా..?**

1995 నుంచి గ్రామస్థాయిలో పంచవర్ష ప్రణాళికలు తయారు చేసుకొని అమలు చేస్తున్నాం. ఉపాధి హామీ, ఆదర్శ గ్రామ పథకం ద్వారా నిధులతో, గ్రామస్తుల శ్రమదానంతోనే అన్ని పనులూ చేసుకున్నాం. అదనపు నిధులు గానీ, విదేశీ నిధులు గానీ, కార్పొరేట్ నిధులు గానీ పైసా కూడా తీసుకోవట్లేదు. గ్రామానికి చెందిన వారి విరాళాలను మాత్రమే తీసుకుంటున్నాం. మా గ్రామాన్ని రోజూ 500 మంది సందర్శిస్తూ ఉంటారు. 60 దేశాల నీటి నిపుణులు సందర్శించారు. అనేక ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయాలు మా అభివృద్ధి నమూనాను అధ్యయనం చేస్తున్నాయి.

**● రాజకీయ, కుల, మత ప్రాతిపదికపై చీలిపోయి ఉన్న గ్రామాల్లో మీ అభివృద్ధి నమూనాను అమలు చేయడం సాధ్యమేనా?**

ముమ్మాటికీ సాధ్యమే. మొదట ఒక వ్యక్తి లేదా కుటుంబం గ్రామంలోనే ఉండి దృఢ దీక్షతో పనిచేయాలి. నాలుగైదేళ్ల తర్వాత ఫలితాలు రావడం చూసి ప్రజలు మద్దతు ఇవ్వడం ప్రారంభిస్తారు. ఎటొచ్చీ నాయకత్వం వహించే వ్యక్తి రాజకీయాలకు అతీతంగా నిలబడాలి. అంతే. నాకు అసెంబ్లీ, పార్లమెంటు టిక్కెట్లు ఇస్తామని అనేక పార్టీలు ఆఫర్ ఇచ్చినా నేను తిరస్కరించి, గ్రామం కోసమే నిలబడ్డాను. రాజధానిలో ప్రణాళికలు రచించి ఒక శాఖ లేదా సంస్థ ద్వారా వాటిని అమలు పరిస్తే.. ఇక గ్రామీణ సమాజానికి భాగస్వామ్యం ఎక్కడ దొరుకుతుంది? ప్రపంచం ఇవ్వాళ ఎదుర్కొంటున్న సమస్యలను మేం 25 ఏళ్ల క్రితమే పరిష్కరించగలిగాం. గ్రామ ప్రజలను భాగస్వాముల్ని చేయగలిగాం కాబట్టే ఇది సాధ్యపడింది. గ్రామాలు, ప్రభుత్వం కలిసి అభివృద్ధి కోసం పాటుపడాలి. అయితే, ఈ ప్రయాణంలో గ్రామాలే డ్రైవర్ సీటులో ఉండాలి! ●







● హివరె బజార్‌లో జలసంపదను చూపుతున్న పొపట్‌రావు పవార్.. పచ్చగా అలరారుతున్న హివరె బజార్ గ్రామం.. కందకాల ద్వారా వాన నీటి సంరక్షణ

# గుంతలు తవ్వటం భలే సులువు!

● మొక్కలు నాటేందుకు గుంతలు తవ్వే యంత్రం రూపొందించిన రైతు
● రూ. 1.10 లక్షల ఖర్చుతో బైక్ కమ్ డ్రిల్లింగ్ యంత్రానికి రూపకల్పన
● లీటర్ పెట్రోలుతో 300 గుంతలు రెడీ



● డ్రిల్లింగ్ యంత్రంతో గుంతలు తీస్తున్న బాషా

తక్కువ శ్రమ, తక్కువ ఖర్చుతో పండ్ల తోటలు, కలప తోటలు నాటుకునేందుకు ఉపయోగపడే ఓ డ్రిల్లింగ్ యంత్రాన్ని రూపొందించాడు ఓ రైతు. ఆయన పేరు సయ్యద్ అహమీద్ బాషా. ఊరు మండ్లెం. జూపాడు బంగ్లా మండలం. కర్నూలు జిల్లా.

బాషా తనకున్న ఏడెకరాల పొలంలో మలబార్ వేప మొక్కలు నాటాలని సంకల్పించారు. కూలీలతో గుంతలు తీయటం ప్రారంభించారు. ఒక్కో కూలీకి రూ.500ల చొప్పున చెల్లిస్తే రోజుకు 5 గుంతలకు మించి తీయలేకపోయారు. 7 ఎకరాల పొలంలో 4 వేల మొక్కలు నాటాలంటే కూలి ఖర్చులే తడిసి మోపెడవుతాయని భావించిన హమీద్ బాషా ఇందుకు ఒక సులువైన ఉపాయం ఆలోచించారు. వివిధ యంత్రాలకు చెందిన పాత సామాన్లను సేకరించి, తన పాత బైక్‌కు అమర్చి విజయవంతంగా ఒక డ్రిల్లింగ్ యంత్రాన్ని రూపొందించారు. అడుగు వెడల్పు, రెండున్నర అడుగుల లోతుతో గుంతలు తవ్వేలా డ్రిల్లింగ్ యంత్రాన్ని తయారు చేయించారు. దీనికి రూ.1.10 లక్షలు ఖర్చుచేశారు. దీని సహాయంతో స్వయంగా తానే గుంతలు తీసి మలబార్ వేప మొక్కలు నాటించారు. దీన్ని బైక్ లాగానే నడుపుకుంటూ పొలానికి తీసుకెళ్లవచ్చు. అక్కడికి వెళ్లాక అప్పటికప్పుడు కొన్ని మార్పులు చేస్తే డ్రిల్లింగ్ యంత్రంగా మారిపోతుంది. లీటరు పెట్రోలు పోస్తే 300 వరకు గుంతలు తవ్వవచ్చంటున్నారు. ఈ యంత్రం వల్ల తనకు డబ్బు ఆదా అయ్యిందని రైతు శాస్త్రవేత్త సయ్యద్ హమీద్ బాష (90596 79595) గర్వంగా చెప్పారు.



● నడుపుకుంటూ వచ్చిన బైక్ కం డ్రిల్లింగ్ యంత్రాన్ని గుంతలు తీయడానికి సిద్ధం చేస్తున్న దృశ్యం

– చాకలి నాగభూషణం, సాక్షి, జూపాడుబంగ్లా, కర్నూలు జిల్లా

# మొక్క నాటే యంత్రం!



● యంత్రంతో పొగ మొక్కలను నాటుతున్న కూలీలు



● యంత్రంతో నాటిన పొగ మొక్కలు

వర్జీనియా పొగాకు సాగు అధిక పెట్టుబడితో కూడిన వ్యవహారం. కూలీలతో మొక్కేత వేయిస్తే ఎకరానికి ఎనిమిది మంది వరకు కూలీలు అవసరం. అచ్చు, సాలు, ఇరువాలు, కాలువలు తీయించడం.. అన్నిటికీ కలిపి ఎకరానికి రూ.5 వేల నుంచి రూ. 6 వేల వరకు పెట్టుబడి పెట్టాల్సి వస్తున్నది. పైగా కూలీల కొరత నేపథ్యంలో నాట్లు పూర్తి కావడానికి చాలా రోజులు పడుతోంది.

ఈ నేపథ్యంలో ఐటీసీ, మహీంద్రా కంపెనీలు పొగ మొక్కలు నాటే యంత్రాన్ని రైతులకు అందుబాటులోకి తెచ్చాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం ఊట్లపల్లి సమీపంలోగల తిమ్మాపురం వద్ద ఉన్న కొడవాటి వాసు రైతు పొలంలో ఇటీవల మొక్కలు నాటి, ఈ విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. దీనిద్వారా మొక్కేత ఖర్చు తక్కువ. సమయాన్ని కూడా ఆదా చేసుకోవచ్చు. ట్రాక్టర్ వెనుక అమర్చిన ఈ యంత్రం ద్వారా ట్రే పద్ధతిలో పెంచిన పొగాకు మొక్కలను రోజుకు 5 ఎకరాల్లో నాట్లు వేసుకోవచ్చు. ఈ యంత్రం ద్వారా మొక్క నాటడం, మొక్క మొదలు దగ్గరకు మట్టిని ఎగదోసి వత్తడంతోపాటు ప్రతి మొక్కకు 300 మిల్లీ లీటర్ల నీటిని అప్పటికప్పుడే పోయవచ్చు. ఈ యంత్రాన్ని నడిపేందుకు ట్రాక్టర్ డ్రైవర్‌తోపాటు నలుగురు కూలీలు ఉంటే చాలు. గంటకు 1,500 మొక్కల చొప్పున రోజుకు ఐదెకరాల్లో మొక్కలు నాటుకోవచ్చు. ఈ యంత్ర సాయంతో నాటేసేందుకు పొలంలో దుక్కి, అచ్చు ఇరువాలు, కాలువ తీయాల్సిన అవసరం లేదు. అలాగే కలుపు తీసే పని కూడా ఉండదు. కూలీల ఖర్చు, సమయాలతోపాటు సాగు నీటిని కూడా ఆదా చేసుకోవచ్చు. దాంతో వర్జీనియా పొగాకు రైతులు ఈ యంత్రంపై ఆసక్తి చూపిస్తున్నారు. కానీ ఖరీదైన ఈ యంత్రాన్ని రైతులు కొనుగోలు చేయాలంటే కష్టం. మండలానికో యంత్రాన్ని ఐటీసీ ద్వారా ఉచితంగా అందుబాటులో ఉంచితే మేలని రైతులు కోరుతున్నారు.

– ఎం.డి. ముజాఫర్ ఖాన్, సాక్షి, అశ్వారావుపేట రూరల్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

## నారాయణపురం, నాగర్‌కర్నూల్, రంగారెడ్డి జిల్లాల్లో నవంబర్ 10, 11 తేదీల్లో డా. ఖాదర్‌వలి సభలు



సిరిధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం పొందే మార్గాలు, సిరిధాన్యాల సాగు పద్ధతులపై రైతులోకం ఫౌండేషన్, తెలంగాణ ఇంజనీర్ల సంఘం ఆధ్వర్యంలో నవంబర్ 10 (ఆదివారం) ఉ. 10 గం. నుంచి మ. 1 గం. వరకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లా కేంద్రం **నారాయణపేటలోని** పోలేపల్లి ఫంక్షన్ హాల్(మార్కెట్ దగ్గర)లో జరిగే సదస్సులో ప్రముఖ స్వతంత్ర శాస్త్రవేత్త, ఆహార – ఆరోగ్య నిపుణులు డా. ఖాదర్ వలి(మైసూరు) ప్రసంగిస్తారు. వివరాలకు.. జె.సి.ఎం. – 93965 84805. అదేరోజు సా. 4 గం. నుంచి 7 గం. వరకు **నాగర్‌కర్నూల్‌లో** మార్కెట్ యార్డు(కలెక్టర్ ఆఫీసు ఎదురుగా) జరిగే సభలో డా. ఖాదర్ ప్రసంగిస్తారు. వివరాలకు.. జి. ఆనంద్– 94400 39561, కరణ్ లాల్– 94419 18999. నవంబర్ 11(సోమవారం)న మధ్యాహ్నం 2 గం. నుంచి సా. 5 గం. వరకు రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం **పాల్మకుల్ గ్రామంలోని** స్కూల్ గ్రౌండ్‌లో జరిగే సభలో డా. ఖాదర్ వలి ప్రసంగిస్తారు. వివరాలకు.. రాజ్ భూపాల్ – 909 01 2999. ప్రొఫెసర్ (డా.) డి. రామ్‌కిషన్– 94407 12021, మేరెడ్డి శ్యాంప్రసాద్‌రెడ్డి – 99638 19 074. ప్రవేశం ఉచితం. అందరూ ఆహ్వానితులే.


## ఇక అన్ని స్కూళ్లలో న్యూట్రిషన్(కిచెన్) గార్డెన్లు



దేశంలోని పట్టణ/నగర, గ్రామీణ ప్రాంతాల్లోని అన్ని పాఠశాలల ఆవరణలో పోషక విలువలతో కూడిన సేంద్రియ ఆకుకూరలు, కూరగాయలను సాగు చేసేందుకు న్యూట్రిషన్ (కిచెన్) గార్డెన్లను విధిగా ఏర్పాటు చేయాలని కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు సూచిస్తూ తాజాగా మార్గదర్శకాలు జారీచేసింది. విత్తనాలు, మొక్కలు, సేంద్రియ ఎరువు, శిక్షణ, సాంకేతిక సహకారం అందించాలని కృషి విజ్ఞాన కేంద్రాలు, వ్యవసాయ/ఉద్యాన శాఖలు, ఆహార–పౌష్టికాహార బోర్డులు, వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, అటవీ శాఖలకు కేంద్రం ఆదేశించింది. పాఠశాలకు ప్రహరీ నిర్మాణం, భూమిని చదును చేయడం వంటి పనులను జాతీయ ఉపాధి హామీ పథకం కింద చేపట్టవచ్చని కేంద్రం పేర్కొంది. పట్టణీకరణ ఊపందుకున్న నేపథ్యంలో పర్యావరణ సమస్యలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో పౌష్టిక విలువలతో కూడిన ఆహారాన్ని బడిలోను, ఇంటి దగ్గరా పండించుకోవడం రేపటి తరానికి నేర్పించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్న భావంతో ఈ పథకాన్ని చేపట్టారు. స్థలం తక్కువగా ఉండే పట్టణ, నగర ప్రాంతాల్లో స్కూళ్లలో కూడా న్యూట్రిషన్(కిచెన్) గార్డెన్లను విధిగా ఏర్పాటు చేయాలని కేంద్రం సూచించింది.

• డెయిరీ డైరీ-12

## దాణాలో మాంసకృత్తులు 95% అందేదెలా?



మేపులో అధిక ఖర్చుతో కూడుకున్నది దాణా. దాణాలోని మాంసకృత్తులు(ప్రొటీన్లు) అందించే పదార్థాలు పశు శరీరంలో ఎంత మేరకు జీర్ణమవుతున్నాయన్నది ముఖ్యమైన ప్రశ్న. వేరుశనగ చెక్క, పత్తి చెక్క ద్వారా అందించే ప్రొటీన్ సాధారణంగా 70 శాతం మేరకు మాత్రమే పశువుకు అందుతుందని, మిగతాది వృథాగా పోతున్నదని అంచనా. ఈ సమస్యను అధిగమిస్తే పాడి రైతులు తక్కువఖర్చుతోనే ఎక్కువ ప్రయోజనం పొందవచ్చు. అదెలాగంటే.. నెమరు వేసే జంతువులైన పాడి పశువుల్లో పొట్ట నాలుగు భాగాలుగా ఉంటుంది. అవి.. రూమెన్, రెటిక్యులమ్(అరలపొట్ట), ఒమేజమ్, అబోమేసమ్. సాధారణంగా పచ్చిమేత, ఎండుమేత, దాణా రూమెన్‌లో సూక్ష్మజీవరాశి తోడ్పాటుతో 60–70% జీర్ణమై అమ్మోనియం విడుదలై, కాలేయంలో యూరియాగా మారుతుంది. ఆ యూరియా మూత్రం ద్వారా బయటకు వెళ్లిపోతుంది. అయితే, దాణాలోని ప్రొటీన్ పశువు పొట్ట మొదటి భాగం(రుమెన్)లో కాకుండా చివరిదైన నాలుగో భాగం(అబోమేసమ్)లోకి చేరి జీర్ణమైతే 95% మేరకు ప్రొటీన్ పశువుకు ఒంటికి పడుతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఇందుకు ఉపయోగపడేలా హానికారకం కాని రసాయనిక ప్రక్రియ ద్వారా 'బైపాస్ ప్రొటీన్'ను ఉత్పత్తి చేస్తున్నారు. దీన్ని కలిపిన దాణా పశువులకు మేపితే, అది రుమెన్‌లో కాకుండా అబోమేసమ్‌లో ఎక్కువగా జీర్ణమై 95% వరకు పశువుకు ఉపయోగపడుతుంది. కాబట్టి రైతుకు ఖర్చు తగ్గుతుందని, పాల దిగుబడితోపాటు పాలలో వెన్న, ఎస్‌ఎన్‌ఎఫ్ శాతం, నికరాదాయం పెరుగుతుందని శాస్త్రవేత్తల సూచన.



epaper.sakshi.com

# సాక్షి భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక,
రోడ్ నంబరు-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com

మంగళవారం
22-10-2019





# ఫాల్‌లో చేరాలా... స్ప్రింగ్ బెటరా?

**విదేశీ యూనివర్సిటీల్లో ప్రవేశాలకు ఎప్పటి నుంచి సన్నద్ధమవ్వాలి. ఆ దేశాల్లో అడ్మిషన్స్ సైకిల్ ఎలా ఉంటుంది. అమెరికా, యూకే, ఆస్ట్రేలియా, కెనడా వంటి దేశాల్లోని ఇన్‌స్టిట్యూట్స్ ఏ సీజన్‌లో విద్యార్థులను ఎక్కువగా చేర్చుకుంటున్నాయి. భారత విద్యాసంస్థల మాదిరిగా కాకుండా.. విదేశీ విశ్వవిద్యాలయాలు ఏడాదిలో ఎన్నిసార్లు అడ్మిషన్‌లు కల్పిస్తాయి.. మొదటిసారి ప్రవేశం లభించకపోతే.. మరోఏడాదిపాటు నిరీక్షించాల్సిందేనా?! ఇలాంటి సందేహాల నివృత్తి కోసం అందిస్తున్న ప్రత్యేక కథనం...**

- ఫాల్, స్ప్రింగ్, సమ్మర్‌లో విదేశీ యూనివర్సిటీల ప్రవేశాలు
- ఫాల్ సీజన్‌లోనే అధికశాతం అడ్మిషన్స్ కల్పిస్తున్న విదేశీ వర్సిటీలు
- ముందుగానే సన్నద్ధత ప్రారంభించడం మేలంటున్న నిపుణులు

భారతీయ విద్యాసంస్థలు మే/జూన్‌లో ఎంట్రెన్స్ టెస్టులు నిర్వహించి.. ప్రవేశ ప్రక్రియ చేపడతాయి. ఒకసారి సీటు దక్కకపోతే మళ్లీ సమ్మర్ వచ్చే వరకు అంటే ఏడాది కాలం ఎదురు చూడాల్సిందే. కానీ విదేశీ యూనివర్సిటీల్లో ప్రవేశ ప్రక్రియ భిన్నంగా ఉంటుంది. సీటు పొందడానికి పలు దఫాల్లో ప్రయత్నించవచ్చు. మొదటిసారి అడ్మిషన్ దక్కకపోయినా.. అదే ఏడాది కొన్ని నెలల వ్యవధిలోనే మరోసారి ప్రయత్నించే వెసులుబాటు ఉంటుంది. విదేశీ యూనివర్సిటీలు ఏటా ఫాల్, స్ప్రింగ్, సమ్మర్, వింటర్.. ఇలా పలు దశల్లో ప్రవేశ ప్రక్రియ నిర్వహిస్తాయి. తాజాగా విదేశీ యూనివర్సిటీలు అడ్మిషన్స్‌కు సంబంధించి ప్రకటనలు విడుదల చేస్తున్నాయి.

## ఫాల్‌లోనే ఎక్కువ

విదేశీ యూనివర్సిటీలు ఫాల్, స్ప్రింగ్, సమ్మర్ అనే మూడు ప్రధాన సీజన్లల్లో ప్రవేశాలు కల్పిస్తున్నాయి. వీటిలో ఫాల్, స్ప్రింగ్ సీజన్‌లలోనే అత్యధిక యూనివర్సిటీలు దరఖాస్తులు కోరుతాయి. మరీ ముఖ్యంగా ఫాల్ సీజన్‌కు డిమాండ్ కాస్త ఎక్కువ. పేరొందిన యూనివర్సిటీలు చాలావరకు ఫాల్‌లోనే అడ్మిషన్లు నిర్వహిస్తాయి. ప్రముఖ యూనివర్సిటీలు అందించే ముఖ్యమైన కోర్సులు సైతం ఫాల్ సీజన్‌లో మాత్రమే ఉంటాయి. మిగతా సీజన్‌లలో డిమాండ్ ఉన్న కోర్సులు తక్కువే అని చెప్పొచ్చు. యాక్సెప్టెన్సీ రేటు ఫాల్ సీజన్‌లో ఎక్కువగా ఉంటుంది. ఇందుకు కారణం.. ఎక్కువ సంఖ్యలో సీట్లు అందుబాటులో ఉండటమే. ఇక, వీసా సక్సెస్ రేటులో యూనివర్సిటీలది ప్రధాన పాత్ర. కాబట్టి పేరున్న కాలేజీలో ఫాల్‌లో చేరితే వీసా లభించడం కూడా సులువు అవుతుంది. మన విద్యార్థులు ఎక్కువగా ఆసక్తి చూపే అమెరికాకు ఫాల్, స్ప్రింగ్ సీజన్‌లలో వెళుతున్నారు. సమ్మర్‌లో తక్కువగా ప్రవేశాలు జరుగుతున్నాయి. అమెరికా క్యాలెండర్ ప్రకారం-ఫాల్ సీజన్‌ను అకడెమిక్ ప్రారంభ ఇయర్‌గా పేర్కొనొచ్చు. అందుకే ఆ సీజన్‌లో ఎక్కువగా అడ్మిషన్స్ కల్పిస్తున్నారు.

## ఆగస్టు చివరి నుంచి

✦ అమెరికా, యూకే, కెనడా, సింగపూర్, ఆస్ట్రేలియా యూనివర్సిటీలు ఆగస్టు నెల చివరల్లో అడ్మిషన్స్ ప్రక్రియ ప్రారంభిస్తాయి. ఫిబ్రవరి లేదా జూన్ చివరి కల్లా దరఖాస్తులు స్వీకరించడం పూర్తి చేస్తాయి. స్కాలర్‌షిప్స్ కోరుకునే ఇంటర్నేషనల్ విద్యార్థులు నవంబర్ చివరి వారం/డిసెంబర్ మొదటి వారంలోగా తమ దరఖాస్తు ప్రక్రియ పూర్తి చేసుకోవాలి. ఇంటర్నేషనల్ విద్యార్థులు సెప్టెంబర్‌లో దరఖాస్తు చేసుకోవడం ప్రారంభించినప్పటికీ.. అసలైన ప్రక్రియ అంతకంటే ముందుగానే మొదలవుతుంది. యూనివర్సిటీల గురించి తెలుసుకోవడం, దరఖాస్తు విధానంపై అవగాహన తదితరాలకు సమయాన్ని కేటాయించాల్సి ఉంటుంది.

## ఫాల్ అడ్మిషన్.. టైమ్‌లైన్

» **జూన్:** ఏ దేశం, ఏ యూనివర్సిటీ, ఏ కోర్సులో చేరాలో నిర్ణయించుకోవాలి.
» **జూలై:** ప్రవేశ పరీక్షలకు నమోదు చేసుకోవాలి. పరీక్షలు రాయాలి.
» **ఆగస్టు:** అప్లికేషన్ ప్యాకేజీలకు సన్నద్ధమవ్వాలి. టెస్ట్ స్కోరు పొందాలి.
» **సెప్టెంబర్:** దరఖాస్తు చేసుకోవడం ప్రారంభించాలి.
» **నవంబర్-డిసెంబర్-జనవరి:** దరఖాస్తు ప్రక్రియ పూర్తవుతుంది.
» **ఫిబ్రవరి- మార్చి:** దరఖాస్తులకు కాలేజీలు రిప్లై ఇస్తాయి.
» **ఏప్రిల్ - మే:** స్కాలర్‌షిప్స్ కోసం అన్వేషించడం, ఎడ్యుకేషన్ రుణానికి దరఖాస్తు తదితర ఆర్థిక విషయాలు చూసుకోవాలి.
» **జూలై:** డిపార్చర్ సన్నాహకాలు.
» **ఆగస్టు:** సెషన్ ప్రారంభమవుతుంది.

## 15 నెలల ముందే!

విదేశాల్లో ఉన్నత విద్యకు ప్రణాళికలు వేసుకునే వారు కనీసం 15 నెలల ముందే తమ సన్నద్ధతను ప్రారంభించాలి. అంటే.. ఉదాహరణకు 2020 ఫాల్‌కు కాలేజీలో చేరాలనుకుంటే.. 2019 ప్రారంభంలోనే ప్రక్రియ మొదలుపెట్టాలి. యూనివర్సిటీ ఎంపిక, లాంగ్వేజ్ టెస్టు(ఐఈఎల్‌టీఎస్ /పీటీఈ/టోఫెల్ వంటివి), జీఆర్‌ఈ, జీమ్యాట్ వంటి టెస్టులు రాయాల్సి ఉంటుంది. అలానే స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్, లెటర్ ఆఫ్ రికమండేషన్, అకడమిక్ ట్రాన్‌స్క్రిప్ట్స్, ఫీజు చెల్లించడానికి ఆర్థిక వనరులు, కాలేజీ ఆన్‌లైన్ దరఖాస్తు మొదలైన ప్రక్రియ ఉంటుంది. దీనికి చాలా సమయం పడుతుంది. కాబట్టి ముందుగానే సన్నద్ధత మొదలుపెట్టాలి.

## స్ప్రింగ్ అడ్మిషన్స్

స్ప్రింగ్‌కు కూడా విద్యార్థులు దరఖాస్తు చేసుకుంటారు. అయితే అన్ని యూనివర్సిటీలు స్ప్రింగ్‌కు ప్రత్యేకంగా దరఖాస్తులు స్వీకరించవు. ఫాల్‌కు దరఖాస్తు చేసుకొని.. అడ్మిషన్ పొందలేని వారికి.. స్ప్రింగ్‌కు ఆహ్వానం అందే వీలుంటుంది. ఫాల్‌లోని కొన్ని ప్రోగ్రామ్‌లు స్ప్రింగ్‌కు అందుబాటులో ఉండవు. అమెరికాలో కార్నెల్, యూఐయూసీ, పర్డ్యూ, సీఎంయూ, యూనివర్సిటీ ఆఫ్ విస్కాన్‌సిన్, మేడిసన్, యూఎస్‌సీ, ఎన్‌వైయూ లాంటి విద్యాసంస్థలు స్ప్రింగ్‌లోనూ అడ్మిషన్లు కల్పిస్తున్నాయి.

## ప్రవేశం ఇలా

ఔత్సాహిక విద్యార్థులు ఆయా ఇన్‌స్టిట్యూట్‌లకు నేరుగా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తుతోపాటు నిర్దేశిత పత్రాలు (విద్యార్హతల సర్టిఫికెట్లు; ఫీజు, నివాస వ్యయానికి సరిపడే విధంగా ఆర్థిక వనరుల రుజువు పత్రాలు, స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్, రికమండేషన్ లెటర్స్ తదితర) అందించాలి. వీటిని పరిశీలించి ఆయా ఇన్‌స్టిట్యూట్‌లు ఆఫర్ లెటర్ ఇస్తాయి. దీన్నే ఐ-20 ఫామ్‌గా పిలుస్తారు. దీని ఆధారంగా స్టూడెంట్ వీసాకు దరఖాస్తు చేసుకోవాలి. అమెరికా వీసా ప్రక్రియ కాస్త క్లిష్టంగా ఉంటుంది. కాబట్టి విద్యార్థులు తాము చేరదలచుకున్న కోర్సు, ఇన్‌స్టిట్యూట్ విషయంలో అడ్మిషన్ సెషన్ ప్రారంభానికి కనీసం ఏడాది లేదా ఏడాదిన్నర ముందు నుంచే కసరత్తు ప్రారంభించాలి.

## అవసరమైన పత్రాలు

✦ విద్యార్హతల సర్టిఫికెట్లు, స్టాండర్డ్ టెస్ట్ స్కోర్లు తప్పనిసరి.
✦ కోర్సు ట్యూషన్ ఫీజు, కోర్సు వ్యవధిలో అమెరికాలో నివాసం ఉండేందుకు అవసరమయ్యే వ్యయాలకు సరిపోయే ఆర్థిక వనరులున్నాయనే రుజువులు జతచేయాలి.
✦ **స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్(ఎస్ఓపీ):** చాలా యూనివర్సిటీలు ప్రవేశాలు కల్పించడానికి ఎస్ఓపీని కోరుతున్నాయి. అభ్యర్థులు ఎస్ఓపీలో తాము కోర్సుకు దరఖాస్తు చేసుకోవడానికి గల కారణాలు, జీవితంలో తన లక్ష్యాలను పేర్కొనాల్సి ఉంటుంది. సాధారణంగా యూనివర్సిటీ/డిపార్ట్‌మెంట్ ఎస్ఓపీకి 500 లేదా అంతకంటే తక్కువ పదాలు పరిమితిగా పేర్కొంటాయి.
✦ **లెటర్ ఆఫ్ రికమండేషన్:** ఇది అభ్యర్థుల సామర్థ్యాన్ని అంచనా వేస్తూ.. థర్డ్ పర్సన్ ఇచ్చే ధృవీకరణ వంటిది. ఇక్కడ థర్డ్ పర్సన్ ప్రొఫెసర్ లేదా ఎంప్లాయర్ కావచ్చు. చాలా యూనివర్సిటీలు కనీసం రెండు లేదా మూడు రికమండేషన్ లెటర్స్ అడుగుతాయి.

## వీసా

విద్యార్థులు అమెరికాను ఎంచుకుంటే.. వారికి వీసా ఇంటర్వ్యూ ఉంటుంది. ఆస్ట్రేలియా, బ్రిటన్ వంటి దేశాలకు ఇంటర్వ్యూలు లేకుండానే వీసా పొందే వెసులుబాటు లభిస్తుంది. అమెరికా ఔత్సాహిక అభ్యర్థులు ఐ-20 పొందిన తర్వాత దాని ఆధారంగా ఎఫ్-1 వీసాకు దరఖాస్తు చేసుకోవాలి. ఈ వీసా దరఖాస్తును పరిశీలించిన అధికారులు.. నిర్దేశిత తేదీలో ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. ఈ ఇంటర్వ్యూ సమయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. కోర్సు పూర్తయ్యాక స్వదేశానికి తిరిగొస్తామని స్పష్టంగా చెప్పాలి. ఇంటర్వ్యూ సందర్భంగా అభ్యర్థి ఇచ్చిన సమాధానాలకు సంతృప్తి చెందితే ఎఫ్-1 వీసా ఖరారవుతుంది.

## విదేశీ విద్య... ప్రామాణిక పరీక్షలు

అంతర్జాతీయ యూనివర్సిటీల్లో చదవాలనుకునే అభ్యర్థులు కనీసం ఒక ఇంగ్లిష్ లాంగ్వేజ్ టెస్ట్ (ఐఈఎల్‌టీఎస్/టోఫెల్)తోపాటు ఒక ప్రామాణికమైన పరీక్ష రాయాల్సి ఉంటుంది. జీఆర్‌ఈ, జీమ్యాట్, సాట్ లాంటి ప్రామాణికమైన పరీక్షలకు హాజరుకావాలి. అభ్యర్థులు ఎంచుకునే కోర్సు, దేశాలకు అనుగుణంగా ఆయా పరీక్షలకు దరఖాస్తు చేసుకోవాలి.




### ఐఈఎల్‌టీఎస్

✦ ది ఇంటర్నేషనల్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ టెస్టింగ్ సిస్టమ్.. ఐఈఎల్‌టీఎస్. ఇది ఇంగ్లిష్ ప్రొఫిషియన్సీ టెస్ట్. ఆస్ట్రేలియా, బ్రిటన్, కెనడా, న్యూజిలాండ్, అమెరికా, ఇతర యూరోపియన్ దేశాల్లోని దాదాపు అన్ని యూనివర్సిటీలు/ కాలేజీలు ఈ స్కోరును ప్రవేశాలకు ప్రామాణికంగా తీసుకుంటున్నాయి. దీన్ని బ్రిటిష్ కౌన్సిల్, ఐడీపీ ఆస్ట్రేలియా, కేంబ్రిడ్జ్ ఇంగ్లిష్ నిర్వహిస్తాయి. ఐఈఎల్‌టీఎస్ స్కోరును 'బాండ్'లలో తెలుపుతారు. ఐఈఎల్‌టీఎస్ స్కోరు 0 నుంచి 9 బాండ్‌ల వరకు ఉంటుంది.

### టోఫెల్

✦ టెస్ట్ ఇన్ ఇంగ్లిష్ యాజ్ ఏ ఫారెన్ లాంగ్వేజ్.. టోఫెల్. ఈ స్కోరును యూఎస్, కెనడా యూనివర్సిటీలు ఎక్కువగా కోరుతున్నాయి.

### పియర్‌సన్ టెస్ట్ ఆఫ్ ఇంగ్లిష్ (పీటీఈ)

✦ టోఫెల్, ఐఈఎల్‌టీఎస్‌లాగే పీటీఈ అకడమిక్ కూడా ఇంగ్లిష్ ప్రొఫిషియన్సీ టెస్ట్.

### జీఆర్‌ఈ

✦ గ్రాడ్యుయేట్ రికార్డ్ ఎగ్జామినేషన్స్.. జీఆర్‌ఈ. విదేశాల్లో ఉన్నత విద్యలో చేరాలంటే..ఇంగ్లిష్ లాంగ్వేజ్ ప్రొఫిషియన్సీ టెస్ట్‌తోపాటు ఏదైనా ఒక ప్రామాణిక పరీక్ష స్కోరు అవసరం (కొన్ని కాలేజీలకు, దేశాలకు మినహాయింపు). జీఆర్‌ఈ ప్రామాణిక ఎగ్జామ్స్‌లో ముందు వరుసలో ఉంటుంది. ఈ స్కోరు ఆధారంగా ప్రపంచ వ్యాప్తంగా వేలాది మంది గ్రాడ్యుయేట్ స్కూల్స్, బిజినెస్ స్కూల్స్‌లో ప్రవేశాలు పొందుతున్నారు.

### జీమ్యాట్

✦ గ్రాడ్యుయేట్ మేనేజ్‌మెంట్ అడ్మిషన్ టెస్ట్.. జీమ్యాట్. అంతర్జాతీయంగా ఉన్న టాప్ బిజినెస్ స్కూల్స్‌లో ప్రవేశాలకు ఈ స్కోరు ఉపయోగపడుతుంది.

### సాట్ (స్కాలస్టిక్ ఆప్టిట్యూడ్ టెస్ట్)

✦ అంతర్జాతీయంగా గ్రాడ్యుయేట్ లెవల్ కోర్సుల్లో ప్రవేశాలకు వీలుకల్పించే టెస్ట్ ఇది.

---

## ఉద్యోగ సమాచారం

### ఇండియన్ ఆర్మీ- టెక్నికల్ గ్రాడ్యుయేట్ కోర్సు

ఇండియన్ మిలిటరీ అకాడమీ(ఐఎంఏ), డెహ్రాడూన్..టెక్నికల్ గ్రాడ్యుయేట్ కోర్సు-జులై 2020 (టీజీసీ-131)నోటిఫికేషన్ విడుదల చేసింది.

✦ **ఖాళీలు:** 40
✦ **కోర్సు ప్రారంభం:** జులై 2020.
✦ **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో ఇంజనీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణత.
✦ **వయసు:** 2020, జులై 1 నాటికి 20-27 ఏళ్ల మధ్య ఉండాలి.
✦ **ఎంపిక:** ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూ, మెడికల్ టెస్ట్ ఆధారంగా ఎంపిక చేస్తారు.
✦ **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
✦ **దరఖాస్తుకు చివరితేదీ:** నవంబర్ 14, 2019.
✦ **వెబ్‌సైట్:** www.joinindianarmy.nic.in

### ఏపీఎండీసీలో 5 పోస్టులు

విజయవాడ (ఏపీ)లోని ఆంధ్రప్రదేశ్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీఎండీసీ).. ఒప్పంద ప్రాతిపదికన 5 అసిస్టెంట్ మేనేజర్ (జియాలజీ) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

✦ **అర్హత:** ఎంఎస్సీ (జియాలజీ) ఉత్తీర్ణతతో పాటు ఐదేళ్ల అనుభవం ఉండాలి.
✦ **వయసు:** 35 ఏళ్లకు మించకూడదు.
✦ **ఎంపిక:** షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
✦ **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
✦ **దరఖాస్తుకు చివరితేదీ:** అక్టోబర్ 31, 2019.
✦ **వెబ్‌సైట్:** https://apmdc.ap.gov.in


**సాక్షి ఎడ్యుకేషన్ వెబ్‌సైట్లో..**

❖ డీఎస్సీ స్టడీ మెటీరియల్, బిట్‌బ్యాంక్, మోడల్‌పేపర్స్
❖ ఎస్ఐ, కానిస్టేబుల్ స్టడీ మెటీరియల్, ఆన్‌లైన్ టెస్టులు
❖ ఐబీపీఎస్ క్లర్క్స్ స్టడీ మెటీరియల్, ఆన్‌లైన్ టెస్టులు

విద్య, ఉద్యోగ సమాచారం కోసం
WWW.SAKSHIEDUCATION.COM
SAKSHI CURRENT AFFAIRS యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ యాప్ స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోండి


# ఎఫ్ఎంజీఈ-2019




**విదేశాల్లో వైద్యవిద్యను అభ్యసించే వారి సంఖ్య ప్రతి ఏటా పెరుగుతూనే ఉంది. పరిమిత సీట్ల కారణంగా ఇక్కడ ఎంబీబీఎస్‌లో ప్రవేశం పొందలేని విద్యార్థులు.. విదేశాల్లో వైద్యవిద్యను అభ్యసించి స్వదేశానికి తిరిగి వస్తున్నారు. ఇక్కడకు వచ్చాక మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎంసీఐ)లో పేరు నమోదు చేసుకోవాలన్నా.. ఉన్నత విద్య, ఉద్యోగంలో చేరాలన్నా... భారత ప్రభుత్వం నిర్వహించే ఫారెన్ మెడికల్ గ్రాడ్యుయేషన్ ఎగ్జామినేషన్(ఎఫ్ఎంజీఈ) స్క్రీనింగ్ టెస్టులో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది. నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్(ఎన్‌బీఈ) ఏటా రెండుసార్లు(జూన్/డిసెంబర్‌లో) ఎఫ్ఎంజీఈ పరీక్షను నిర్వహిస్తుంది. డిసెంబర్ 2019 ఎఫ్ఎంజీఈకు నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో.. అర్హతలు, దరఖాస్తు ప్రక్రియ, సిలబస్‌కు సంబంధించి సమగ్ర సమాచారం...**

» డిసెంబర్ 2019 సెషన్‌కు నోటిఫికేషన్ విడుదల
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: అక్టోబర్ 31
» కంప్యూటర్ బేస్డ్ ఆన్‌లైన్ టెస్టు తేదీ: డిసెంబర్ 20

## ఆన్‌లైన్ పరీక్ష

✦ ఎఫ్ఎంజీఈ పరీక్షను కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) విధానంలో ఆన్‌లైన్‌లో నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్ (ఎన్‌బీఈ) నిర్వహిస్తుంది.

## ఎందుకు ఎఫ్ఎంజీఈ

వైద్యవిద్యను అభ్యసించాలని చాలామంది కలలు కంటారు. కానీ దేశంలో, రాష్ట్రంలో వైద్య కాలేజీల్లో ఉన్న పరిమిత సీట్లు, అధిక ఫీజుల కారణంగా.. అందరికీ తమ కలను సాకారం చేసుకునే అవకాశం లభించడంలేదు. దాంతో రష్యా, ఉక్రెయిన్, కిర్గిస్తాన్, బెలారస్, జార్జియా, కజకిస్తాన్, చైనా, ఫిలిప్పీన్, మారిషస్, బంగ్లాదేశ్, నేపాల్ వంటి దేశాల్లో వైద్యవిద్యను అభ్యసించేందుకు వెళ్తున్నారు. మన దేశం నుంచి ప్రతీ ఏటా వేలమంది విద్యార్థులు ఆయా దేశాల్లోని మెడికల్ కాలేజీల్లో ప్రవేశం పొందుతున్నారు. విదేశాల్లో వైద్యవిద్య పట్టాను పొందిన విద్యార్థులు.. భారత్‌లో ప్రాక్టీస్ చేయాలన్నా, మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(ఎంసీఐ)లో పేరు నమోదు చేసుకోవాలన్నా, వైద్య విద్యకు సంబంధించి ఉన్నతవిద్య, ఉద్యోగంలో చేరాలన్నా.. భారత ప్రభుత్వం నిర్వహించే ఫారెన్ మెడికల్ గ్రాడ్యుయేషన్ ఎగ్జామినేషన్ (ఎఫ్ఎంజీఈ) స్క్రీనింగ్ టెస్టులో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది.

## అర్హత

✦ ఎఫ్ఎంజీఈ పరీక్షకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు భారతీయ పౌరుడై ఉండాలి లేదా ఓవర్సీ సిటిజన్‌షిప్ ఆఫ్ ఇండియా(ఓసీఐ) అయి ఉండాలి.
✦ 2019 నవంబర్ 30లోపు విదేశాల్లో ఎంబీబీఎస్ లేదా తత్సమాన ప్రైమరీ మెడికల్ కోర్సు ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఎఫ్ఎంజీఈ స్క్రీనింగ్ టెస్టుకు నమోదు చేసుకోవచ్చు.
✦ విదేశాల్లో ఎంబీబీఎస్ చదివిన వైద్య విద్యా సంస్థ సహా పూర్తి వివరాలు సమర్పించాలి.
✦ కెనడా, ఆస్ట్రేలియా,యునైటెడ్ కింగ్‌డమ్, న్యూజిలాండ్, అమెరికాల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ మెడికల్ డిగ్రీ పట్టా పొందిన అభ్యర్థులు.. ఎఫ్ఎంజీఈ పరీక్షకు దరఖాస్తు చేసుకోనవసరం లేదు. వారు నేరుగా ఎంసీఐ/ఎస్ఎంసీలో నమోదు వెసులుబాటు ఉంది.

## దరఖాస్తు ప్రక్రియ

✦ దరఖాస్తు ప్రక్రియను ఆన్‌లైన్ విధానంలోనే పూర్తి చేయాలి
✦ ఎఫ్ఎంజీఈ పరీక్ష కోసం రిజిస్ట్రేషన్ చేసుకునే అభ్యర్థులు ఎన్‌బీఐ అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలి.

## దరఖాస్తు ఫీజు

✦ అన్ని కేటగిరి అభ్యర్థులు (ఎస్సీ,ఎస్టీ, ఓబీసీ,జనరల్, మహిళలు, దివ్యాంగులు) రూ.5500 ఫీజుగా చెల్లించాలి.
✦ ఆన్‌లైన్,నెట్ బ్యాంకింగ్, డెబిట్/క్రెడిట్ కార్డు ద్వారా కూడా చెల్లించవచ్చు.

## పరీక్ష విధానం

✦ కంప్యూటర్ ఆధారితంగా నిర్వహించే ఈ పరీక్ష 300 మార్కులకు జరుగుతుంది. ప్రశ్న పత్రాన్ని రెండు భాగాలుగా(సెక్షన్‌లు) విభజించారు. ప్రతి విభాగంలో 150 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఉంటాయి. ఒక్కో పేపర్‌కు రెండున్నర గంటల సమయం కేటాయిస్తారు. ఈ పరీక్షలో నెగిటివ్ మార్కులు ఉండవు. ప్రశ్న పత్రం ఇంగ్లిష్‌లో మాత్రమే ఉంటుంది.
✦ ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధిస్తేనే ఎంసీఐ లేదా ఇతర స్టేట్ మెడికల్ కౌన్సిల్స్‌లో రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు అర్హత లభిస్తుంది.
✦ మొత్తం 300 మార్కులకు కనీసం 150 మార్కులను సాధించిన వారిని ఉత్తీర్ణులుగా ప్రకటిస్తారు.

## ప్లానింగ్‌తో ప్రిపరేషన్

✦ సుదీర్ఘకాలం నుంచి ప్రిపరేషన్ సాగిస్తున్న విద్యార్థులకు ఒత్తిడి అనేది సహజంగానే ఉంటుంది. అయితే ఒత్తిడికి లోనుకాకుండా ప్రతి సబ్జెక్టుకు సంబంధించి ఒక ప్రణాళిక వేసుకొని మధ్యలో విశ్రాంతికి, తగినంత నిద్రకు సమయాన్ని కేటాయించుకుంటూ చదివితే పరీక్షలో విజయం సాధించవచ్చు.
✦ రెండు సెక్షన్‌లకు కలిపి 19 సబ్జెక్టుల నుంచి ప్రశ్నలు వస్తాయి. దీంట్లో అనాటమీ, ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ, ఫార్మకాలజీ, పాథాలజీ, మైక్రో బయాలజీ సబ్జెక్టుల బేసిక్స్ మీద పట్టు సాధిస్తే.. మిగతా సబ్జెక్టుల ప్రిపరేషన్ సులువు అవుతుంది. అలాగే ఇంటర్నల్ మెడిసిన్, సర్జరీ, గైనకాలజీ తదితర సబ్జెక్టులు స్కోరింగ్‌కు ప్రధానం. ఒక్కో సబ్జెక్టు నుంచి 30 వరకు ప్రశ్నలు అడుగుతారు. నెగిటివ్ మార్కులు ఉండవు. కాబట్టి అన్ని ప్రశ్నలకు సమాధానాలు గుర్తించాలి.
✦ రెండు సెక్షన్‌లు ఉండే ఈ పరీక్షలో.. మొదటి సెక్షన్ నాన్ క్లినికల్ సబ్జెక్టుల నుంచి, రెండో సెక్షన్‌లో క్లినికల్ సబ్జెక్టుల మేళవింపుగా ప్రశ్నలు వస్తాయి.

## సిలబస్, మార్కులు

✦ పరీక్ష పేపర్‌లో రెండు సెక్షన్‌లు (పార్ట్ ఏ, బీ) ఉంటాయి. మొదటి సెక్షన్‌లో అనాటమీ, ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ, పాథాలజీ, మైక్రో బయాలజీ, ఫార్మకలోగ్, ఫోరెన్సిక్, మెడిసన్.. మొత్తం వంద మార్కులకు ఉంటుంది.
✦ రెండో సెక్షన్‌లో క్లినికల్ సబ్జెక్టులు 200 మార్కులకు ఉంటాయి. మెడిసిన్ అలైడ్ సబ్జెక్ట్స్‌కు సంబంధించి మెడిసిన్-33, సైకియాట్రీ-5, డెర్మటాలజీ-5, రెడియోథెరపి-5 మార్కులకు ప్రశ్నలు ఎదురవుతాయి. అలాగే జనరల్ సర్జరీ అలైడ్ సబ్జెక్ట్స్‌కు సంబంధించి జనరల్ సర్జరీ-32, అనస్తీషియాలజీ-5, ఆర్థోపెడిక్స్-5, రేడియోడయాగ్నోసిస్-5,పెడియాట్రిక్-15, ఆప్తమాలజీ-15, ఆటోర్హలోర్మలజీ-15, ఒబిస్టేట్రిక్స్ అండ్ గైనకాలజీ-30, కమ్యూనిటీ మెడిసిన్-30 మార్కులకు ప్రశ్నలు ఉంటాయి.

## ముఖ్యమైన తేదీలు

» **ఆన్‌లైన్ దరఖాస్తు తేదీలు:** 2019 అక్టోబర్ 11 నుంచి అక్టోబర్ 31
» **తప్పుల సవరణ:** 2019 నవంబర్ 2 నుంచి నవంబర్ 7 తేదీ వరకు
» **అడ్మిట్ కార్డ్:** 2019 డిసెంబర్ 13వ తేదీ నుంచి
» **పరీక్ష తేదీ:** పార్ట్ -ఎ, బీ: 2019 డిసెంబర్ 20
» **ఫలితాలు:** 2020 జనవరి 20
» **వెబ్‌సైట్:** http://www.nbe.edu.in

సాక్షి స్పోర్ట్స్
మంగళవారం
22-10-2019

# నేడే క్లీన్‌స్వీప్

చారిత్రక విజయానికి చేరువలో టీమిండియా
నిప్పులు చెరిగిన షమీ, ఉమేశ్
ఒకే రోజు 16 వికెట్లు
సఫారీ బ్యాట్స్‌మెన్ విలవిల
తొలి ఇన్నింగ్స్‌లో 162కే ఆలౌట్
రెండో ఇన్నింగ్స్ 132/8

**ఈ టెస్టుకు ఇంకా రెండు రోజుల ఆట ఉంది. కానీ... చరిత్రకెక్కేందుకు లాంఛనమే మిగిలుంది. సఫారీపై ఎప్పుడూలేని విధంగా 3–0తో క్లీన్‌స్వీప్ విజయానికి టీమిండియా రెండే అడుగుల దూరంలో ఉంది. టెస్టుల్లో నంబర్‌వన్ కోహ్లి బృందం తమ స్థాయికి తగ్గ ప్రదర్శనతో దక్షిణాఫ్రికాను రోజంతా దడదడలాడించింది. మూడో టెస్టులో ఒక్క మూడో రోజే 16 వికెట్లతో ఘనచరిత్రకు శ్రీకారం చుట్టింది.**



షమీ

**రాంచీ:** భారత పేసర్లు షమీ, ఉమేశ్‌లు ఆఖరి టెస్టును మూడో రోజే తేల్చేశారు. ఇద్దరు సీమర్లు రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి ఐదేసి వికెట్లు పడేశారు. చారిత్రక విజయానికి భారత్‌ను దగ్గర చేశారు. క్లీన్‌స్వీప్‌కు రెండే వికెట్ల దూరంలో నిలిపారు. ఆ లాంఛనం తొలి ఘడియలోనే పూర్తయితే కోహ్లి సేన ఎదురులేని విజయాన్ని సాధిస్తుంది. తొలి సెషన్‌లో పేసర్లు ఉమేశ్ (3/40), షమీ (2/22)లకు స్పిన్నర్లు జడేజా (2/19), నదీమ్ (2/22) తోడయ్యారు. దీంతో సఫారీ తొలి ఇన్నింగ్స్ 56.2 ఓవర్లలో 162 పరుగులకే కుప్పకూలింది. హమ్జా (79 బంతుల్లో 62; 10 ఫోర్లు, 1 సిక్స్) ఒంటరి పోరాటం చేశాడు. భారత పేసర్లు ఫాలోఆన్‌లో మరింత రెచ్చిపోయారు. దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్‌ను నిలువునా కూల్చేశారు. ఆటనిలిచే సమయానికి 132 పరుగులకే 8 వికెట్లను పడేశారు. 10 పరుగులే ఇచ్చిన షమీ 3 వికెట్లు తీయగా, ఉమేశ్ 35 పరుగులిచ్చి 2 వికెట్లు తీశారు.



డు ప్లెసిస్ బౌల్డ్

### ఆడింది... హమ్జా ఒక్కడే!

దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో ఓవర్‌నైట్ బ్యాట్స్‌మన్ హమ్జా ఒక్కడే భారత బౌలర్లకు ఎదురు నిలిచాడు. 9/2 ఓవర్‌నైట్ స్కోరుతో తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన సఫారీ జట్టు ఆరంభ ఓవర్లోనే కెప్టెన్ డు ప్లెసిస్ (1) వికెట్‌ను కోల్పోయింది. అతన్ని ఉమేశ్ బౌల్డ్ చేశాడు. హమ్జాకు బవుమా (72 బంతుల్లో 32; 5 ఫోర్లు) జతయ్యాడు. ఇద్దరు కలిసి భారత బౌలర్లను 21 ఓవర్ల పాటు ఆడుకున్నారు. జట్టు స్కోరు 100 పరుగులు దాటాక సఫారీ కష్టాలు మొదలయ్యాయి. వన్డేను తలపించే ఇన్నింగ్స్‌తో అర్ధసెంచరీ పూర్తి చేసుకున్న హమ్జాను జడేజా బోల్తా కొట్టించగా... బవుమాను నదీమ్ ఔట్ చేశాడు. 129/6 స్కోరు వద్ద సఫారీ లంచ్ బ్రేక్‌కు వెళ్లింది. రెండో సెషన్‌లో లిండే (81 బంతుల్లో 37; 3 ఫోర్లు, 1 సిక్స్) టెయిలెండర్లతో కలిసి జట్టును ఆదుకునే ప్రయత్నం చేశాడు. పీట్ (4), రబడ (0) స్వల్ప వ్యవధిలోనే నిష్క్రమించినప్పటికీ... తొమ్మిదో స్థానంలో బ్యాటింగ్‌కు దిగిన నోర్జే (55 బంతుల్లో 4) ఆకట్టుకున్నాడు. నిప్పులు చెరిగే బౌలింగ్‌ను చాలాసేపు ఎదుర్కొన్నాడు. 45వ ఓవర్లో జట్టు స్కోరు 150 పరుగులకు చేరింది. ఆ తర్వాత కాసేపటికే లిండేను ఉమేశ్, నోర్జేను నదీమ్ ఔట్ చేయడంతో దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్ 162 పరుగుల వద్ద ముగిసింది.



ఉమేశ్

### తప్పని తడబాటు...

తొలి ఇన్నింగ్స్‌లో భారత్‌కు 335 పరుగుల ఆధిక్యం లభించింది. దీంతో సఫారీకి ఫాలోఆన్ తప్పలేదు. అయితే వారి రెండో ఇన్నింగ్స్ కూడా కష్టాలతోనే మొదలైంది. రిటైర్డ్‌హర్ట్ ఎల్గర్ (16) మినహా తొలి ఐదుగురు బ్యాట్స్‌మెన్ అంతా 5 పరుగుల్లోపే పెవిలియన్ చేరారు. డికాక్ (5)ను ఉమేశ్ క్లీన్‌బౌల్డ్ చేశాడు. తొలి ఇన్నింగ్స్‌లో జట్టును ఆదుకున్న హమ్జా (0)కు షమీ ఈసారి ఆ అవకాశం ఇవ్వలేదు. ఇదే ఊపులో కెప్టెన్ డుప్లెసిస్ (4)ను షమీ ఎల్బీ చేశాడు. మొత్తానికి మూడో సెషన్‌కు ముందే సఫారీ 4 కీలక వికెట్లను కోల్పోయింది. టీ బ్రేక్ తర్వాత కూడా పర్యాటక జట్టు పరిస్థితిలో ఏ మార్పూ లేదు. లోయర్ మిడిలార్డర్ బ్యాట్స్‌మెన్ లిండే (27), పీట్ (23) నిలబడటంతో జట్టుస్కోరు వందకు చేరింది. ఎల్గర్ స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన బ్రుయిన్ (30 బ్యాటింగ్) అజేయంగా నిలిచాడు. సఫారీ ఇన్నింగ్స్‌లో రెండే వికెట్లు ఉండటంతో మరో అరగంటసేపు ఆటను పొడిగించారు. కానీ బ్రుయిన్... నోర్జే (5 బ్యాటింగ్)తో కలిసి నాటౌట్‌గా నిలవడంతో ఆట మరో రోజు కొనసాగనుంది.

### స్కోరు వివరాలు

**భారత్ తొలి ఇన్నింగ్స్:** 497/9 డిక్లేర్డ్; **దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్:** ఎల్గర్ (సి) సాహా (బి) షమీ 0; డికాక్ (సి) సాహా (బి) ఉమేశ్ 4; హమ్జా (బి) జడేజా 62; డు ప్లెసిస్ (బి) ఉమేశ్ 1; బవుమా (స్టంప్డ్) సాహా (బి) నదీమ్ 32; క్లాసెన్ (బి) జడేజా 6; లిండే (సి) రోహిత్ (బి) ఉమేశ్ 37; పీట్ (ఎల్బీడబ్ల్యూ) (బి) షమీ 4; రబడ రనౌట్ 0; నోర్జే (ఎల్బీడబ్ల్యూ) (బి) నదీమ్ 4; ఇన్‌గిడి (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 12; **మొత్తం (56.2 ఓవర్లలో ఆలౌట్) 162.**
**వికెట్ల పతనం:** 1–4, 2–8, 3–16, 4–107, 5–107, 6–119, 7–129, 8–130, 9–162, 10–162. **బౌలింగ్:** షమీ 10–4–22–2, ఉమేశ్ 9–1–40–3, నదీమ్ 11.2–4–22–2, జడేజా 14–3–19–2, అశ్విన్ 12–1–48–0.
**దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్:** డికాక్ (బి) ఉమేశ్ 5; ఎల్గర్ (రిటైర్డ్ హర్ట్) 16; హమ్జా (బి) షమీ 0; డు ప్లెసిస్ (ఎల్బీడబ్ల్యూ) (బి) షమీ 4; బవుమా (సి) సాహా (బి) షమీ 0; క్లాసెన్ (ఎల్బీడబ్ల్యూ) (బి) ఉమేశ్ 5; లిండే (రనౌట్) 27; పీట్ (బి) జడేజా 23; బ్రుయిన్ (బ్యాటింగ్) 30; రబడ (సి) జడేజా (బి) అశ్విన్ 12; నోర్జే (బ్యాటింగ్) 5; ఎక్స్‌ట్రాలు 5;
**మొత్తం (46 ఓవర్లలో 8 వికెట్లకు) 132.**
**వికెట్ల పతనం:** 1–5, 2–10, 3–18, 4–26, 5–36, 6–67, 7–98, 8–121. **బౌలింగ్:** షమీ 9–5–10–3, ఉమేశ్ 9–1–35–2, జడేజా 13–5–36–1, నదీమ్ 5–0–18–0, అశ్విన్ 10–3–28–1.

**5** ఒకే రోజు ఆటలో 14 అంతకంటే ఎక్కువ వికెట్లు పడగొట్టడం భారత్‌కిది ఐదోసారి. ఈ జాబితాలో 20 వికెట్లు (అఫ్గానిస్తాన్‌పై బెంగళూరులో; 2018) తొలి స్థానంలో ఉండగా... తర్వాతి స్థానాల్లో 17 వికెట్లు (పాకిస్తాన్‌పై ఢిల్లీలో; 1952–53), 16 వికెట్లు (దక్షిణాఫ్రికాపై రాంచీలో; 2019లో), 15 వికెట్లు (శ్రీలంకపై బెంగళూరులో; 1993–94లో), 14 వికెట్లు (వెస్టిండీస్‌పై రాజ్‌కోట్‌లో 2018–19లో) ఉన్నాయి.

**8** ప్రత్యర్థి జట్టును ఎక్కువసార్లు ఫాలోఆన్ ఆడించిన భారత కెప్టెన్‌గా విరాట్ కోహ్లి గుర్తింపు పొందాడు. కోహ్లి సారథ్యంలో ఇప్పటివరకు భారత్ ప్రత్యర్థి జట్టును 8 సార్లు ఫాలోఆన్ ఆడించింది. తర్వాతి స్థానాల్లో అజహరుద్దీన్ (7), ధోని (5), సౌరవ్ గంగూలీ (4) ఉన్నారు.

**2** ఒక సిరీస్‌లో దక్షిణాఫ్రికా జట్టు రెండుసార్లు ఫాలోఆన్ ఆడటం 1964–65 తర్వాత ఇదే తొలిసారి. స్వదేశంలో 1964–65లో ఇంగ్లండ్‌తో జరిగిన ఐదు టెస్టుల సిరీస్‌లో దక్షిణాఫ్రికా చివరిసారి రెండుసార్లు ఫాలోఆన్ ఆడింది.

**4** టెస్టుల్లో స్టంపింగ్ ద్వారా కెరీర్‌లో తొలి వికెట్ తీసిన నాలుగో బౌలర్‌గా షాబాజ్ నదీమ్ గుర్తింపు పొందాడు. గతంలో డబ్ల్యూవీ రామన్ (వాల్ష్–1987–88లో), ఎం.వెంకటరమణ (హేన్స్–1988–89లో), ఆశిష్ కపూర్ (కార్ల్ హూపర్–1994–95లో) ఈ ఘనత సాధించారు.

**2** కొట్నీ వాల్ష్ (వెస్టిండీస్) తర్వాత భారత గడ్డపై వరుసగా ఐదు ఇన్నింగ్స్‌లలో మూడు అంతకంటే ఎక్కువ వికెట్లు తీసిన రెండో బౌలర్‌గా ఉమేశ్ యాదవ్ (6/88, 4/45, 3/37, 3/22, 3/40) గుర్తింపు పొందాడు.



### ఉమేశ్ బౌన్సర్... ఎల్గర్ కన్‌కషన్

**భా**రత సీనియర్ పేసర్ ఉమేశ్ యాదవ్ బౌన్సర్ సఫారీ ఓపెనర్ ఎల్గర్‌ను పడేసింది. అతను వేసిన ఇన్నింగ్స్ పదో ఓవర్లో ఈ ఘటన జరిగింది. ఎల్గర్ 16 పరుగుల వద్ద బ్యాటింగ్ చేస్తుండగా... ఉమేశ్ వేసిన మూడో బంతి అనూహ్యంగా బౌన్స్ అయి బ్యాట్స్‌మన్ చెవి పైభాగాన్ని బలంగా ఢీకొట్టింది. దీంతో అతను పడిపోయాడు. బ్యాటింగ్ చేసే పరిస్థితి లేకపోవడంతో ఐసీసీ కన్‌కషన్ ప్రొటోకాల్ ప్రకారం మ్యాచ్ రిఫరీ ఎల్గర్ స్థానంలో బ్రుయిన్‌ను ఆడించేందుకు అనుమతించారు. ఎల్గర్ గాయం నుంచి కోలుకోవడానికి మరో ఆరు రోజుల సమయం పడుతుందని దక్షిణాఫ్రికా టీమ్ మేనేజ్‌మెంట్ తెలిపింది.

### సాహా స్థానంలో పంత్ కీపింగ్



**టీ**మిండియాకు మరో ఎదురుదెబ్బ. వికెట్ కీపర్ వృద్ధిమాన్ సాహా గాయంతో మైదానం వీడాడు. మూడో రోజు ఆటలో అశ్విన్ వేసిన 27వ ఓవర్ తొలి బంతి గింగిర్లు తిరుగుతూ బౌన్స్ అయింది. క్రీజులో ఉన్న లిండే దాన్ని ఎదుర్కోలేకపోవడంతో బంతిని సాహా అందుకునే ప్రయత్నం చేయగా అతని మునివేళ్లను తాకడంతో గాయపడ్డాడు. నొప్పికి తాళలేకపోయిన సాహా పెవిలియన్ చేరగా అతని స్థానంలో రిషభ్ పంత్ కీపింగ్ చేయాల్సి వచ్చింది.

# సింధుకు మరో సవాల్

**నేటి నుంచి ఫ్రెంచ్ ఓపెన్ టోర్నీ**



**పారిస్:** ప్రపంచ చాంపియన్‌షిప్‌లో స్వర్ణం గెలిచాక ఆడిన మూడు టోర్నమెంట్‌లలోనూ ప్రిక్వార్టర్ ఫైనల్ దాటలేకపోయిన భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు మరో పరీక్షకు సిద్ధమైంది. నేటి నుంచి జరిగే ఫ్రెంచ్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–750 టోర్నీలో ఐదో సీడ్ సింధు టైటిలే లక్ష్యంగా బరిలోకి దిగనుంది. నేడు జరిగే మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ తొమ్మిదో ర్యాంకర్, చైనా సంతతికి చెందిన కెనడా క్రీడాకారిణి మిచెల్లి లీతో సింధు ఆడుతుంది. ముఖాముఖి రికార్డులో సింధు 5–2తో ఆధిక్యంలో ఉంది. గతవారం డెన్మార్క్ ఓపెన్‌లో 17 ఏళ్ల కొరియా అమ్మాయి యాన్ సె యంగ్ చేతిలో అనూహ్యంగా ఓడిపోయిన సింధుకు ఫ్రెంచ్ ఓపెన్‌లోనూ క్లిష్టమైన ‘డ్రా’నే ఎదురైంది. ‘డ్రా’ ప్రకారం సింధుకు క్వార్టర్ ఫైనల్లో టాప్ సీడ్ తై జు యింగ్ (చైనీస్ తైపీ)... సెమీఫైనల్లో రియో ఒలింపిక్స్ చాంపియన్ కరోలినా మారిన్ (స్పెయిన్) లేదా ప్రపంచ మాజీ చాంపియన్స్ ఒకుహారా (జపాన్) లేదా రచనోక్ (థాయ్‌లాండ్) ఎదురయ్యే అవకాశం ఉంది. భారత్‌కే చెందిన మరో స్టార్ ప్లేయర్ సైనా నెహ్వాల్ బుధవారం జరిగే తొలి రౌండ్‌లో చెయుంగ్ ఎన్గాన్ యి (హాంకాంగ్)తో ఆడుతుంది. పురుషుల సింగిల్స్‌లో భారత్ తరపున శ్రీకాంత్, కశ్యప్, సమీర్ వర్మ, శుభాంకర్ డే తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. మంగళవారం జరిగే తొలి రౌండ్‌లో సుగియార్తో (ఇండోనేసియా) తో శుభాంకర్ తలపడతాడు. బుధవారం జరిగే ఇతర మ్యాచ్‌ల్లో రెండో సీడ్ చౌ తియెన్ చెన్ (చైనీస్ తైపీ)తో శ్రీకాంత్; ఎన్జీ కా లాంగ్ అంగుస్ (హాంకాంగ్)తో కశ్యప్; కెంటా నిషిమోటో (జపాన్)తో సమీర్ వర్మ ఆడతారు.

## ఆంధ్రప్రదేశ్ లిఫ్టర్ శ్రీలక్ష్మికి పసిడి పతకం

**బోధ్‌గయా (బిహార్):** జాతీయ జూనియర్, యూత్ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో సోమవారం ఆంధ్రప్రదేశ్ వెయిట్‌లిఫ్టర్లు రెండు పతకాలు సాధించారు. యూత్ బాలికల 76 కేజీల విభాగంలో సీహెచ్ శ్రీలక్ష్మి స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకుంది. ఆమె మొత్తం 154 కేజీల బరువెత్తి అగ్రస్థానాన్ని దక్కించుకుంది. యూత్ బాలుర 96 కేజీల విభాగంలో ఆంధ్రప్రదేశ్‌కే చెందిన ఎం.అశోక్ రజత పతకాన్ని గెల్చుకున్నాడు. అశోక్ మొత్తం 248 కేజీల బరువెత్తి రెండో స్థానంలో నిలిచాడు.

# ముంబై ఆశలపై వర్షం

- ఛత్తీస్‌గఢ్‌తో క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ రద్దు
- లీగ్‌లో ఎక్కువ విజయాలతో సెమీస్ చేరిన ఛత్తీస్‌గఢ్
- విజయ్ హజారే ట్రోఫీ

**ఆలూరు (బెంగళూరు):** విజయ్ హజారే ట్రోఫీ దేశవాళీ వన్డే టోర్నీలో ముంబై సెమీస్ చేరే అవకాశాన్ని వర్షం అడ్డుకుంది. ఛత్తీస్‌గఢ్‌తో జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో ముంబై విజయం దిశగా సాగుతున్న దశలో వర్షం రావడం... వాన ఎంతకూ తగ్గకపోవడంతో చివరకు మ్యాచ్‌లో ఎలాంటి ఫలితం రాకుండానే రద్దయింది. దాంతో నిబంధనల ప్రకారం లీగ్ దశలో ముంబై (4) కంటే ఎక్కువ విజయాలు సాధించిన ఛత్తీస్‌గఢ్ (5)కు సెమీఫైనల్ బెర్త్ ఖాయమైంది. తొలుత బ్యాటింగ్ చేసిన ఛత్తీస్‌గఢ్ 45.4 ఓవర్లలో 6 వికెట్లకు 190 పరుగులతో ఉన్న సమయంలో వాన కురవడంతో మ్యాచ్‌కు అంతరాయం ఏర్పడింది. దీంతో వీజేడీ పద్ధతి ద్వారా ముంబై లక్ష్యాన్ని 40 ఓవర్లలో 192 పరుగులుగా నిర్ణయించారు. లక్ష్య ఛేదనలో



యశస్వి

ముంబై 11.3 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 95 పరుగులతో ఉండగా... వర్షం రావడంతో ఆట సాధ్యపడలేదు. ఓపెనర్ యశస్వి జైస్వాల్ (38 బంతుల్లో 60 నాటౌట్; 5 ఫోర్లు, 5 సిక్స్‌లు) ధాటిగా ఆడాడు. తమిళనాడు, పంజాబ్ మధ్య జరగాల్సిన మరో క్వార్టర్స్ మ్యాచ్ కూడా వర్షం కారణంగానే రద్దయింది. మొదట తమిళనాడు వర్షం అంతరాయం కలిగించే సమయానికి 39 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 174 పరుగులు చేసింది. పంజాబ్ 12.2 ఓవర్లలో 2 వికెట్లకు 52 పరుగులతో ఉన్న సమయంలో వాన కారణంగా మ్యాచ్ రద్దయింది. దీంతో లీగ్ దశలో పంజాబ్ (5) విజయాల కంటే ఎక్కువ విజయాలు నమోదు చేసిన తమిళనాడు (9) సెమీస్ చేరింది. 23న జరిగే సెమీఫైనల్స్‌లో కర్ణాటకతో ఛత్తీస్‌గఢ్; గుజరాత్‌తో తమిళనాడు తలపడతాయి.

## బెంగళూరును నిలువరించిన నార్త్ ఈస్ట్ యునైటెడ్

**బెంగళూరు:** డిఫెండింగ్ చాంపియన్‌గా ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్‌ఎల్) సీజన్–6లో అడుగుపెట్టిన బెంగళూరు ఎఫ్‌సీ అదిరే ఆరంభం చేయలేకపోయింది. సోమవారం నార్త్ ఈస్ట్ యునైటెడ్‌తో జరిగిన మ్యాచ్‌ను ‘డ్రా’గా ముగించింది. నిర్ణీత సమయంలో ఇరు జట్లు గోల్ సాధించకపోవడంతో మ్యాచ్ 0–0తో ముగిసింది. ఇరు జట్లకు గోల్ చేసేందుకు పలు అవకాశాలు వచ్చినా వాటిని సద్వినియోగం చేసుకోలేదు. రెండో అర్ధభాగంలో నార్త్ ఈస్ట్ ఆటగాడు అసమో గ్యన్ కొట్టిన షాట్ బెంగళూరు గోల్‌పోస్ట్ క్రాస్‌బార్‌ను తగిలి పక్కకు వెళ్లింది. చివర్లో బెంగళూరు సారథి సునీల్ ఛెత్రి గోల్ కోసం చేసిన ప్రయత్నాలు కూడా విఫలమయ్యాయి.

## క్వార్టర్స్‌లో అమిత్



**వుహాన్ (చైనా):** ప్రపంచ మిలిటరీ క్రీడల్లో భారత స్టార్ బాక్సర్ అమిత్ పంఘాల్ క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించాడు. సోమవారం జరిగిన పురుషుల 51 కేజీల విభాగం రెండో రౌండ్‌లో అమిత్ 4–1తో బుగాన్మి బిలాల్ (ట్యూనిషియా)పై గెలుపొందాడు. 49 కేజీల విభాగం రెండో రౌండ్‌లో దీపక్ 5–0తో ఎన్గుయెన్ లిన్ ఫుంగ్ (వియత్నాం)ను ఓడించి క్వార్టర్ ఫైనల్‌కు చేరాడు. 56 కేజీల విభాగం రెండో రౌండ్ బౌట్‌లో చిరాగ్ 5–0తో బొనిలా జోనెన్ (వెనిజులా)పై గెలిచి క్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టాడు.

## రాజస్తాన్ రాయల్స్ హెడ్ కోచ్‌గా మెక్‌డొనాల్డ్



**ముంబై:** ఐపీఎల్ ఫ్రాంచైజీ రాజస్తాన్ రాయల్స్ తమ హెడ్ కోచ్‌గా ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ ఆండ్రూ మెక్‌డొనాల్డ్‌ను సోమవారం నియమించింది. అతడు మూడు సంవత్సరాల పాటు కోచ్‌గా కొనసాగుతాడు. ఆస్ట్రేలియా తరపున నాలుగు టెస్టు మ్యాచ్‌లు ఆడిన ఈ ఆల్‌రౌండర్ 2009లో ఢిల్లీ డేర్‌డెవిల్స్‌కు, 2012–13 సీజన్‌ల్లో బెంగళూరు జట్లకు ఆడాడు. అనంతరం అతను విక్టోరియా, లెస్టర్‌షైర్, మెల్‌బోర్న్ రెనెగేడ్స్‌లకు కోచ్‌గా వ్యవహరించాడు. ఈ ఏడాది బిగ్ బాష్ లీగ్ చాంపియన్‌గా రెనెగేడ్స్‌ను నిలపడంలో మెక్‌డొనాల్డ్ ముఖ్యపాత్ర పోషించాడు.

# బంగ్లాదేశ్ వస్తుందా భారత్‌కు?

**బంగ్లా క్రికెటర్ల సమ్మెబాట**

**ఢాకా:** భారత్‌లో బంగ్లా పర్యటనకు ఇంకా రోజుల వ్యవధే ఉంది కానీ... ఆటగాళ్ల అనూహ్య నిర్ణయం ఈ సిరీస్‌ను సందిగ్ధంలో పడేసింది. బంగ్లాదేశ్ ఆటగాళ్లు ఉన్నపళంగా సమ్మెబాట పట్టారు. కాంట్రాక్టు మొత్తాల పెంపుతో పాటు తమ డిమాండ్లు తీర్చకపోతే ఏ స్థాయి క్రికెటైనా ఆడబోమని మీడియా సమావేశంలో తెగేసి చెప్పారు. సమ్మె బావుట ఎగరేసిన వారిలో మేటి క్రికెటర్లు కెప్టెన్ షకీబుల్ హసన్, మహ్మదుల్లా, ముష్ఫికర్ రహీమ్ సహా మొత్తం 50 మంది ఆటగాళ్లున్నారు. దీంతో జాతీయ క్రికెట్ లీగ్‌తో పాటు భారత పర్యటనకు ఆటగాళ్ల సమ్మె దెబ్బ తగలనుంది.



షకీబ్

వచ్చే నెల 3 నుంచి భారత్‌లో బంగ్లా పర్యటన మొదలవుతుంది. ఇందులో ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్‌లో భాగమైన 2 టెస్టుల సిరీస్, మూడు టి20లు ఆడనుంది. అంతకంటే ముందే బంగ్లాలో శిక్షణ శిబిరం మొదలు కావాల్సి ఉంది. ఈ పరిణామాలపై భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) కాబోయే అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ స్పందించాడు. ‘ఇది పూర్తిగా బంగ్లా క్రికెట్ బోర్డు (బీసీబీ) అంతర్గత వ్యవహారం. బీసీసీఐ పరిధిలో లేని అంశం. ఏదేమైనా సిరీస్ జరగాలనే ఆశిస్తున్నా’ అని అన్నాడు. ఈ పర్యటనలో ఇరు జట్ల మధ్య కోల్‌కతాలో ఓ టెస్టు జరగనుంది. ఒకవేళ సిరీస్ జరగకపోతే అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) పూర్తి పాయింట్ల (120)ను భారత్‌కే కేటాయిస్తుంది.

epaper.sakshi.com

సాక్షి బిజినెస్
మంగళవారం
22-10-2019
WWW.SAKSHIBUSINESS.COM

## స్టాక్ మార్కెట్లు

**దేశీ సూచీలు** (శుక్రవారం ముగింపు)

| | సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|---|
| మార్పు | 246 ▲ | 76 ▲ |
| ముగింపు | 39,298 | 11,662 |

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

**విదేశీ సూచీలు** (తొలి రెండు రాత్రి 11.30గం॥లకు)

| | | | |
|---|---|---|---|
| నాస్‌డాక్ | 7,930 | ▲ | 62 |
| డోజోన్స్ | 26,792 | ▲ | 22 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,164 | ▲ | 13 |
| డాక్స్ | 12,748 | ▲ | 114 |
| షాంఘై | 2,940 | ▲ | 1 |
| నికాయ్ | 22,549 | ▲ | 56 |

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

## ఫారెక్స్ రేట్లు రూ. లలో

| | | ● కొనుగోలు | ● అమ్మకం |
|---|---|---|---|
| యూఎస్ డాలర్ | ఎస్‌బీఐ | 70.40 | 72.04 |
| బ్రిటన్ పౌండ్ | ఎస్‌బీఐ | 89.94 | 93.15 |
| యూరో | ఎస్‌బీఐ | 77.79 | 80.68 |
| జపాన్ ఎన్ (100) | ఎస్‌బీఐ | 64.39 | 66.83 |
| ఆస్ట్రేలియా డాలర్ | ఎస్‌బీఐ | 47.63 | 49.78 |
| సింగపూర్ డాలర్ | ఎస్‌బీఐ | 51.29 | 53.07 |
| సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 18.18 | 19.79 |
| యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 18.91 | 19.91 |
| చైనా యువాన్ | థామస్‌కుక్ | 9.42 | 10.83 |

# ఇన్ఫీలో మరో దుమారం!

- కొన్ని త్రైమాసికాలుగా అకౌంటింగ్‌లో అవకతవకలు
- సీఈవో, సీఎఫ్‌వోలపై కొందరు ఉద్యోగుల ఆరోపణలు
- ఆదాయాలు, లాభాలు పెంచి చూపుతున్నారని ఫిర్యాదు

**బెంగళూరు:** ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ మరోసారి 'అనైతిక విధానాల' ఆరోపణల్లో చిక్కుకుంది. సీఈవో సలీల్ పరేఖ్, సీఎఫ్‌వో నీలాంజన్ రాయ్ స్వల్పకాలికంగా ఆదాయాలు, లాభాలను పెంచి చూపించేందుకు అనైతిక విధానాలు పాటిస్తున్నట్లు పేరు వెల్లడించని కొందరు ఉద్యోగులు ఇన్ఫీ బోర్డుకు ఫిర్యాదు చేశారు. 'ఇటీవలి కొన్ని త్రైమాసికాలుగా సీఈవో పాటిస్తున్న అనైతిక విధానాలను మీ దృష్టికి తేగోరుచున్నాము. స్వల్పకాలికంగా ఆదాయాలు, లాభాలు పెంచి చూపేందుకు ప్రస్తుత త్రైమాసికంలో కూడా అలాంటి విధానాలే పాటిస్తున్నారు. బోర్డు తక్షణమే విచారణ జరిపి, చర్యలు తీసుకుంటుందని ఆశిస్తున్నాం' అంటూ సెప్టెంబర్ 20న డైరెక్టర్స్ బోర్డుకు వారు లేఖ రాశారు. ఇందుకు సంబంధించిన ఈ–మెయిల్స్, వాయిస్ రికార్డింగ్స్ కూడా తమ దగ్గర ఉన్నట్లు తెలిపారు. అందులో తమను తాము 'నైతికత గల ఉద్యోగులుగా' ఫిర్యాదుదారులు పేర్కొన్నారు. మరోవైపు, ప్రజావేగుల ఫిర్యాదును కంపెనీ పాలసీ ప్రకారం ఆడిట్ కమిటీ ముందు ఉంచినట్లు ఇన్ఫోసిస్ ఒక ప్రకటనలో తెలిపింది.

> **గతంలో కూడా ఇన్ఫీ.. కార్పొరేట్ గవర్నెన్స్ లోపాల ఆరోపణలు ఎదుర్కొన్న సంగతి తెలిసిందే. ఇజ్రాయెలీ టెక్నాలజీ సంస్థ పనయా కొనుగోలులో అవకతవకలు జరిగాయంటూ ప్రజావేగుల ఆరోపణలు వచ్చిన దరిమిలా అప్పటి సీఈవో విశాల్ సిక్కా, ఎన్ఆర్ నారాయణ మూర్తి తదితర వ్యవస్థాపకుల మధ్య వివాదం తలెత్తింది. చివరికి 2017 ఆగస్టులో సిక్కా వైదొలిగారు. ఆయన స్థానంలో గతేడాది జనవరిలో పగ్గాలు చేపట్టిన సలిల్ పరేఖ్ కూడా తాజాగా గవర్నెన్స్ లోపాల ఆరోపణల్లో చిక్కుకోవడం గమనార్హం.**

**అమెరికాలోనూ ఫిర్యాదు..**

గడిచిన రెండు త్రైమాసికాలుగా ఇన్ఫీ ఖాతాలు, ఆర్థిక ఫలితాల్లో అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ అమెరికాలోని 'విజిల్ బ్లోయర్ ప్రొటెక్షన్ ప్రోగ్రాం'కు కూడా ప్రజావేగులు ఫిర్యాదు చేశారు. లాభాలను పెంచి చూపడం కోసం వీసా ఖర్చుల్లాంటి వ్యయాలను పూర్తిగా చూపించొద్దంటూ తమకు ఆదేశాలు వచ్చినట్లు పేర్కొన్నారు. 'ఈ సంభాషణకు సంబంధించిన వాయిస్ రికార్డింగ్స్ మా దగ్గర ఉన్నాయి. ఆడిటరు వ్యతిరేకించడంతో దీన్ని వాయిదా వేశారు' అని తెలిపారు. ఈ క్వార్టర్‌లోనూ లాభాలు తగ్గిపోయి, స్టాక్ ధరపై ప్రతికూల ప్రభావం చూపుతుందనే ఉద్దేశంతో ఓ కాంట్రాక్టుకు సంబంధించి 50 మిలియన్ డాలర్ల చెల్లింపులను ఖాతాల్లో చూపొద్దంటూ చాలా ఒత్తిడి తెస్తున్నారని ఫిర్యాదుదారులు తెలిపారు. కీలకమైన సమాచారాన్ని ఆడిటర్లు, బోర్డుకు తెలియకుండా తొక్కిపెట్టి ఉంచడం జరుగుతోందని తెలిపారు.

**సీఈవోనే నిబంధనలు ఉల్లంఘిస్తున్నారు..**

'భారీ డీల్స్ కుదుర్చుకోవడంలో బోలెడు అవకతవకలు జరుగుతున్నాయి. సీఈవో అన్ని నిబంధనలను తుంగలో తొక్కుతున్నారు. భారీ మార్జిన్లు వస్తున్నాయని తప్పుదోవ పట్టించేలా నివేదికలు తయారు చేయాలంటూ సేల్స్ టీమ్‌ను ఆదేశిస్తున్నారు. సీఎఫ్‌వో కూడా ఆయన చెప్పినట్లే చేస్తున్నారు. భారీ డీల్స్‌లో లొసుగులు బోర్డు సమావేశాల్లో ప్రస్తావనకు తేనివ్వకుండా మమ్మల్ని ఆపేస్తున్నారు. బోర్డు సభ్యులకివేవీ పట్టవని.. షేరు ధర బాగుంటే వాళ్లకు సరిపోతుందని సీఈవో మాతో చెప్పారు' అని ఫిర్యాదుదారులు తీవ్ర ఆరోపణలు చేశారు. గత కొన్ని త్రైమాసికాలుగా కుదుర్చుకున్న బిలియన్ల డాలర్ల డీల్స్‌లో పైసా మార్జిన్ లేదని పేర్కొన్నారు. చాలా మటుకు సమాచారాన్ని ఆడిటర్లకు చెప్పకుండా దాచిపెట్టేస్తున్నారని, కేవలం లాభాలు, సానుకూల అంశాలే ఆర్థిక ఫలితాల్లో చూపాలని సీఈవో, సీఎఫ్‌వో ఒత్తిడి తెస్తున్నారని ఫిర్యాదుదారులు ఆరోపించారు. దీన్ని వ్యతిరేకించే ఉద్యోగులను పక్కన పెడుతున్నారని, ఫలితంగా వారిలో చాలా మంది సంస్థ నుంచి నిష్క్రమించాల్సి వచ్చిందని తెలిపారు.



సలీల్ పరేఖ్



నీలాంజన్ రాయ్

**ఇన్ఫీ ఏడీఆర్ క్రాష్...**

తాజా పరిణామాలతో అమెరికా నాస్‌డాక్‌లో లిస్టయిన ఇన్ఫోసిస్ ఏడీఆర్ (అమెరికన్ డిపాజిటరీ రిసీట్) సోమవారం కుప్పకూలింది. ఒక దశలో ఏకంగా 16 శాతం క్షీణించింది.

## జియో కొత్త ప్యాకేజీలు

- రూ. 222 నుంచి రూ. 444 ప్యాక్‌లు
- ఇతర నెట్‌వర్క్‌లకు ఐయూసీ చార్జీల సర్దుబాటు

**న్యూఢిల్లీ:** ఇంటర్‌కనెక్ట్ యూసేజీ చార్జీల (ఐయూసీ) విధింపుపై వ్యతిరేకత వస్తున్న నేపథ్యంలో టెలికం సంస్థ రిలయన్స్ జియో సవరించిన కొత్త టారిఫ్ ప్యాకేజీలను ప్రకటించింది. చార్జీలను సర్దుబాటు చేసే విధంగా వీటిని ప్రవేశపెట్టింది. 'రోజుకు 2 జీబీ డేటా ప్యాక్ పరిమితి ఉండే మూడు నెలల ప్యాకేజీ ధరను రూ. 448 నుంచి రూ. 444కి తగ్గిస్తున్నాం. ఇతర నెట్‌వర్క్‌లకు 1,000 నిమిషాల కాల్స్‌కు సరిపడా టాక్ టైమ్ (ఐయూసీ మినిట్స్) ఇందులో ఉంటుంది. సాధారణంగా ఈ ఐయూసీ మినిట్స్‌ను విడిగా కొనుగోలు చేయాలంటే అదనంగా రూ.80 చెల్లించాల్సి వస్తుంది' అని జియో ఒక ప్రకటనలో తెలిపింది. ఇక, రెండు నెలల ప్లాన్ గడువుండే ప్లాన్ రేటును రూ. 333కి తగ్గించడంతో పాటు ఇతర నెట్‌వర్క్‌లకు అవుట్‌గోయింగ్ కాల్స్‌కు సంబంధించి 1,000 నిమిషాలు పొందవచ్చు. మరోవైపు, ఒక నెల గడువుండే ప్లాన్ రేటును రూ. 198 నుంచి రూ. 222కి పెంచిన జియో, రూ. 80 విలువ చేసే ఐయూసీ మినిట్స్‌ను ఈ ప్యాక్‌లో చేర్చింది. ఇతర నెట్‌వర్క్‌ల నుంచి వచ్చే కాల్స్‌ను స్వీకరించినందుకు గాను టెల్కోలు పరస్పరం చెల్లించుకునే చార్జీలను ఐయూసీగా వ్యవహరిస్తారు. ఇది ప్రస్తుతం నిమిషానికి 6 పైసలుగా ఉంది.



## ఆఫ్‌లైన్ దుకాణాల్లో ఆఫర్ల ఉత్సవం

**న్యూఢిల్లీ:** ఆఫ్‌లైన్ రిటైల్ దుకాణాలకు సంబంధించి దేశంలోనే మొదటిసారిగా మ్యాజిక్‌పిన్ సంస్థ ఆఫర్ల ఉత్సవాన్ని నిర్వహిస్తోంది. ఆఫ్‌లైన్ కొనుగోళ్లపై రివార్డులను అందిస్తున్నట్టు తెలిపింది. మ్యాజిక్‌పిన్ దివాళీ వీక్ పేరుతో ఈ నెల 19 నుంచి 26 వరకు ఉత్సవాన్ని నిర్వహిస్తోంది. ఫ్యాషన్, ఎలక్ట్రానిక్స్, ఆహారం, పానీయాలు, గ్రోసరీ, బ్యూటీ, ఫిట్‌నెస్ తదితర కొనుగోళ్లపై ఈ ఆఫ్లను పొందొచ్చు. మ్యాజిక్‌పిన్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, తమ సమీపంలోని దుకాణాల్లో ఉన్న ఆఫర్ల వివరాలు తెలుసుకోవచ్చని కంపెనీ తెలిపింది.

## బోర్డ్ మీటింగ్స్

యాక్సిస్ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, ఏషియన్ పెయింట్స్, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఆర్‌బీఎల్ బ్యాంక్, మహీంద్రా అండ్ మహీంద్రా ఫైనాన్షియల్ సర్వీసెస్, ఐసీఐసీఐ సెక్యూరిటీస్, ఓరియంటల్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, ఇండియామార్ట్ ఇంటర్‌మెష్, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ, జుబిలంట్ ఫుడ్ వర్క్స్, సీసీఎల్ ప్రొడక్ట్స్, సియట్

## కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 22-10-2019

| | |
|---|---|
| విశాఖ | 380–00 |
| చిత్తూరు | 398–00 |
| వరంగల్ | 376–00 |
| చెన్నై | 405–00 |
| ముంబై | 425–00 |
| **21–10–2019 ఫామ్ ధర...** | |
| హైదరాబాద్ | 373–00 |
| రిటైల్ (ఒక గుడ్డుకు) | 4.30 |
| విజయవాడ | 380–00 |
| నమక్కల్ | 402–00 |
| గోదావరి | 380–00 |
| బెంగళూరు | 387–00 |
| కోల్‌కతా | 410–00 |
| ఢిల్లీ | 400–00 |

## బులియన్ రూ.లలో

| | |
|---|---|
| **చెన్నై** | |
| బంగారం (24 క్యారెట్లు) | 38,180 |
| బంగారం (22 క్యారెట్లు) | 36,400 |
| వెండి (కిలో) | 49,163 |
| **హైదరాబాద్** | |
| బంగారం (24 క్యారెట్లు) | 38,180 |
| బంగారం (22 క్యారెట్లు) | 36,400 |
| వెండి (కిలో) | 49,163 |
| **ప్రొద్దుటూరు** | |
| బంగారం (24 క్యారెట్లు) | 38,550 |
| బంగారం (22 క్యారెట్లు) | 35,730 |
| వెండి (కిలో) | 46,800 |
| **ఏపీ బులియన్ అసోసియేషన్** | |
| బంగారం (24 క్యారెట్లు) | 39,540 |
| బంగారం (22 క్యారెట్లు) | 36,570 |
| వెండి (కిలో) | 47,100 |

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

## అల్ట్రాటెక్ సిమెంట్ లాభం 63% అప్

- రూ.9,620 కోట్లకు మొత్తం ఆదాయం
- 1 శాతం తగ్గిన దేశీయ అమ్మకాలు
- రూ.940 కోట్ల పెట్టుబడులు

**న్యూఢిల్లీ:** ఆదిత్య బిర్లా గ్రూప్‌నకు చెందిన అల్ట్రాటెక్ సిమెంట్ నికర లాభం ఈ ఆర్థిక సంవత్సరం(2019–20) రెండో త్రైమాసిక కాలంలో 63 శాతం పెరిగింది. గత ఆర్థిక సంవత్సరం(2018–19) క్యూ2లో రూ.356 కోట్లుగా ఉన్న నికర లాభం ఈ క్యూ2లో రూ.579 కోట్లకు పెరిగిందని అల్ట్రాటెక్ సిమెంట్ తెలిపింది. కార్యకలాపాల ఆదాయం రూ.9,249 కోట్ల నుంచి రూ.9,620 కోట్లకు పెరిగిందని పేర్కొంది. దేశీయ అమ్మకాలు మాత్రం 17.4 మిలియన్ టన్నుల నుంచి 1.2% తగ్గి 17.19 మిలియన్ టన్నులకు తగ్గిందని తెలిపింది. గత క్యూ2లో రూ.8,868 కోట్లుగా ఉన్న మొత్తం వ్యయాలు ఈ క్యూ2లో రూ.8,878 కోట్లకు పెరిగాయని పేర్కొంది.

**నికర లాభం రెట్టింపు...**

ఇక ఈ ఆర్థిక సంవత్సరం తొలి 6 నెలలను పరిగణనలోకి తీసుకుంటే, ఈ కంపెనీ నికర లాభం రెట్టింపైంది. గత ఆర్థిక సంవత్సరం తొలి అర్థభాగంలో రూ.941 కోట్లుగా ఉన్న నికర లాభం ఈ ఆర్థిక సంవత్సరం తొలి అర్థభాగంలో రూ.1,860 కోట్లకు పెరిగిందని కంపెనీ వెల్లడించింది. కార్యకలాపాల ఆదాయం రూ.18,794 కోట్ల నుంచి 12% వృద్ధితో రూ.21,025 కోట్లకు పెరిగిందని పేర్కొంది. ప్రీమియమ్ ఉత్పత్తుల తయారీ కోసం రూ.940 కోట్ల పెట్టుబడుల పెట్టడానికి డైరెక్టర్ల బోర్డ్ ఆమోదం తెలిపిందని వెల్లడించింది. ఒడిశాలో కొత్త గ్రైండింగ్ ప్లాంట్‌ను, బిహార్, పశ్చిమ బెంగాల్‌లోని గ్రైండింగ్ ప్లాంట్ల విస్తరణకు ఈ పెట్టుబడులను వినియోగిస్తామని తెలిపింది. దీంతో తూర్పు భారత దేశ మార్కెట్లో తమ పరిస్థితి మరింతగా పటిష్టమవుతుందని పేర్కొంది. రానున్న కాలంలో సిమెంట్‌కు డిమాం డ్ సాధా రణంగానే ఉండగలదని ఈ కంపెనీ అంచనా వేస్తోంది.



**మూడో అతి పెద్ద సిమెంట్ కంపెనీ !**

ఈ కంపెనీ కొనుగోలు చేసిన సెంచురీ టెక్స్‌టైల్స్ సిమెంట్ వ్యాపారం సంబంధిత ఫలితాలు కూడా ఈ క్యూ2 ఫలితాల్లో కలగలసి ఉన్నాయి. సెంచురీ టెక్స్‌టైల్స్ సిమెంట్ వ్యాపారం కొనుగోలుతో ప్రపంచంలోనే మూడో అతి పెద్ద సిమెంట్ కంపెనీగా(చైనా మినహాయించి) అల్ట్రాటెక్ సిమెంట్ నిలిచింది. అంతే కాకుండా ఒకే దేశంలో(చైనా మినహాయించి) 10 కోట్ల టన్నుల వార్షిక ఉత్పత్తి సామర్థ్యం గల సిమెంట్ కంపెనీగా కూడా అల్ట్రాటెక్ సిమెంట్ అవతరించింది.

## భారతీ ఇన్‌ఫ్రాటెల్ లాభం రూ.964 కోట్లు

- క్యూ2లో 61 శాతం వృద్ధి
- 93,421కు చేరిన మొత్తం టవర్లు

**న్యూఢిల్లీ:** భారతీ ఎయిర్‌టెల్‌కు చెందిన మొబైల్ టవర్ల విభాగం, భారతీ ఇన్‌ఫ్రాటెల్ కంపెనీ నికర లాభం ఈ ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్ క్వార్టర్లో 61% పెరిగింది. గత ఆర్థిక సంవత్సరం క్యూ2లో రూ.600 కోట్లుగా ఉన్న బ్యాంక్ నికర లాభం ఈ క్యూ2లో రూ.964 కోట్లకు పెరిగిందని భారతీ ఇన్‌ఫ్రాటెల్ తెలిపింది. ఆదాయం మాత్రం స్వల్పంగా తగ్గిందని కంపెనీ చైర్మన్ అఖిల్ గుప్తా తెలిపారు. గత క్యూ2లో రూ.3,668 కోట్లుగా ఉన్న ఆదాయం ఈ క్యూ2లో రూ.3,438 కోట్లకు తగ్గిందని పేర్కొన్నారు. టవర్ల సంఖ్య 1,298 పెరిగి 93,421కు పెరిగిందని తెలిపారు. టవర్లు, కో లొకేషన్ల సంఖ్య ప్రతి క్వార్టర్‌కు పెరుగుతూనే ఉందని వివరించారు. డేటా వినియోగం జోరుగా పెరుగుతుండటంతో టవర్ల ఇన్‌ఫ్రా కూడా మంచి వృద్ధిని సాధించగలదన్న నమ్మకం ఉందన్నారు.




## నేడు దేశవ్యాప్తంగా బ్యాంకుల సమ్మె

- విలీనాలు, ఇతర అంశాలకు నిరసన
- సమ్మె ప్రభావం స్వల్పమేనంటున్న ఎస్‌బీఐ

**న్యూఢిల్లీ/కోల్‌కతా:** బ్యాంక్‌ల విలీనానికి నిరసనగా నేడు(మంగళవారం) కొన్ని బ్యాంక్ యూనియన్లు సమ్మె చేయనున్నాయి. దీంతో ప్రభుత్వ రంగ బ్యాంక్ సర్వీసులకు అంతరాయం ఏర్పడనున్నది. బ్యాంక్‌ల విలీనాలు, డిపాజిట్ల రేట్ల తగ్గింపు, ఉద్యోగ భద్రతకు సంబంధించిన కొన్ని అంశాలపై నిరసన తెలియజేస్తూ ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్(ఏఐబీఈఏ), బ్యాంక్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(బీఈఎఫ్ఐ)లు బ్యాంక్ యూనియన్లు జాతీయ స్థాయిలో 24 గంటల సమ్మెకు పిలుపునిచ్చాయి. అయితే బ్యాంక్ ఆఫీసర్లు, ప్రైవేట్ రంగ బ్యాంక్‌లు, ఈ సమ్మెలో పాల్గొనడం లేదు. ప్రాంతీయ గ్రామీణ బ్యాంక్‌లు, సహకార బ్యాంక్‌లు కూడా ఈ సమ్మెలో పాల్గొనడం లేదు. బ్యాంక్‌ల విలీనం వీటిపై ఎలాంటి ప్రభావం చూపనందున ఇవి ఈ సమ్మెలో పాల్గొనడం లేదు.




**సమ్మె కొనసాగుతుంది....**

ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ ప్రతినిధులతో చీఫ్ లేబర్ కమిషనర్ సమక్షంలో జరిగిన చర్చలు విఫలమయ్యాయని ఏఐబీఈఏ ప్రధాన కార్యదర్శి సీ.హెచ్. వెంకటాచలమ్ పేర్కొన్నారు. అందుకని సమ్మె కొనసాగుతుందని తెలిపారు. సమ్మె పరిధిలోనే ఉన్నందున ఏటీఎమ్‌లను కూడా మూసేస్తామని బ్యాంక్ యూనియన్లు పేర్కొన్నాయి. కొన్ని బ్యాంక్ ఉద్యోగాలను అవుట్‌సోర్సింగ్‌కు ఇవ్వడం, బ్యాంకింగ్ రంగాన్ని ప్రైవేటీకరించడాన్ని ఈ యూనియన్లు వ్యతిరేకిస్తున్నాయి. తగిన స్థాయిల్లో బ్యాంక్ క్లర్క్‌లను నియమించాలని, భారీగా పేరుకుపోతున్న మొండిబకాయిల రికవరీకి గట్టి చర్యలను తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి.

**ప్రభావం స్వల్పమే !..**

పలు బ్యాంక్‌లు ఇప్పటికే సమ్మె విషయమై తమ ఖాతాదారులను అప్రమత్తం చేశాయి. సమ్మెకు పిలుపునిచ్చిన బ్యాంక్ సంఘాల్లో తమ ఉద్యోగుల సభ్యత్వం తక్కువగా ఉందని, ఈ సమ్మె ప్రభావం బ్యాంక్ కార్యకలాపాలపై స్వల్పంగానే ఉంటుందని ఎస్‌బీఐ వెల్లడించింది. సమ్మె కారణంగా ఖాతాదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని సిండికేట్ బ్యాంక్ పేర్కొంది. అయితే సమ్మె జరిగితే, కార్యకలాపాలపై ప్రభావం ఉండగలదని వివరించింది. గత నెలలో 26, 27 తేదీల్లో బ్యాంక్‌ల సమ్మెకు ఆఫీసర్ల యూనియన్లు పిలుపునిచ్చాయి. కానీ, ప్రభుత్వం జోక్యం చేసుకోవడంతో ఆ యూనియన్లు సమ్మెను విరమించాయి.

## ఆర్థిక మందగమనంలోనూ కుటుంబ సంపద రెట్టింపు

**ముంబై:** ఒకవైపు దేశ ఆర్థిక వృద్ధి రేటు ఆరేళ్ల కనిష్ట స్థాయిలో 5%కి జూన్ త్రైమాసికంలో తగ్గిపోయింది. అయినా మరోవైపు 2019లో కుటుంబ సంపద మాత్రం రెట్టింపై 12.6 లక్షల కోట్ల డాలర్లకు చేరినట్టు స్విస్ బ్యాంకు క్రెడిట్‌సూసే నివేదిక తెలిపింది. ఆర్థికపరమైన ఆస్తులతోపాటు రియల్టీ, బంగారం, ఇతర ప్రాపర్టీల రూపంలోని ఆస్తుల మొత్తం ఇది. 2018లో దేశంలోని కుటుంబాల సంపద 5.972 లక్షల కోట్ల డాలర్లు. 2000 నుంచి 2019 మధ్య దేశంలోని కుటుంబాల సంపద 4 రెట్లు పెరిగిందని, వచ్చే నాలుగేళ్లలో ప్రస్తుత సంపద మరో 4.4 లక్షల కోట్ల డాలర్ల మేర పెరగగలదని క్రెడిట్‌సూసే నివేదిక అంచనా వేసింది. ఒక్కో వయోజనుని సంపద 14,569 డాలర్లుగా ఉందని తెలిపింది. ఆర్థికపరమైన ఆస్తుల వృద్ధి 1.4% కాగా, ఆర్థికేతర ఆస్తుల్లో వృద్ధి మాత్రం 6.9%గా ఉన్నట్టు ఈ నివేదిక పేర్కొంది.



## పుత్తడి బాండ్ల ఇష్యూ ధర.. రూ.3,835

- ఆన్‌లైన్‌లో కొనుగోలు చేస్తే రూ.50 డిస్కౌంట్
- ఈ నెల 25న ముగింపు

**న్యూఢిల్లీ:** పుత్తడి బాండ్ల ఆరో దఫా జారీని కేంద్రం సోమవారం ప్రారంభించింది. ధన్‌తేరస్ సందర్భంగా పుత్తడి కొనుగోళ్లు జోరుగా జరుగుతాయనే అంచనాలతో ఈ సావరిన్ గోల్డ్ బాండ్లు (ఎస్‌జీబీ) జారీని కేంద్రం ప్రారంభించింది. ఈ సావరిన్ గోల్డ్ బాండ్ స్కీమ్ 2019–20–సిరీస్ సిక్స్.... ధన్‌తేరస్ రోజునే (ఈ నెల25న) ముగుస్తుంది. ఈ స్కీమ్‌లో ఒక్కో గ్రామ్ ధరను రూ.3,835గా కేంద్రం నిర్ణయించింది. ఆన్‌లైన్ ద్వారా ఈ బాండ్లను కొనుగోలు చేసేవాళ్లకు రూ.50 డిస్కౌంట్ లభించనున్నది. సావరిన్ గోల్డ్ బాండ్ స్కీమ్‌ను కేంద్ర ప్రభుత్వం 2015, నవంబర్‌లో ఆరంభించింది. ఆభరణాలు, బిస్కెట్లు.. ఇలా భౌతిక రూపంలో బంగారం కొనుగోళ్లను తగ్గించి, దేశీయ పొదుపులను ఆర్థిక ఆదాలుగా మార్చే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఈ స్కీమ్‌ను తెచ్చింది. ఈ స్కీమ్‌లో భాగంగా ఒక్క గ్రామ్, అంతకు మించిన గ్రామ్‌ల డినామినేషన్లలో బాండ్లను జారీ చేస్తారు. కనిష్టంగా ఒక్క గ్రామ్ బాండ్‌ను కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఒక్క ఆర్థిక సంవత్సరంలో ఒక్క ఇన్వెస్టర్ గరిష్టంగా 500 గ్రాముల వరకూ బాండ్లను కొనుగోలు చేయవచ్చు.



## బీఎస్ఎన్ఎల్ కస్టమర్లకు యప్‌టీవీ!

- 'ట్రిపుల్ ప్లే' సేవలకోసం ఇరుపక్షాల ఒప్పందం
- దీపావళికి ముందే వేతనాలు: బీఎస్ఎన్ఎల్ సీఎండీ

**సాక్షి, న్యూఢిల్లీ:** బీఎస్ఎన్ఎల్ వినియోగదారులకు త్వరలో యప్ టీవీ ట్రిపుల్ ప్లే సర్వీసులు అందుబాటులోకి రానున్నాయి. ఈ మేరకు బీఎస్ఎన్ఎల్–యప్ టీవీ సోమవారమిక్కడ అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి. ప్రత్యేక కార్యక్రమంలో బీఎస్ఎన్ఎల్ సీఎండీ పీకే పుర్వార్, యప్ టీవీ ఫౌండర్, సీఈవో ఉదయ్ రెడ్డి ఈ అవగాహన ఒప్పందాలపై సంతకాలు చేశారు. 2009లో ప్రారంభమైన యప్‌టీవీ 12 భాషల్లో 250 లైవ్ టీవీ ఛానల్స్, 5 వేలకుపైగా సినిమాలు, వందకుపైగా టీవీ షోలు, వీడియో కాన్ఫరెన్స్, గేమింగ్, ఒరిజినల్ సిరీస్, ఫస్ట్ డే ఫస్ట్ షో లాంటి సేవలను అందిస్తోంది. ఈ ఒప్పందం ద్వారా బీఎస్ఎన్ఎల్ మొబైల్ యూజర్లు, బ్రాడ్‌బ్యాండ్ వినియోగదారులకు యప్ టీవీ సేవలు అందుబాటులోకి వస్తాయి. తాజా ఉదయ్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. దేశంలోని ప్రతి గ్రామంలో బీఎస్ఎన్ఎల్ సేవలందిస్తోందని, వారందరికీ యప్‌టీవీ ట్రిపుల్ ప్లే సేవలు చేరువవుతాయని చెప్పారు.

**పునరుద్ధరణ ప్రణాళికపై సీఎండీ పుర్వార్**


బీఎస్ఎన్ఎల్ పునరుద్ధరణ ప్రణాళికను నెలలో ప్రజల ముందు ఉంచుతామని సంస్థ సీఎండీ పీకే పుర్వార్ ఈ సందర్భంగా చెప్పారు. ఈ ఏడాది చివరికల్లా 4జీ స్పెక్ట్రమ్‌ను బీఎస్ఎన్ఎల్‌కు కేటాయిస్తారని అంచనా వేస్తున్నట్టు తెలియజేశారు. ''ఉద్యోగుల వేతనాలు దీపావళికి ముందే ఈ నెల 23, 24 నాటికి చెల్లిస్తాం. టెలికం రంగం సవాళ్లతో కూడిన దశలో ఉందని మనకు తెలుసు. పోటీ వల్ల టెలికం కంపెనీలు ఆర్థిక సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. బీఎస్ఎన్ఎల్‌కు ఇతర సమస్యలూ ఉన్నాయి. ఉద్యోగుల సంఖ్య ఎక్కువ. పునరుద్ధరణ ప్యాకేజీ ద్వారా దీనికి పరిష్కారం చూపనున్నాం'' అని పుర్వార్ వివరించారు. బీఎస్ఎన్ఎల్ ఉద్యోగుల స్వచ్ఛంద పదవీ విరమణ పథకానికి ప్రభుత్వం అనుమతి తెలిపితే... రూ.74 వేల కోట్ల భారం పడుతుందని అంచనా. బీఎస్ఎన్ఎల్ ఆస్తుల్ని విక్రయించడం ద్వారా దీన్ని రికవరీ చేసుకోవాలన్నది ప్రణాళిక.




## దేశీయ పరిశ్రమ ప్రయోజనాలను పరిరక్షిస్తాం

**కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్**

**న్యూఢిల్లీ:** ప్రతిపాదిత భారీ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఆర్‌సీఈపీ) కుదుర్చుకునే ముందు దేశీయ పరిశ్రమ ప్రయోజనాలకు పరిరక్షిస్తామని కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. ప్రాంతీయ సమగ్ర ఆర్థిక సహకార (ఆర్‌సీఈపీ) ఒప్పందం కోసం 10 ఆసియాన్ సభ్య దేశాలతోపాటు వాటితో స్వేచ్ఛా వాణిజ్యం కలిగిన ఆరు దేశాల మధ్య చర్చలు జరుగుతున్న విషయం గమనార్హం. ఈ ఏడాది నవంబర్‌లోపు చర్చలు ముగించి, 2020 జూన్ నాటికి ఒప్పందం చేసుకోవాలన్న లక్ష్యాన్ని ఆసియాన్ దేశాలు విధించుకున్నాయి. ఈ నేపథ్యంలో ఆర్‌సీఈపీపై చర్చలు వచ్చే నెలలో ముగుస్తాయా? అంటూ మీడియా ప్రతినిధులు సోమవారం ఢిల్లీలో మంత్రిని ప్రశ్నించారు. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ఏదైనా కుదుర్చుకునే ముందు దేశీయ పరిశ్రమ ప్రతీ ప్రయోజనాన్ని, దేశ ప్రజల ప్రయోజనాలను సంరక్షిస్తామని ఆయన తెలిపారు. 2009–10లో కాంగ్రెస్ హయాంలో మాదిరిగా ఆదరాబాదరాగా వ్యవహరించబోమని స్పష్టం చేశారు. ఆర్‌సీఈపీ విషయమై అపరిష్కృతంగా ఉన్న అంశాలు వచ్చే నెల బ్యాంకాక్‌లో జరిగే నేతల భేటీ సందర్భంగా చర్చకు వస్తాయని భావిస్తున్నారు. దీనికి ప్రధాని మోదీ సైతం హాజరవుతారని అంచనా.



## విమానయాన రంగంపై పన్నుల భారం దించాలి: సింగ్

**వాషింగ్టన్:** విమానయాన రంగంపై పన్నుల భారం తగ్గించాలని స్పైస్‌జెట్ చీఫ్ అజయ్ సింగ్ ప్రభుత్వానికి సూచించారు. ఎంఆర్‌వో(నిర్వహణ, రిపెయిర్, ఓవర్‌హాల్) విభాగంలో భారత్ అద్భుతంగా పనిచేయగలదని అభిప్రాయపడ్డారు. భారత్‌లో పౌర విమానయాన రంగంపై అధిక పన్నుల భారం ఉందని, అంతర్జాతీయంగా పోటీ పడేందుకు ఇది అవరోధంగా ఉన్నట్టు సింగ్ చెప్పారు. ఈ మేరకు ఆయన ఓ వార్తా సంస్థతో మాట్లాడారు. ''విమానయాన రంగం ఉద్యోగాలు కల్పిస్తోంది. భారత్‌ను ప్రపంచంతో అనుసంధానిస్తోంది. కనుక దీనిపట్ల మరింత సమగ్ర దృక్పథంతో వ్యవహరించాల్సిన అవసరం ఉంది'' అని సింగ్ పేర్కొన్నారు.




epaper.sakshi.com

# ఎన్నాళ్లకెన్నాళ్లకు..!


సోమవారం శ్రీరాంసాగర్ ప్రాజెక్టు వద్ద సందర్శకుల సందడి

**సాక్షి ప్రతినిధి, నిజామాబాద్:** ఉత్తర తెలంగాణ వరప్రదాయిని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఎట్టకేలకు నిండింది. మహారాష్ట్ర పరిధిలోని ప్రాజెక్టు క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి భారీగా వరద జలాలు వచ్చి చేరుతుండటంతో మూడేళ్ల అనంతరం పూర్తి స్థాయి నీటి మట్టానికి చేరుకుంది. ఎగువ నుంచి 83 వేల క్యూసెక్కుల భారీ వరద పోటెత్తడంతో సోమవారం ఉదయం 16 గేట్లను ఎత్తి 75 వేల క్యూసెక్కుల వరద నీటిని గోదావరి నదిలోకి వదిలారు. అలాగే కాకతీయ కాలువ ద్వారా మరో ఐదు వేలు, ఎస్కేప్ గేట్ల ద్వారా మూడు వేల క్యూసెక్కులు.. 83 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సోమవారం ప్రాజెక్టులోకి 83 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగింది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 1,091 (90 టీఎంసీ) అడుగులు.

## మూడేళ్ల అనంతరం శ్రీరాంసాగర్‌కు జలకళ

- ప్రాజెక్టు 16 గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల
- కొనసాగుతున్న 83 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- ప్రాజెక్టు వద్ద పర్యాటకుల సందడి

### విద్యుత్ ఉత్పత్తి ప్రారంభం

ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతోంది. ఉత్పత్తి కేంద్రంలోని నాలుగు యూనిట్లు పని చేస్తున్నాయి. 36 మెగావాట్ల సామర్థ్యం కాగా, నీటి ఉధృతి ఎక్కువగా ఉండటంతో సామర్థ్యానికి మించి 37 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతోంది.

**మూడేళ్ల తర్వాత..**
మూడేళ్ల అనంతరం ఎస్సారెస్పీ గేట్లను ఎత్తారు. 2016 సెప్టెంబర్‌లో ఇలాగే భారీగా వరద జలాలు పోటెత్తాయి. దీంతో ప్రాజెక్టు గేట్లు ఎత్తి అప్పట్లో లక్షలాది క్యూసెక్కులు నదిలోకి వదిలారు. 2013లోనూ ప్రాజెక్టు గేట్లను ఎత్తారు. ఇలా ప్రతి మూడేళ్లకు ఒకసారి గేట్లు ఎత్తే పరిస్థితి నెలకొంది. గత ఏడాది 2018 అక్టోబర్ 21న ప్రాజెక్టులో కేవలం 41 టీఎంసీలు మాత్రమే నీళ్లున్నాయి. 2017లోనూ ప్రాజెక్టు పూర్తిగా నిండలేదు. 2015లో ప్రాజెక్టు డెడ్‌స్టోరేజీకి చేరింది. కానీ ఈసారి అక్టోబర్‌లో ప్రాజెక్టు నిండటం అరుదని నీటి పారుదలశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

**మిగులు జలాలు గోదావరి పాలు**
శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు మిగులు జలాలు వృథా అవుతున్నాయి. ఈ మిగులు జలాలను సద్వినియోగం చేసుకునేందుకు ప్రాజెక్టుకు వరద కాలువను నిర్మించారు. భారీగా ఇన్‌ఫ్లో పోటెత్తినప్పుడు నీటిని ఇలా నదిలోకి విడుదల చేయకుండా, వరద కాలువ ద్వారా మిడ్‌మానేరుకు తరలించేలా కాలువను నిర్మించారు. ఎస్సారెస్పీ పునరుజ్జీవ పథకం పనులు పూర్తి కాకపోవడంతోనే ప్రస్తుతం వరద కాలువకు నీటిని విడుదల చేయలేకపోతున్నారు.

**పర్యాటకుల సందడి**
శ్రీరాంసాగర్ ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో ప్రాజెక్టు వద్దకు పర్యాటకులు పోటెత్తారు. సమీప ప్రాంతాలకు చెందిన వారు ప్రాజెక్టు అందాలను తిలకించేందుకు వస్తున్నారు. నీటి విడుదలను తిలకిస్తూ పులకరించి పోతున్నారు. నీటి ప్రవాహం వద్ద సెల్ఫీలు దిగుతున్నారు. పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేశారు.


పొట్టలో నుంచి తీసిన ప్లాస్టిక్ కవర్లు

## చచ్చిన ఆవు పొట్టలో ప్లాస్టిక్ కవర్లు

**పటాన్‌చెరు:** సంగారెడ్డి జిల్లాలో చచ్చిపోయిన ఓ ఆవు పొట్టలో 20 కిలోల ప్లాస్టిక్ కవర్లను గుర్తించారు. అమీన్‌పూర్ మండల పశుసంవర్ధక శాఖ డాక్టర్ ప్రదీప్ తెలిపిన వివరాల ప్రకారం.. బీరంగూడ గోశాలలో ఓ ఆవుకు సోమవారం పోస్టుమార్టం నిర్వహించారు. ఆ ఆవు పొట్టలో దాదాపు 20 కిలోల ప్లాస్టిక్ వ్యర్థాలు లభించాయి. రోడ్లపై తిరుగుతుండే ఈ ఆవు ఇటీవల దూడకు జన్మనిచ్చిన సందర్భంగా గోశాలకు తరలించారు. అయితే ఆవు గోశాలలో మేత సరిగా మేయ లేదు. ఆకస్మాత్తుగా అది సోమవారం మృతి చెందింది. గోశాల నిర్వాహకులు సందేహ నివృత్తి కోసం పోస్టుమార్టం చేయించారు. దీంతో ఆవు పొట్టలో ప్లాస్టిక్ కవర్లు కనిపించాయి. 20 కిలోల వరకు ఆ కవర్లు ఉంటాయని నిర్ధారించారు. ఆవు మృతికి ప్లాస్టిక్ వ్యర్థాలే కారణమని డాక్టర్ ప్రదీప్ వివరించారు. ప్లాస్టిక్ కవర్లను ఎక్కడపడితే అక్కడ పారేయకూడదని అవి మూగజీవాలకు నష్టం కలిగిస్తున్నాయనేందుకు ఇదో ఉదాహరణ అని పర్యావరణ నిపుణులు పేర్కొంటున్నారు.

## ఆర్టీసీ డ్రైవర్‌కు గుండెపోటు


**నర్సంపేట:** వరంగల్ రూరల్ జిల్లా నర్సంపేట ఆర్టీసీ డిపోకు చెందిన డ్రైవర్ ఎల్.రాజు సోమవారం గుండెపోటుకు గురయ్యాడు. ఆర్టీసీ సమ్మె కొనసాగడం.. ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన రాకపోవడంతో మానసిక క్షోభకు గురైన రాజు తన స్వగృహంలో గుండెపోటుకు గురై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. వెంటనే ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

# కంటెయినర్‌ను ఢీకొట్టిన కారు

## ముగ్గురు మృతి

- మరో నలుగురికి తీవ్ర గాయాలు
- మృతులు కరీంనగర్ జిల్లా వాసులు
- సిద్దిపేట జిల్లా ప్రజ్ఞాపూర్ శివారులో ప్రమాదం


ప్రభాకర్‌రెడ్డి


మల్లేశ్


జనార్దన్‌రెడ్డి

**గజ్వేల్:** సిద్దిపేట జిల్లా గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లో ఆదివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు అక్కడికక్కడే మృతిచెందారు. రాణే ఫ్యాక్టరీ వద్ద ఆగి ఉన్న కంటెయినర్ లారీని కారు ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఈ సంఘటనలో మరో నలుగురు తీవ్ర గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మృతులను కరీంనగర్ జిల్లా వాసులుగా గుర్తించారు. గజ్వేల్ సీఐ ప్రసాద్ కథనం ప్రకారం.. కరీంనగర్ జిల్లా మానకొండూరు మండలం వెగురుపల్లి గ్రామానికి చెందిన ఆర్ఎంపీ డాక్టర్, టీఆర్ఎస్ నాయకుడు జంగ ప్రభాకర్‌రెడ్డి(58)తో పాటు అదే గ్రామానికి చెందిన అలుగువెల్లి జనార్దన్‌రెడ్డి(45), కానుకుంట్ల మల్లేశ్(49), నితురు పుల్లయ్య, పెరుమాండ్ల గోవర్ధన్‌గౌడ్, కోల శంకర్‌లు అదే గ్రామానికి చెందిన పబ్బంతి దేవేందర్‌కు చెందిన మహీంద్రా జైలో (ఏపీ 09 టీబీ 0525) కారులో హైదరాబాద్‌లో ఆదివారం సాయంత్రం జరిగిన ఓ కార్యక్రమానికి హాజరయ్యారు. ఆ కార్యక్రమాన్ని ముగించుకొని తిరిగి గ్రామానికి వెళ్తుండగా.. అర్ధరాత్రి 12:30 గంటల ప్రాంతంలో ప్రజ్ఞాపూర్ శివారులోని రాణే ఫ్యాక్టరీ వద్ద రాంగ్ పార్కింగ్ చేసి ఉన్న టీఎస్ 09 బీజే 3949 నంబరుగల కంటెయినర్ లారీని వీరి కారు వెనుక వైపు నుంచి వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో కారు నుజ్జునుజ్జయింది. ప్రమాద తీవ్రత వల్ల అందులో ప్రయాణిస్తున్న జంగ ప్రభాకర్‌రెడ్డి, అలుగువెల్లి జనార్దన్‌రెడ్డి, కానుకుంట్ల మల్లేశ్‌లు అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్ర గాయాలపాలైన నితురు పుల్లయ్య, పెరుమాండ్ల గోవర్ధన్‌గౌడ్, కోల శంకర్‌తో పాటు కారు డ్రైవర్ పబ్బతి దేవేందర్‌లను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. ఇందులో పుల్లయ్య సికింద్రాబాద్‌లోని యశోదా ఆసుపత్రిలోనూ, మిగతా క్షతగాత్రులు గాంధీలో చికిత్స పొందుతున్నారు. అజాగ్రత్తగా రోడ్డు పక్కన కంటెయినర్‌ను రాంగ్ పార్కింగ్ చేసి ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతదేహాలకు పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు.



## ధాన్యం.. వర్షార్పణం

**నాగర్‌కర్నూల్ అగ్రికల్చర్:** నాగర్‌కర్నూల్‌జిల్లా కేంద్రంలో సోమవారం భారీ వర్షం కురిసింది. దీంతో మార్కెట్ యార్డులోని మొక్కజొన్న తడవడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఉదయం, మధ్యాహ్న సమయంలో రెండు సార్లు కురిసిన భారీ వర్షానికి 200 క్వింటాళ్ల వరకు ధాన్యం తడిసింది. సుమారు రూ.2 లక్షల మేర నష్టం వాటిల్లింది. అయితే మార్కెట్ అధికారులు సకాలంలో కవర్లు అందించడంతో ఎక్కువ ధాన్యం తడవకుండా జాగ్రత్తపడ్డారు. సోమవారం నాటికి దాదాపు 6,030 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసినట్లు మార్కెటింగ్ శాఖ అధికారులు తెలిపారు.

# కొట్టుకుపోయిన ట్రాక్టర్

## ఇద్దరికి తప్పిన ప్రాణాపాయం

**కోడేరు:** నాగర్‌కర్నూల్ జిల్లాలో నీటి ఉధృతికి ఓ ట్రాక్టర్ కొట్టుకుపోయిన సంఘటన బావాయిపల్లి డ్యామ్ వద్ద సోమవారం చోటుచేసుకుంది. పెద్దకొత్తపల్లి మండలం జొన్నలబొగుడకు చెందిన రమేశ్, చంద్రయ్య సెంట్రింగ్ డబ్బాలు తీసుకువచ్చేందుకు ఉదయం ట్రాక్టర్‌లో రాజాపూర్‌కు బయలుదేరారు. అదే సమయంలో భారీ వర్షం కురవడంతో డ్యామ్ నుంచి నీరు ఉధృతంగా పొంగి పొర్లడంతో అటుగా వస్తున్న వీరి ట్రాక్టర్ నీటిలో కొట్టుకుపోయింది. ట్రాక్టర్‌పై ఉన్న ఇద్దరు కిందకు దూకి ఈదుకుంటూ బయటకు వచ్చారు. బావాయిపల్లి డ్యామ్ వద్ద బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని గతంలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోయినా ఫలితం లేకుండా పోయిందని, ఇప్పటికైనా ఎమ్మెల్యే స్పందించి బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.


నీటి ప్రవాహానికి కొట్టుకుపోతున్న ట్రాక్టర్

# నిద్రమత్తు.. అజాగ్రత్త

- పాల ట్యాంకర్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు
- 25 మందికి గాయాలు
- భువనగిరి జిల్లా పగిడిపల్లి వద్ద ఘటన


పగిడిపల్లిలో అగి ఉన్న పాల లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

**భువనగిరి అర్బన్:** యాదాద్రి జిల్లాలో ఆగి ఉన్న ఓ పాల ట్యాంకర్‌ను ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. సోమవారం తెల్లవారుజామున భువనగిరి మండలం పగిడిపల్లి వద్ద ఈ సంఘటన చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వరంగల్–2 డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు 42 మంది ప్రయాణికులతో హైదరాబాద్‌కు వెళ్తోంది. కాగా, పగిడిపల్లి వద్ద హైవేపై విజయ డెయిరీకి చెందిన పాలట్యాంకర్ బ్రేక్ డౌన్ కావడంతో డ్రైవర్ ట్యాంకర్‌ను రోడ్డుపై నిలిపివేసి పక్కన చెట్ల కొమ్మలు, రాళ్లు పెట్టాడు. తెల్లవారుజాము సమయంలో అక్కడికి వచ్చిన ఆర్టీసీ బస్సు డ్రైవర్ నిద్రమత్తులో నిలిపి ఉన్న ట్యాంకర్‌ను ఢీ కొట్టాడు. దీంతో బస్సులో ప్రయాణిస్తున్న 25 మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అనంతరం కొందరిని మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ కె.రాఘవేందర్‌గౌడ్ తెలిపారు. ప్రమాదానికి ఆర్టీసీ తాత్కాలిక డ్రైవర్ నిద్రమత్తు, అజాగ్రత్తే కారణమని బస్సులోని ప్రయాణికులు పేర్కొంటున్నారు.

**రోడ్డుకిందికి దూసుకెళ్లిన మరోబస్సు**
భువనగిరి పట్టణంలోని బైపాస్‌రోడ్డులో సోమవారం రాత్రి 7.30 గంటల సమయంలో పరకాల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు అదుపుతప్పి రోడ్డుకిందికి దూసుకెళ్లింది. హైదరాబాద్‌నుంచి వరంగల్‌కు వెళ్తున్న ఈ బస్సు బైపాస్ రోడ్డువద్దకు వచ్చేసరికి అదుపుతప్పింది. రోడ్డుకిందికి దూసుకెళ్లి గుంతలో ఆగింది. ఈ ప్రమాదంలో పలువురు ప్రయాణికులకు గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

# సెలవులపై వచ్చి చోరీలు

- ఆర్మీ జవానుగా ఉద్యోగం
- మూడు చోరీ కేసుల్లో నిందితుడు.. అరెస్ట్
- పిస్టల్, బుల్లెట్లు, కత్తి, చోరీ సొత్తు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ శ్వేత



**కామారెడ్డి క్రైం:** బాధ్యతాయుతమైన ఆర్మీలో ఉద్యోగం చేస్తూనే వ్యసనాలకు అలవాటు పడ్డాడు. అంతటితో ఆగకుండా దొంగతనాలు చేయడం మొదలు పెట్టి జైలుకు వెళ్లి వచ్చాడు. అయినా బుద్ధి మారలేదు. సెలవుపై ఇంటికి వచ్చిన అతను మళ్లీ తాళం వేసిన ఇళ్లలో చోరీలు చేస్తూ పోలీసులకు చిక్కాడు. ఎస్పీ శ్వేత సోమవారం ఈ కేసు వివరాలు మీడియాకు వెల్లడించారు.

**వ్యసనాలకు అలవాటు పడి..**
రాజన్న సిరిసిల్లా జిల్లా చంద్రంపేటకు చెందిన షేక్ సోహైల్ 2015 నుంచి ఆర్మీలో జవాన్‌గా విధులు నిర్వరిస్తున్నాడు. సెప్టెంబర్ 4న నెల రోజుల సెలవుపై స్వగ్రామానికి వచ్చాడు. చెడు వ్యసనాలు, జల్సాలకు అలవాటు పడిన అతడు దొంగతనాలు చేయాలని నిర్ణయించుకున్నాడు. దేవునిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాఘవేంద్ర కాలనీ, భిక్కనూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని జంగంపల్లి, మాచారెడ్డి పోలీస్‌స్టేషన్ పరిధిలో తాళం వేసిన ఉన్న ఇళ్లను ఎంచుకుని చోరీలు చేశాడు. జిల్లాలో జరిగిన మూడు చోరీ కేసుల్లో మొత్తం 3.50 తులాల బంగారం, 130 తులాల వెండి ఆభరణాలు, రూ.21 వేలు నగదును అపహరించాడు. సోమవారం ఉదయం మాచారెడ్డిలో పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా బైక్‌పై వస్తున్న సోహైల్ అనుమానాస్పదంగా కనిపించాడు. అతడిని అదుపులోకి తీసుకొని విచారించగా చోరీల వ్యవహారం బయటపడిందని ఎస్పీ తెలిపారు. నిందితుడిపై గతంలో ఓ దోపిడీ కేసు కూడా ఉన్నట్లు పేర్కొన్నారు. 2017లో ఇదే తరహాలో సెలవుపై ఇంటికి వచ్చిన అతడు వేములవాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఓ దోపిడీ కేసులో ప్రధాన నిందితుడు. అతనిపై కేసు నమోదు కాగా పోలీసులు రిమాండ్‌కు పంపారు. కొద్దిరోజుల తర్వాత బెయిల్‌పై తిరిగి వచ్చి మళ్లీ ఉద్యోగానికి వెళ్లాడు. ఇప్పటికి ఆ కేసు పై కోర్టులో విచారణ కొనసాగుతుంది.

**పిస్టల్, బుల్లెట్‌లు స్వాధీనం**
దొంగతనాలకు పాల్పడుతూ కామారెడ్డి పోలీసులకు పట్టుబడిన సోహైల్ వద్ద నుంచి పోలీసులు ఓ పిస్టల్‌ను, 6 లైవ్ రౌండ్లను, 5 బుల్లెట్లను, 5 ఖాళీ క్యాట్రిడ్జిలను, ఒక కత్తిని స్వాధీనం చేసుకున్నారు. వాటితో పాటు ఆయా కేసుల్లో చోరీ చేసిన రూ. 1,13,000 విలువైన నగదు, ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. నిందితుడిని వెంటనే కోర్టులో హాజరుపర్చడంతో పూర్తి స్థాయిలో విచారించ లేదని పేర్కొన్నారు. గతంలో జరిగిన దోపిడీ కేసు విషయంలో ఆర్మీకి సమాచారం ఉందా లేదా అనే విషయంపై స్పష్టత లేదన్నారు.

## ఆర్టీసీ కార్మికుడి ఆత్మహత్యాయత్నం

**కరీంనగర్:** కరీంనగర్–1 డిపో ఎదుట సోమవారం సాయంత్రం ఆర్టీసీ డ్రైవర్ కొమిరె జంపన్న ఆత్మహత్యకు యత్నించడం స్థానికంగా కలకలం రేపింది. జేఏసీ సమ్మె పిలుపులో భాగంగా ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆర్టీసీ కార్మికులు కుటుంబ సభ్యులతో కరీంనగర్ 1, 2 డిపోల ఎదుట ధర్నా చేపట్టారు. వారిని పోలీసులు అడ్డుకుని పీటీసీ ట్రెనింగ్ సెంటర్‌కు తరలించారు. అయితే సాయంత్రం 4 గంటల తరువాత ఒక్కసారిగా జంపన్న తాను తెచ్చుకున్న రెండు లీటర్ల పెట్రోల్‌ను ఒంటిపై పోసుకోవడంతో అక్కడ ఉన్న పోలీసులు అతడిని అడ్డుకుని, అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.



